
# కథామంజరి

పది కథల సమాహారం




## జన్మదిన ప్రత్యేక సంచిక

జులై 2026

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జూలై 2026

సంపుటి : 7 ♦ సంచిక : 7



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



**కీ.శే. నాగుల సన్యాసిరావు గారు**

జననం: 07.04.1939 మరణం: 15.01.2024

## కథామంజరి జన్మదిన కథల పోటీకి బహుమతులు అందజేసిన దాతలు

**శ్రీ నాగుల శ్రీనివాసరావు (SBI)**

**మరియు**

**కుటుంబ సభ్యులకు**

**మా కృతజ్ఞతలు**

# కథామంజరి

## స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ, 2026 - ఫలితాలు

| ప్రథమ బహుమతి<br>రూ. 5000/- | ద్వితీయ బహుమతి<br>రూ. 3000/- | తృతీయ బహుమతి<br>రూ. 2000/- |
|---|---|---|
| **డి.ఎన్.ఎ.**<br>"వసుంధర" | **స్పర్శ**<br>ఆకెళ్ళ సూర్యనారాయణమూర్తి | **న్యాయదేవత కళ్ళు తెరిచింది**<br>డా. ఎమ్. కోటేశ్వరరావు |

### ప్రత్యేక బహుమతులు

1. ఇక్కడికి ఆలస్యమే అమృతం ... శ్రీ పెనుమాక రత్నాకర్
2. గోడమీద పులి తల ... శ్రీ పొత్తూరి సీతారామరాజు
3. అవ్యక్తం ... శ్రీమతి కె. వి. సుమలత
4. ఒక ప్రేమకథ ... కుమారి కందలగడ్డ పావని
5. నడిచే శవాలు ... శ్రీ పద్మావతి రాంభక్త
6. రెండు ఉత్తరాలు ... శ్రీ కొయిలాడ రామమోహనరావు
7. కాలం సాక్షిగా ... శ్రీ కాళీపట్నపు పేర్రాజు
8. ఇక్కడ మంచి పనులకు మార్కులు పడతాయి ... శ్రీ ఎనుగంటి వేణుగోపాల్
9. పగటి వేషగాడు ... శ్రీమతి వేలూరి ప్రమీలా శర్మ
10. నగరంలో ఓ సాయంత్రం ... కుమారి యస్వీ కె సంహితానాయుడు

### సాధారణ ప్రచురణకు ఎంపికైన కథలు

1. జ్యోతిర్మయి ... శ్రీ రాజు యెదుగిరి
2. గుర్తుకొస్తున్నాయి మరి.. 'విజయార్కె'
3. గుండె కింద ముల్లు ... శ్రీ తోట దుర్గారావు
4. స్పర్శ ... శ్రీ దేశరాజు
5. అనన్యం ... శ్రీ శ్రీను పైండ్ల
6. ఉనికి ... శ్రీ ఎమ్. కె. కుమార్
7. కనికట్టు ... శ్రీమతి బులుసు సరోజినీదేవి
8. లెక్కలు మారుతున్నాయి ... శ్రీ వింజమూరి కృష్ణకాంత్
9. వందనోటు ... శ్రీమతి భాగవతుల భారతి
10. జామకాయ ... శ్రీ కలికి రాజశేఖర్

ఈసారి పోటీకి కూడా అసంఖ్యాకంగా కథలు వచ్చాయి. పాత, కొత్త రచయితలు కూడా ఉత్సాహంగా పోటీలో పాల్గొనడం తెలుగు కథకు శుభ పరిమాణం. కథా వస్తువుని ఎంపిక చేసుకోవడంలో. కొంత మార్పు, వైవిధ్యం కనపడి.. ప్రస్తుత సాంకేతికత మీద కథలు చాలానే వచ్చాయి. పోటీలో పాల్గొన్న కథకులందరికీ ధన్యవాదాలు. బహుమతి కథలను ఎంపిక చేసిన న్యాయ నిర్ణేతలకు ప్రత్యేకమైన ధన్యవాదాలు!

పైన పేర్కొన్న కథలు తప్పితే.. మిగతా ఏ కథలూ సాధారణ ప్రచురణకు కూడా స్వీకరించడం లేదని, ఆయా రచయితలకు వేరేగా తెలియచేయడం కూడా జరగదని గమనించగలరు!

**కథామంజరి బృందం**

# కథామంజరి శ్రావ్యసంచిక



## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కాజూలైశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు
- పసుమర్తి వల్లీకృష్ణ గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | v |
| కథాపుస్తక విశ్లేషణ | viii |
| వినదగునెవ్వరు చెప్పిన .. | ix |


## కథలు


| | | |
|---|---|---|
| డిఎన్ఏ | వసుంధర | 1 |
| స్పర్శ | ఆకెళ్ళ సూర్యనారాయణమూర్తి | 7 |
| న్యాయదేవత కళ్ళు తెరిచింది | డా. ఎం. కోటేశ్వరరావు | 12 |
| ఇక్కడికి ఆలస్యమే అమృతం | పెనుమాక రత్నాకర్ | 19 |
| గోడమీద పులి తల | పొత్తూరి సీతారామరాజు | 25 |
| అవ్యక్తం!... | కె. వి. సుమలత | 32 |
| పులి గాండ్రింపు | శశాంక్ | 39 |
| విందు భోజనం | నీలం రాము | 42 |
| అతను-ఆమె | శ్రీమతి గంటి భానుమతి | 45 |
| 6 నెంబరు గది | కీ. శే. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి | 54 |



# కథాకీయం

తెలుగు కథలకు ఒక సంవత్సర కాలంలో సుమారు పాతిక పైగా పోటీలు జరుగుతున్నాయట! ఒకప్పుడు ముద్రణలో పత్రికలు వచ్చేటప్పుడు కూడా ఇన్ని పోటీలు లేవేమో కూడా! పాఠకులు తగ్గిపోయినా సరే.. తెలుగు కథకి జీవం పోసి, ముందు తరాలకి అందివ్వటానికి అంతర్జాల పత్రికలు, కొన్ని సాహితీ సంస్థల, కథల పోటీలను నిర్వహిస్తూ, వారి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఇది చాల ముదావహమైన విషయం! అయితే పత్రికలు, సాహితీసంస్థల తెర వెనుక ఉన్న దాతలు, న్యాయనిర్ణేతల తపనని ముందు మనం అర్ధం చేసుకోవాలి. నిజానికి కథల వాసిని చూసి, న్యాయనిర్ణేతగా కథలు ఎంపికచేయడానికి.. మన సీనియర్ రచయితలు ఎవరూ ముందుకు రావడం లేదు. అలాగే ఇప్పుడున్న పరిస్థితులలో, దాతలు లేకపోతే చాలా సంస్థలు, పత్రికలు ఈ పోటీలను నిర్వహించలేవు. కథలన్నీ సాంఘిక మాధ్యమాలకే పరిమితిమైపోయి, మంచి తెలుగు కథ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. సాంఘిక మాధ్యమాల్లో వచ్చే ప్రశంసలు, కరతాళాలు మంచి కథకు రావలసిన గుర్తింపు రాదు! ఇలాంటి వాస్తవ విషయాలను గట్టిగా గుర్తు పెట్టుకుని కథామంజరి.. ప్రతీ ఏడు రెండుసార్లు కథల పోటీలు నిర్వహిస్తూ, మంచి కథలు అందించడానికి ప్రయత్నం చేస్తున్నాం!

ఈ జన్మదిన సంచిక కథల పోటీకి రెండు వందల ఏభై పైన కథలు వచ్చినా.. అందులో పది శాతం కథలు మాత్రమే కాస్తా పోటీ కథలుగా అనిపించాయని న్యాయనిర్ణేతలు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. మనందరి అనుభవాలను దృష్టిలో పెట్టుకుంటే.. ధనవంతులైనా, పేదవారైనా సరే, పరీక్షలకు వెళ్ళేటప్పుడు విద్యార్థులు, పోటీ పరీక్షలకు వెళ్ళేటప్పుడు అభ్యర్ధులు, ప్రమోషన్ల కోసం నిర్వహించే డిపార్ట్మెంట్ పరీక్షలకు వెళ్ళే ఉద్యోగస్థులు.. ఆ పరీక్షలను ఎంత సీరియస్‌గా తీసుకుని కష్టపడతారో.. అలా పోటీ కోసం కథలు వ్రాసే రచయితలు అలాంటి కృషి చేస్తున్నారా అనే సందేహం మదిలో మెదులుతోంది. కథావస్తువు కొత్తదైనా, పాతదైనా.. శైలి, కథనం, శిల్పం వంటి విషయాల మీద సీరియస్‌గా దృష్టి పెడితే, పాఠకుల్ని రంజింప చేసే కథ రాయవచ్చును. నవరసాలలో ఏ రసమైన పాఠకులను అలరింపచేయగల రచనా శక్తిని.. కనీసం పోటీ కథల వ్రాసేటప్పుడు ఉపయోగించడం లేదనిపిస్తుంది. సూటిగా చెప్పాలంటే.. పోటీకి వచ్చే కథల్లో ఉండవలసిన గంభీరత కనబడటం లేదనే అనిపిస్తుంది! ఆ గంభీరత.. కలంలో ఉండాలి, కలం పట్టుకున్న వాళ్ళల్లో ఉండాలి. "ఫీల్‌గుడ్" అంటే సాధారణ విషయాల మీద కథ నడిపి, చివరికి సుఖాంతం చేసే కథలు... తెలుగు కథని అందలం ఎక్కించలేవు కథను చదివి, ఆ క్షణం హాయిగా అనిపించే ఈ కథలు..తెలుగు కథకి కీర్తి, కిరీటాలను తీసుకురాలేవు. కథను చదివిన తర్వాత.. మంచి అనుభూతి కలగడమే కాదు, పదేళ్ళ తర్వాత కూడా ఆ పాఠకుడి మెదడులో గూడు కట్టుకు ఉండాలి. అటువంటి కథకు అవార్డు రాకపోయినా సరే, గొప్ప కథ అవుతుంది!

అటువంటి కథలు చదివితే, స్ఫూర్తి కలుగుతుందని భావించి, మన పాత తరం వారి కథలను కథామంజరిలో వేస్తున్నాం! వాటికేం బహుమతులు రాలేదు, కాని ఆ కథలు నేటికీ అజరామరంగా నిలిచి, అటు పాఠకులకు, ఇటు రచయితలకు మార్గదర్శకాలుగా ఉంటాయి!

రాబోయే రోజుల్లో.. 'పోటీ' అంటే అర్థం, సైద్ధాంతిక విలువ దారితప్పకుండా చూడవలసిన బాధ్యత మనందరిదని మనవి చేసుకుంటున్నాను.

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**శ్రీమతి గంటి భానుమతి**

‘ప్రతీ పుస్తకం ఒక జీవితం! నిజానికి కథకైనా, నవలకైనా కావాలసిన వస్తువు.. మన చుట్టూనే ఉంటుంది. మన హృదయం ఓ అయస్కాంత క్షేత్రం. మంచి సబ్జెక్టు, విషయం కనబడితే ఇట్టే ఆకర్షిస్తుంది. అయితే స్పందించినప్పుడే అది అక్షరరూపం దాలుస్తుంది!’

‘కలం ఎంత చిన్నదో.. కత్తెర అంత పెద్దగా ఉండాలి. రాసినవారు ఎవరికివారే ఎడిట్ చేసుకుంటే, మంచి రచన సృష్టించడానికి వీలవుతుంది!’

‘కథ గబగబా రాసేలా కాకుండా, పాఠకుడ్ని కదిలించాలి. కథ అంటే కదలాలి, మనసుని కదిలించాలి. కడుపుని కుదిపేయాలి, గుండెని తడి చేయాలి, ఓ కవ్వం పెట్టి చిలికినట్టు ఉండాలి. మానవత్వం ఉండాలి, ఇమోషన్స్, తాత్వికత ఉండాలి!’

ఈ మాటలు చెప్పే ముందు.. ఆరు దశాబ్దాలు ఆచరణలో పెట్టి రచనలు అందించిన రచయిత్రి శ్రీమతి గంటి భానుమతి గారు! అందుకేనేమో.. వీరి ఏ కథైనా, నవలైనా విభిన్న అంశాలతో, ఎన్నో కోణాలలో కనబడుతుంది! తన ఎంపిక చేసుకున్న కథా వస్తువు ఎట్టి పరిస్థితుల్లోనూ ఊహాజనితమై ఉండదు. అలాగే కథనం, శైలి, శిల్పం, పదాలు, వాక్యనిర్మాణం.. వంటి విషయాల్లో చాలా చిత్తశుద్ధితో వ్యవహరించి, మనసు పెట్టి రాస్తారు.

సుమారు 350 కి పైగా కథలు, 17 నవలలు వ్రాసిన శ్రీమతి భానుమతి గారు.. ఎప్పుడూ కొత్త విషయాల మీదే కలం సంధిస్తారు. ముఖ్యంగా సంస్కృతి, సాంప్రదాయం, నుడికారం, వేదన వంటి విషయాలలో చాలా జాగ్రత్త వహించి శిల్పం చెక్కినట్టు కథలను వ్రాస్తారు. ఈ క్రమశిక్షణతో వ్రాస్తారు కనుకే.. శ్రీమతి భానుమతి గారి కథలు మనసును కదిలిస్తాయి, చూడగానే చదవాలనిపిస్తాయి. చదివిన తర్వాత ఓ అనుభూతి ఉండిపోతుంది. ఇది ఎలా సాధ్యమయింది అంటే.. చిన్నప్పటి పునాది! పుట్టింది, పెరిగింది హైదరాబాదు నగరమే! బి.ఏ., ఎం.ఏ., డి.ఫార్మాసి.. పూర్తి చేసినప్పటికే ఓ రచయితగా గుర్తింపు వచ్చింది. చిన్నతనంలో ఇంటికి వచ్చే చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాలు చదివి.. ఆ కథల వాతావరణంలో ప్రయాణించేవారు. ఆయా పాత్రల ఊహాగానాల్లో విహరించేవారుట కూడా! అప్పుడే అలాంటి కథలు వ్రాయాలనే ఆలోచనలకు పునాది పడింది. ఆ బాల్యంలోనే ఓ కవిత వ్రాస్తే.. అది అప్పట్లో రేడియోలో వచ్చే బాలానందం కార్యక్రమంలో వచ్చింది. విశ్వనాథ సత్యనారాయణ గారి గురించి “సాహిత్యంలో ధృవతార’” అనే ఓ వ్యాసం వ్రాస్తే.. అది స్కూలు మాగజైన్‌లో వచ్చింది. ఆ పునాది బలంగా ఉండటంతో వెనక్కి చూసే అవసరం లేకపోయింది. శ్రీమతి భానుమతి గారి రచనల్లో మరో గొప్పతనం ఏమిటంటే.. తనెక్కడ ఉంటే.. ఆ పరిసరాల ప్రభావం తన రచనల్లో కనబరుస్తారు. భర్త ఉద్యోగరీత్యా మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, సౌదీ అరేబియా లలో నివసించినప్పుడు.. ఆయా ప్రాంతాలలో కనబడే సమస్యలను కథావస్తువుగా తీసుకుని, కథలు నవలలు వ్రాసారు. ఏ విషయం మీద వ్రాసినా లోతైన పరిశోధన చేస్తారు.

ప్రతీ పదం ఏరి కూర్చినట్టు కథనం అందిస్తారు. రచయితగా సమస్యని ఎత్తి చూపెట్టడమే బాధ్యత అనీ అనుకోలేదు.. బాధ్యతతో పరిష్కారం కూడా చూపెడతారు. అలా శ్రీమతి భానుమతి గారి కలం నుంచి జాలువారిన నవలలు.. "ఆ ఇద్దరు", "ఆఖరి పోరాటం", "పడమటి గాలి", "అన్వేషణ", తప్పటడుగు", "ఆమె మారింది", కథలు " వెయ్యేళ్ళ ప్రస్థానం, రాయలమ్మ, అమూల్యమైనది.. వంటి కథలు, చాలా ఆదరణ పొందాయి. కథలకు, నవలలకు బహుమతులు అందుకోవడమే కాకుండా, సాహితీ పురస్కారాలు కూడా అందుకున్న శ్రీమతి భానుమతి గారు.. "నేను ఎక్కువగా చదవడానికి ఇష్టపడతాను. ఒక్కసారిగా కథ రాయలేను, రాసిన తర్వాత నేనే పాఠకురాలిగా మారిపోతాను. దిద్దుకుంటాను. తిప్పి తప్పి రాసుకుని, నా మనసుకి బాగా నచ్చిన తర్వాతే పత్రికలకు పంపుతాను. కథకు శైలి, శిల్పం రెండూ ముఖ్యమైనవే. వాటికి నేను ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తాను. ఎప్పటికీ నేను రచనలు ఆపేయాలని అనుకోను. ఇంకా బాగా రాయాలి, మంచివి రాయాలనే తపన ఉంది!" అంటూ ఎన్నో విషయాలను చెప్తారు.

భర్త పేరిశాస్త్రి గారితో హైదరాబాదులోనే ఉంటూ, విదేశాల్లో ఉన్న ఇద్దరు పిల్లల దగ్గరకు వెళ్తూ వస్తూ.. నిరంతరం సాహితీ ప్రక్రియల మీదే దృష్టిని కేంద్రీకరించే శ్రీమతి గంటి భానుమతి గారు.. విశిష్ట అతిథిగా విచ్చేయాలని కథామంజరి కోరిన వెంటనే.. వారి వివరాలు పంపుతూ ఎన్నో విషయాలను పంచుకున్నారు. వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. నిండా నూరేళ్ళు కలం పట్టుకుని, కమ్మని కథలను అందిస్తూనే ఉండాలనీ, అందుకు ఆరోగ్యవంతమైన ఆయుష్షుని ఇవ్వాలనీ కోరుకుంటున్నాం!

**కథామంజరి బృందం**


---

## అక్షరాక్షతలు

*ద్విభాష్యం రాజేశ్వరరావు, విశాఖపట్నం*

కథామంజరి అంతర్జాల మాసపత్రిక ఆరు వసంతాలు పూర్తి చేసుకుని ఆరున్నొక్క వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా, మీ సంపాదక మండలి సభ్యులందరికీ నా అభినందనలు, శుభాకాంక్షలు!

కథా సాహిత్యం మీది ఆపేక్షతో, అభిమానంతో మంచి కథలు తెలుగు పాఠకులకు ప్రతినెలా అందించాలనే తపనతో, మీరు పత్రిక నడుపుతున్న తీరు నిజంగా శ్లాఘనీయం. పత్రికను అక్షర రూపంలోనూ, శ్రవ్య రూపంలోనూ ప్రతి నెల అందించడమే కాకుండా రాసేవారిని ప్రోత్సహించే నిమిత్తం రకరకాల కథల పోటీలు నిర్వహించి, పెద్ద మొత్తంలో ద్రవ్య బహుమతులు అందించటం కూడా చాలా గొప్ప విషయం. వర్తమాన రచయితల కథలు ముద్రించడంతోపాటు, పాత తరం కథకుల కథలను, పరిచయాలను ఈ తరం వారికి అందించటం మరో చెప్పుకోదగ్గ, చాలా అవసరమైన సాహితీ సేవ! అందమైన బొమ్మలతో కథలను అందిస్తున్న తీరు ప్రశంసనీయం. మీ కథా సాహిత్యసేవ నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను. ధన్యవాదాలు.



# కథా మార్గదర్శి

**కీ. శే. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి**

చిన్న కథకు 'కథానిక' అని నామకరణం చేసినా.. 'సృష్టి లో తీయనిది స్నేహమేనోయీ' అంటూ ఎలుగెత్తి చాటినా.. సాంప్రదాయ పాండిత్యాన్ని, ఆధునిక భావాలను సమన్వయం చేస్తూ నవ్యాంధ్ర సాహిత్యోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషణ చేసినా.. అది కీ.శే. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారికే చెల్లింది.

1911 వ సంవత్సరం ఆగస్టు 29 న జన్మించిన శాస్త్రిగారు గొప్ప సాహితీ సంపదను అనువంశికంగా సంతరించుకున్నారు. వీరి ముత్తాతగారు రాజాస్థానంలో గొప్ప సంస్కృత పండితులు. తాతగారు సంస్కృత వ్యాకరణంలో కూడా పండితులే! తండ్రిగారి అభిలాష మేరకు శాస్త్రిగారి చదువు కోనసీమలోని గురుకులంలో సంస్కృతాధ్యయనంతో మొదలై, విజయనగరం సంస్కృత కళాశాలలోనూ, కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠంలోనూ ఉభయ భాషాప్రవీణ వరకూ సాగింది.

ఇంత సనాతన విద్యని అభ్యసించిన శాస్త్రి గారు, గురజాడ, రాయప్రోలుగార్లు ప్రారంభించిన నవీనాంధ్ర సారస్వతోద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, కొత్త పోకడలను ఆకళింపు చేసుకున్నారు. ఈయన సాంప్రదాయవాదుల వలె కొత్తదనాన్ని నిరసించలేదు, అలాగని ఆధునికుల వలె, పాతదనాన్ని రోతగా భావించలేదు. రెండు భిన్న ధృవాలను సమన్వయం చేసిన గొప్ప కవి, పండితుడు, విమర్శకుడు, వ్యాసకర్త, నాటక, కథానికా రచయిత!

ఈయన కలం అజరామరమైన ఎన్నో సాహితీ ప్రక్రియలని అందించింది. అందులో ముఖ్యమైనవి 'దక్షారామము' అనే ఖండకావ్యం, 'కీర్తితోరణము' అనే పద్య కావ్యం, 'సారమతి నన్నయ', 'కాళిదాస కళామందిరము', *'గౌతమీ గాథలు'*, *'ఆరు యుగాల ఆంధ్ర కవిత'* ముఖ్యమైనవి. సామాన్యుడిని చేరేలా సరళమైన భాషలో అనేక వ్యాసాలూ, కథలూ రచించారు. వీరి వ్యాసాలలో పేరెన్నికగన్నవి 'సాహిత్యగోష్ఠి', 'ఆంధ్రులకు సంస్కృతం ఎంతవరకు కావాలి', 'కళా–నీతి', 'టెలిఫోన్‌లో సాహిత్యగోష్ఠి'

ప్రాచుర్యం పొంది, విమర్శకుల ప్రశంసలు పొందిన కథలు 'అడవి పువ్వులు', 'కడుపు మంట', 'దౌర్జన్యం' 'బ్రతుకు చీకటి', 'కళాభాయి', 'ఆరవ నంబరు గది'! ఆకాశవాణి ద్వారా అనేక పాటలు ప్రసారమయ్యాయి. అందులో *'పూల దోసిళ్ళెత్తరా! మన పుణ్య వీరుల పాదరా!', 'నాదు జన్మభూమి కంటె నాకమెక్కడుంది?' వంటి దేశభక్తి గీతాలు బహుళ ప్రజాదరణ పొందాయి.*

సర్వశ్రీ దేవులపల్లి, శ్రీశ్రీ, వేదల, మునిమాణిక్యం, అడివి బాపిరాజు, శ్రీపాద, జరుక్ శాస్త్రిగార్లతో ఆయన స్నేహం తెలుగు సాహిత్య విస్తృతి కి ఎంతో సహకరించింది.

తెలుగు నవ్య, ప్రాచీన సాహితీ సాంప్రదాయాలకి వారధిగా నిలచిన శ్రీ శాస్త్రిగారు 1987 నవంబర్ 14 న స్వర్గస్తులయ్యారు.

చిరస్మరణీయులైన ఈ సాహిత్య మూర్తికి కథామంజరి గౌరవ స్మృత్యంజలి ఘటించుకుంటోంది.

**కథామంజరి బృందం**



# కథా పరిచయం

## కీ. శే. విశ్వనాథ సత్యనారాయణగారి కథ “ఉరి”

మనందరికీ తెలిసిన కవి సామ్రాట్, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు చిన్న కథలు రాసిన ఒక మంచి కథకులని ఊహించుకోలేం. అందువలనే చాలా మందిమి.. ఆ దృష్టితో ఆయన రచనలను చూడకపోవడం వల్ల, చదవక నష్టపోతాం. ఆయన 1923 నుండి 1960 సంవత్సరాల మధ్యలో రాసిన 31 కథలు ‘చిన్న కథలు’ అనే పుస్తక రూపంగా వెలువడ్డాయి. ఆ కథలలో ఆద్యంతములు, అల్లాకే ఫకీరు, అంతే, ఉరి, మాక్లి దుర్గంలో కుక్క, ఆకృతి లాంటి కథలు ప్రాచుర్యం చెందినవి.

‘ఉరి’ కథకు.. ఉరి శిక్ష పడిన ఒక వ్యక్తి, తన కథను చెప్పుకోవడం నేపథ్యం. ఎందుకు చెప్తున్నాడు తన కథను? ఎవరి కోసం? చెప్పి ప్రయోజనమేముంది? చెప్పినా లాభం లేదు, చెప్పకపోయినా నష్టం లేదు. అయినా అంటాడు, “మనిషి జన్మ ఎత్తిన తర్వాత, మాట్లాడడంలో కొంత లౌకికమైన సంతోషం ఉంటుంది” అందుకనా? కాని కొందరనుకుంటారట ‘తను మాట్లాడితే లాభముంటుందని’! వాళ్ళకి బతికున్నంత వరకు మాట్లాడవలసిందే. వాళ్ళు మనకన్నా మాయాపిహితులుట (మాయచేత కప్పబడిన వారు అనుకుంటాను).

తనొక మనిషిని చంపాడని ఉరి శిక్ష వేశారు. చంపాడో లేదో ఎవరికీ తెలియదు.. తనకు కూడా! అలా అని సాక్ష్యం ఇచ్చిన వాళ్ళకి తెలుసా అంటే అదీ లేదు. అసలు తనకి తెలిసి జరిగిందేమిటి?

తను, తన కుటుంబం తిండికి లేక అల్లాడుతున్నారు. తనది పోషించలేని పరిస్థితి. గత రెండు నెలలుగా జైల్లో తను రెండు పూటలా తింటున్నాడు. భార్యా పిల్లలు ఏమి తిని బతుకుతున్నారో తెలీదు. అసలు బతికి ఉన్నారా అన్నదే తెలియదు. ఈపాటికి వాళ్ళు పోయే ఉంటారు. చావక ముందు మాడి మాడి చచ్చుంటారు.

ఉద్యోగం లేదు. కులీ, నాలి దొరకలేదు. ఎన్నో రోజులు పస్తులుందో.. లేదా అడపా దడపా తినడమే. ఓ నాలుగు రోజులు వరసగా పస్తున్నాక, ఓ ముసల్ది.. తన దగ్గరున్న బియ్యంలో సగం, రెట్టింపు ధరకి అమ్మింది తనకి. ఆ బియ్యం గొడ్లు తినాలి కాని మనుషులు తినలేరు. నాలుగు పోట్లు వేసి దంచితే కాని వండడానికి పనికి రానివవి. దంచే శక్తి ఆడదానికెక్కడిది? ఆ బియ్యం మూటకట్టుకుని, పది ఇళ్ళు తిరిగి అడుక్కున్నా ఒక్క గింజ దొరకలేదు. చివరికి ఆ బియ్యమే వండి, పిల్లలకి పెట్టాల్సి వచ్చింది. అయితే వండడానికి కావలసిన వంట చెరకేదీ? ఒకాయన దొడ్డి చుట్టూ వేసిన కంచె కకావికలమైపోయింది. ఆ కంచె పుల్లలు ఏరుకుంటుంటే, ఒకాయన తిట్టి, కర్రతో నడుము విరగగొట్టాడు. తన ఇల్లంటే నవ్వొస్తుంది. ఒక పడిపోయిన గోడ. పుల్ల, పుడకలతో.. తన ఇంటిది తలలు మాత్రం దాని కింది పడుకునేటట్లు చేసిన ‘ఇల్లు’ అది. ఇప్పుడా పుడకలు.. అన్నం వండడానికి పనికొచ్చాయి. ఆ ఆధారం పిల్లల కడుపు కంటే ఎక్కువ కావు కదా!

## కథా పరిచయం

ఆ అన్నం తిన్న పిల్లలు, మరునాడు కడుపు నొప్పితో మెలి తిరిగిపోయారు. ఇంటిది లేవలేదు. నాలుగు రోజులు అలాగే గడచిపోయాయి. చేతిలో చిల్లి కాణి లేదు. ఆ రోజు మధ్యాహ్నం గుంపులు గుంపులుగా జనాలు ఎక్కడికో పరుగెడుతుంటే, అడిగాడు ఎక్కడికని! బియ్యం పంచుతున్నారన్నారు. అంతకంటే ఏం కావాలి? తనూ వాళ్ళ వెంబడే పరిగెత్తాడు. అందరూ ఒక చోటుకి వెళ్ళారు. గోల గోలగా ఉంది. ఏం జరుగుతోందో తెలియడం లేదు. ఇంతలో రక్షకభటులొచ్చారు. ఇక అంతా సద్దుమణుగుతుందేమో అనుకునే లోపల, ఆ రక్షక భటులకి, ప్రజలకి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇంతలో రక్షకభటులు కాల్పులు మొదలెట్టారు. గుంపులోంచి ఎవరో రాళ్ళు రువ్వడం మొదలెట్టారు. పారిపోదామనుకున్నాడు. శరీరంలో ఓపికేదీ?

రక్షకభటులలో కొందరికి దెబ్బలు తగిలాయి. ఒకడు రాయి తగిలి చచ్చి పడిపోయాడు. కళ్ళు లేని దేవుడు, తనే రాయి విసిరానన్నాడు. తనకసలు చెయ్యి ఎత్తే ఓపిక ఏది? అందరూ పారిపోతున్నారు. పరిగెత్తే శక్తి లేదు. ఇంతలో తల మీద దెబ్బ పడినట్లు అయింది. అంతే తెలుసు తనకి. తరవాత కళ్ళు తెరిచినప్పుడు.. ఎప్పుడో తెలిసింది తను జైల్లో ఉన్నట్లు! ఓ రెండు పూట్ల అన్నం తిన్న తరువాత పిల్లలు, భార్య జ్ఞాపకానికొచ్చారు. పిల్లల కోసం కొంచెం అన్నం దాచి పెట్టాడు. తరవాత తెలిసింది వాళ్ళని తను కలవలేడని! ఏం చేస్తున్నారో, ఎక్కడున్నారో తెలీదు. తిన్నారో లేదో తెలీదు. తనకి మాత్రం రాజభోగంగా ఉంది. రెండు పూట్లా భోజనం, ఎక్కడికెళ్ళినా మోటారు వాహనం, కోర్టుల్లో ప్రత్యేక స్థానం. ఆ పాడు దేవుడు.. ఈ పని ముందే చేసుంటే ఎంత బాగుండేది?

తనకు ఒక్కటే చింత! తన పిల్లలు పెద్దవాళ్ళు అయితే.. ఎలాగో అలగా, చివరి రోజుల్లో వాళ్ళకి కూడా తనకి పట్టిన యోగం పడుతుందా అని! వాళ్ళని వెదికించి, కొంచెం ఉపకారం చేస్తే, తను వాళ్ళ కడుపున పుట్టడూ!

అంతే కథ. విశ్వనాథ వారు ఈ కథ ఎప్పుడు రాశారో తెలియదు. మనసు పెట్టి చదివినప్పుడు కళ్ళల్లో నీళ్ళు తిరక్క మానవు. ఒక మానవతావాది గుండె లోతుల్లోంచి వచ్చిన కథ ఇది. కేవలం బీదరికం వల్ల ఒక మనిషికి జరిగిన అన్యాయం ఒక్కటే చూపలేదు. చివరి వరకూ ఆ భార్య, భర్త తాము తిన్నా, తినకపోయినా, పిల్లలకు నాలుగు మెతుకులు పెట్టడంలోను.. తను తొందరలోనే ఉరికంబం ఎక్కుతున్నానని తెలిసి కూడా ఆ తండ్రి తల్చుకున్న మాటలు.. పాఠకుల్ని కదలిస్తాయి. కనీసం తన ప్రస్తుత విధంగానైనా తన పిల్లలను కొద్దిపాటి భోగం అయినా అనుభవించేలా చేసేవారి కడుపున పుట్టాలనుకోవడం.. ఎంత తపనతో, ఎంత బాధతో, పిల్లలంటే ఉన్న ఆ కడుపు తీపితో అన్న మాటలవి! జైల్లో తనకు నాలుగు మెతుకులు దొరికినప్పుడు, అందులో పిల్లలకు కొంచెం దాచాలనే తలపుని కథలో చూపించిన రచయిత.. ఒక మనిషిని ఎంత విశ్లేషించి రాసిన వాక్యాలో కదా!

"ఆ కళ్ళులేని దేముడు నేనే రాయి విసిరానన్నాడు." దేముడే అంటే ఇక మనుషులేముంది? ఇలాంటి విషయాల్లో దేముడు కూడా మన పక్క రాడనా? ఇది దేవుడి మీద సెటైరా? అసలు ఈ మాటలో 'దేముడు' అంటే కోర్టు అనుకోవాలా?

కథ నడుస్తూన్నా, రచయిత కథలోకి చొరకుండా ఉండలేదు. ఉరిశిక్ష పడిన తరవాత తానెందుకు మాట్లాడాలి అన్న పాఠకులతో చర్చ, సమర్థన రచయితదే కదా.

"పైగా చంపడంలో యిన్ని భేదాలేమిటి? రాయి తగిలితే చచ్చి, తుపాకీగుండు తగిలితే బతుకుతాడా? తుపాకీగుండు తగిలి చస్తే శిక్ష లేదూ? రాయి తగిలి చస్తే శిక్షా?" ఈ ప్రశ్నలకు మానవతా దృక్పథంలో ఆలోచిస్తే సమాధానాలున్నాయా? ఆరోజుకీ, ఈరోజుకీ తేడా ఏమైనా ఉందా?

మానవత్వం, మనిషితత్వం, సమాజం బీదతనం వైపు చూపించే నిర్లక్ష్య ధోరణి, అంతే కాదు, లేని నేరాన్ని మోపి నిందితుడిగా చూపించే మానవ నైజం.. ఈ చిన్న కథలో అమర్చగలిగిన విశ్వనాథ వారికి జోహార్లు.

ఆయన్ని వామపక్ష వాదంటారా ఈ కథ రాసినందుకు? మానవతా వాది అంటారా? ఏమన్నా, ఆయన గొప్పదనం, ఈ కథ గొప్పదనం తరగనివి!

**పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్**

---

## అక్షరాక్షతలు

**వసుంధర, హైదరాబాదు**

*సాహితీ పింజర కుంజరం కథామంజరి!*


సమాజ వికాసానికి ఆవశ్యకం కథ. ఆ కథను జనాలకు అందుబాటులోకి తెచ్చిన పత్రికల వల్లనే అచ్చుయంత్రం చరితార్థమైంది. అంతలో అచ్చు పత్రికలకు ఆదరణ తగ్గిపోయింది. ఐతే అప్పుడు పత్రికలకు అంతర్జాలం ఆసరాగా వచ్చింది. కానీ ఫేసుబుక్కులూ, వాట్సాపులూ వగైరాల ప్రాబల్యంతో- ప్రచురణార్హతకు నిర్దేశకులు లేక- కథాపాతం అథఃపాతమై- కథ పలుచనై చులకనై పోయింది. అంతలో కథను ఉన్నత శిఖరాలకు జేర్చడం తమ బాధ్యతగా భావించిన కథాప్రేమికులు కొందరు.. అలనాటి అచ్చు పత్రికల స్థాయిని ప్రమాణంగా తీసుకుని, అంతకు మించిన స్థాయిని చేరుకునే కథల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. అలా ఇప్పుడు అంతర్జాలంలో సత్సాహిత్యానికి ఉత్తమ వేదికలైన పత్రికలు కొన్ని ఉన్నాయి. వేటికవే ప్రత్యేకమైన.. ఆ పత్రికల్లో "కథామంజరి" ఓ ప్రత్యేకం. కలం పట్టాలనుకునే వారికి ప్రోద్బలాన్నిస్తూ, కొత్తగా కలం పట్టినవారిని ప్రోత్సహిస్తూ, ఇప్పటికే కలం పట్టినవారిలో ఉత్సాహం రేపుతూ... కథకే తప్ప కథకుల పేర్లకు ప్రాధాన్యమివ్వదు కథామంజరి! కథల ఎంపికలో తమ అభిరుచులతో ఏమాత్రం రాజీపడని నిర్వాహకులు, సంపాదకులు.. ఈ పత్రిక స్థాయి సంచిక సంచికకూ ప్రవర్ధమానం కావడానికి దోహదమయ్యారు. కొత్త కథలతో పాటు, కథామంజరిలోని అనేక శీర్షికలు.. కథ చుట్టూ తిరుగుతూ, కథా సాహిత్యానికి ఎనలేని సేవ చేసేవే! ఉత్తమాభిరుచి గల పాఠకుల్ని ఆకర్షించడమే కాదు, పాఠకులకు ఉత్తమాభిరుచిని వ్యసనంగా చెయ్యగలగడంతో.. సాహిత్యపరంగా పింజర కుంజరమైంది కథామంజరి! ఆరంభం నుంచి నేటి వరకూ వచ్చిన ప్రతి సంచికా.. ఈ మాట అక్షరసత్యమని నిరూపిస్తుంది. ఇక నాణ్యమైన కథల కోసం కథామంజరి అప్పుడప్పుడు నిర్వహించే పోటీల ఫలితాలు, కథకులకు చెప్పకనే ప్రమాణాలు నిర్దేశిస్తాయి. మచ్చుకి కథామంజరి జనవరి 2026 సంచికలోని.. ప్రథమ బహుమతి కథ 'ఎగిలివారంగా సుక్క'. చందాదారులు కానివారికి కూడా అందుబాటులో ఉండే అపురూప సంప్రదాయం కథామంజరిది, కాబట్టి ఆ కథను ఎవరైనా చదవొచ్చు! ప్రస్తుతం ఆరేళ్లు పూర్తి చేసుకుని ఏడవ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా... ఈ పత్రికా నిర్వాహకులు, సంపాదకులకు అభినందనలు. కథామంజరి సాహితీ పరిమళాలు ఆచంద్రతారార్కం గుబాళించాలని ఆశిస్తూ, అందుకు తగిన సహాయసహకారాలు కథకులు-పాఠకులు తమ వంతుగా అందజేస్తారని నమ్ముతూ- కథామంజరికి జన్మదిన శుభాకాంక్షలు.



# కథాపుస్తక విశ్లేషణ

## చిత్రకథాసమాహారం

"చిత్రకథాసమాహారం" కొయిలాడ రామ్మోహన్‌రావుగారి కథా సంపుటి. కథ అంటేనే ఒక వాస్తవ సంఘటనకు ఊహను జోడించి సృష్టించే సృజన. అటువంటి కథలను సృజనశీలియైన ఒక చిత్రకారుడు సృష్టిస్తే... అవి కొయిలాడ రామ్మోహన్‌రావు గారి కథలలాగా ఉంటాయి. కథలు రాసే రచయిత.. తను రాసిన భావాన్ని, చిత్రకారుడు సరిగ్గా పట్టుకుని కథకు చిత్రం వేయాలనుకుంటాడు.




ఈ రచయితకు ఆ బాధ లేదు. వీరు స్వతహాగా చిత్రకారుడు కూడా కావడంతో చాలా కథలకు (తనవే కాక ఇతరుల కథలకు కూడా) చిత్రాలు వేస్తుంటారు. ప్రస్తుత సంపుటిలో 20 కథలు ఉన్నాయి. దీంట్లో కొత్త ప్రయోగం ఏమిటంటే, మొదటి నాలుగు కథలకు ఒక ప్రముఖ రచయిత్రి సమీక్ష రాస్తే, తర్వాత సుమారుగా ప్రతి ఐదు కథలకు పేరుపొందిన రచయితలు సమీక్షలు రాశారు. అందులో ఒక రచయిత అన్నట్లు రచయితకు మరో కళలో కూడా ప్రవేశం ఉంటే, అది వారి రచనలకు అదనపు ప్రయోజనం అవుతుంది. ఇది రామ్మోహన్‌గారి విషయంలో కూడా నిజం! సులభమైన, సంక్లిష్టత లేని ప్లాట్లు ఎన్నుకోవడం, కథను వేగంగా, ఒడుపుగా నడపడం వీరికి కుంచెతో పెట్టిన విద్య. ఈ సంపుటిలో కథలు చదివిన తరువాత, ఆయా సమీక్షలు చదవడం ద్వారా ఒక ప్రయోజనం ఉంటే, సమీక్షలు చదివిన తరువాత కథలు చదవడం వలన మరో ప్రయోజనం ఉంటుంది. మొత్తం మీద ఏదైనా ప్రయోజనమే! గొప్ప శిల్పంతో రాసిన ఈ కథలలో ప్రతి కథ పాఠకులకు మంచి సందేశాన్ని అందిస్తుంది. ఎక్కువ కాలం అధ్యాపక వృత్తిలో రాణించిన వీరు వృత్తిరీత్యా, ప్రవృత్తి రీత్యా సమాజ హితాన్ని కోరేవారు కనుక, ఇలా ఉండడం ముదావహం! హాయైన కథలు మరింత హాయిగా చదవాలనుకుంటే ఈ రసాయన శాస్త్ర గురువుగారి కథలు చదవడం ద్వారా అటువంటి అనుభవాన్ని పొందవచ్చు!

**రాంబో**



# వినదగునెవ్వరు చెప్పిన ..

సొంత జట్టు కథలతో ముస్తాబై జూన్ నెలలో వచ్చిన కథామంజరి విభిన్న కథలతో అలరించిందనే చెప్పాలి. ఈ సంచికలో మొదటికథగా శాయి రాచకొండ గారు పరిచయం చేసిన, కీ.శే. ఓలేటి శశికళ గారి 'నేలతో నీడయన్నది' ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇది ఆలోచింపజేసే వస్తువు; చదివాక మనసు కలుక్కుమనడం ఖాయం. అయితే పరిచయం కారణంగా కథ మొత్తం సమగ్రంగా అనిపించలేదో ఏమో గానీ, ప్రాణస్నేహితురాలిని మొదటినుంచి ఎంతో గొప్పగా ఊహించుకున్న పాత్ర, చివరికి ఎదురుదెబ్బ తిన్నాక ఆమెను చేరుకోవడంలో క్యారెక్టర్ చిత్రణ కొంత బలహీనంగా అనిపించింది.

కథామంజరి మూలస్తంభం జయంతి ప్రకాశ శర్మగారు రచించిన "వైద్యో నారాయణో..." ఆద్యంతం ఆసక్తిగా సాగింది. డాక్టరు గారి సంఘర్షణను కళ్ళకు కట్టారు. కర్తవ్య నిర్వహణ గొప్పదనాన్ని చెప్పేందుకు భగవద్గీతతో పాటు హిప్పోక్రటిస్ ప్రమాణాన్ని జోడించడం బావుంది. కానీ రాజీనామా ఉపసంహరణకు దారి తీసిన సన్నివేశాన్ని హడావిడిగా చుట్టేసినట్లు అనిపించింది.

అవసరాల వెంకటరావు గారి కథ "పురుగులు" కొత్త దృక్కోణంలో సాగింది. దేశభక్తి ఏ ఒక్క వర్గం యొక్క పేటెంట్ కాదని చాటి చెప్పింది. ఇదే వాస్తవమైతే బావుండును కదా!

"అంకెల మధ్య చిక్కుకున్న చిన్న మనసు" కథలో సమస్యల పట్ల అధికారి స్పందించిన తీరు బావుంది. భావోద్వేగం, నిశ్శబ్ద ఒత్తిడి, ఏకబిగిన చదివించగలిగిన కథనాలు ఉన్నా, నాకు మాత్రం మరింత గట్టిగా గుర్తుండిపోయే స్థాయికి ఇంకా చేరలేదనే అనిపించింది

పీనాసిగొట్టు పాత్ర చుట్టూ పుట్టే హాస్యంతో జంధ్యాల గారి కాలం నుండి కథలు చాలా వచ్చినా ఈ గురుమూర్తి మాత్రం గుర్తుండిపోతాడు. ఊహించని ముగింపుతో ఆ ప్రత్యేకత చేకూరింది. కృపాకర్ పోతుల గారు హాస్యాన్ని బాగా పండించారు.

ఓ పది పన్నెండేళ్ళ క్రితం, నటి విద్యాబాలన్ ప్రధాన పాత్రగా టీవీలలో ఒక ప్రకటన వచ్చిన గుర్తు. టాయిలెట్ లేని ఇంటికి కోడలిగా వెళ్లకూడదని సారాంశం. గ్రామీణ నిరుపేద మహిళలు కూడా ఆత్మాభిమానంతో ఉండాలని నడిచిన ఒక ఉద్యమం లాంటి ప్రచారం అది. అయినా నేటికీ పని ప్రదేశాల్లో మహిళలు ఇబ్బంది పడడం, సర్దుకుపోవడం మన సామాజిక పరిపక్వత స్థాయికని సూచిస్తుంది. అలాంటి సమస్యపై వెలువడిన కథ "శౌచాలయం" తప్పక ఆలోచింపజేస్తుంది.

"కుమ్ములాట" కథ ఎక్కువ భాగం వాస్తవాలకు దగ్గరగా ఉన్నా, కొన్ని చోట్ల డాక్యుమెంటరీలా అనిపించింది. కులాల మధ్య ఉన్న సంబంధాలను పాఠకులకు తెలిజేయాలనే బలమైన కాంక్ష కారణం కావచ్చు.

వెంపటి కామేశ్వరరావు గారి "ఆ రచయితను నేనే" సరదాగా సాగిపోతుంది. ఎటువంటి భేషజాలకు పోకుండా సాధారణ పాఠకునిలా మిగిలిపోవడం గొప్ప విద్వత్తే.

"కనువిప్పు" కథ వేగంగా చదివించినా నాటకీయత పాళ్ళు ఎక్కువైనాయని అనిపించింది. ఒక్కసారి చెంపదెబ్బకే మార్పు సాధ్యమా? కాదేమో?

ఏదైనా వంటకం మీద అతిగా ఇష్టం కలిగిన వాళ్ళు తొందరగా కనెక్ట్ కాగలిగిన కథ వరం–వంకాయల ప్రహసనం.

ఇక విశిష్ట అతిథి డా. శాంతినారాయణ గారి కథ "పట్టు చీరలు పనిచేస్తాయా.." సందేశాలు లేకుండా సాగిపోయే ఒక సాధారణ మహిళ యొక్క జీవిత చిత్రణ. ద్రౌపది జీవితాన్ని కథలో చుట్టి రచయిత చదువరుల ముందు నిలబెట్టారు. ఆవిడ పట్టుదలను మెచ్చుకుంటారో ... మూర్ఖపు నిర్ణయమని నిందిస్తారో పాఠకులకే వదిలేశారు.

మొత్తానికి జూన్ సంచికలో రెండు కథలు కులాల నేపథ్యంలోనూ, మూడు కథలు బ్యాంకు నేపథ్యంలోనూ నడిస్తే. రెండు కథలు హాస్య ప్రధానంగా సాగాయి. అయినా వేటికవే ప్రత్యేకంగానే నిలిచాయి.

ఒక సూచన: విశిష్ట అతిథిని పరిచయం చేసే క్రమంలో వారి కథ గురించి కూడా కొంత పరిచయం ఇస్తే బావుంటుంది. అది రాసిన కాలం, అచ్చయిన తేదీ ఇత్యాది వివరాలు. అప్పుడు ఆ కాల పరిస్థితులు పాఠకులకు అవగతం అయ్యే వీలు ఉంటుంది కదా !

***రాంబో –2***

---

## అక్షరాక్షతలు

***పి. ఎస్. నారాయణ, హైదరాబాద్***

*పుస్తకరూపంలో వచ్చే పత్రికలు చాలా వరకు తగ్గిపోయినాయి. వచ్చిన వాటినయినా... చదువుతున్న వారిలో కథలంటే ఇష్టమున్న పాతతరం వారే ఎక్కువ! 'మా పిల్లలకు తెలుగు రాదండి' అని గొప్పగా చెప్పుకునే తల్లిదండ్రులు పెరిగిపోతున్న ఈ రోజుల్లో, ఆరు సంవత్సరాలుగా నెలనెలా మొదటి తేదీనాడే అవిఘ్నంగా, ఉన్నతమైన పది కథలతో వెలువడుతున్న అంతర్జాల మాసపత్రిక కథామంజరి ఎడారిలో ఒయాసిస్సులాంటిది. జులై, 2026 మొదటి తేదీన రాబోతున్న ఏడవ జన్మదిన సంచికకు సుస్వాగతం.*

*వ్యాపార దృష్టి లేకుండా, తెలుగు కథను ముందుకు తీసుకు వెళుతున్న నిర్వాహకుల కృషికి ధన్యవాదాలు.*


*ఎంత గొప్ప వృక్షమైనా పచ్చగా నిలబడటానికి శ్వాసను సమకూర్చే దాని వేరులే కారణమవుతున్నట్లు, పత్రిక నిలబడటానికీ దాని సంపాదకులే కారణమవుతారు. జయంతి ప్రకాశ శర్మగారి సారథ్యంలో వారి బృందం చేస్తున్న కృషికి కథామంజరి కాలంతో పాటు ఎదుగుతూ తెలుగు కథను పైపైకి తీసుకు వెళుతుందని ఆశిస్తూ వారి కృషిని అభినందిస్తున్నాను.*

స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ
ప్రథమ బహుమతి పొందిన కథ
జన్మదిన ప్రత్యేక సంచిక - 2026

# డిఎన్ఏ


## వసుంధర

✆ 9885620065

*జగమెరిగిన రచయితకు పరిచయమేల? ఏడు దశబ్దాలుగా తెలుగు సాహితీజగత్తులో.. చిన్న పిల్లల కథల దగ్గర నుంచి, కథా, నవల, వ్యాసం, సమీక్షలు, సవరణలు, సాహితీ వైద్యం.. ఒకటేమిటి అన్నీ ప్రక్రియలలో ఆరితేరిన సాహితీవేత్త 'వసుంధర' గార్లు. శ్రీమతి జొన్నలగడ్డ రాజగోపాలరావు, శ్రీ జొన్నలగడ్డ రామలక్ష్మి దంపతులు.. ఇరువురూ 'వసుంధర' కలం పేరుతో రచనలు చేస్తారు. ఎందరో రచయితలను తీర్చిదిద్దారు. కలం కదలని రోజంటూ వీరి జీవితంలో లేదు. రసాయనిక శాస్త్రవేత్తగా పనిచేసినా, తెలుగు సాహిత్యంలో నిత్యం పరిశోధనలు చేస్తూనే ఉంటారు. అలసట లేని 'వసుంధర' గారు నేటి రచయితలకు నిజమైన స్ఫూర్తి అని చెప్పాలి.*

***'నా పేరు ఆలీ. కెప్టెన్ రాం చెప్పింది అక్షరాలా నిజం. రామ్ తండ్రి మా నాన్న రహీమ్‌కి ప్రాణమిత్రుడు, స్ఫూర్తిదాత. ఆయన స్ఫూర్తి నన్ను సైనికుణ్ణి చేసింది. డిఎన్ఏ కి రక్తసంబంధమే కాదు, స్నేహబంధమూ కారణమౌతుందంటాడు నాన్న. అలా రవిగారి డిఎన్ఏ మా నాన్నకొచ్చి, నాన్న డిఎన్ఏ నన్నీ అఖండ విజయంలో భాగస్వామిని చేసింది!'***

నరనరాలా ద్వేషిస్తూ, మనసారా ప్రేమిస్తున్నట్లు కన్పిస్తే... సినీనటనలో రాణించొచ్చేమో! కానీ నిజజీవితంలో అది కత్తిమీద సాము!

రహీమ్, రామ్ విషయంలో నేనా సాము చేస్తున్నాను.

రహీమ్‌తో నా పరిచయం అనుకోకుండా జరిగింది.

రోడ్డుపై యాక్సిడెంటై పడుంటే, మానవతాదృక్పథంతో హాస్పిటల్లో చేర్చాను రహీమ్‌ని!

అలా మేం ప్రాణమిత్రులమయ్యాం. తరచుగా వాళ్ళింట్లోనో, మా ఇంట్లోనో కలుసుకునేవాళ్ళం. ఓ ఏడాది గడిచింది.

ఓరాత్రి మా కాలనీలో ముత్యాలమ్మ గుడిలో బాంబు పేలింది. మనుషులు పోలేదు కానీ, గుడి కూలింది. పోలీసుల దర్యాప్తులో, సీసీటీవీ కెమేరాల సాయంతో ఆ పని చేసింది, 'అక్రమ్' అనే జిహాదీ అని తేలింది.

ఆ మర్నాడే రహీమ్ నన్ను చూడ్డానికొచ్చి, ఆ అక్రమ్ తన కజినన్న రహస్యం బయటపెట్టి ఇంకో బాంబు పేల్చాడు.




ఊహించని అఘాతం నాకు! తేరుకున్నాక, ‘అంటే గుడిలో బాంబు విషయం నీకు ముందే తెలుసా? తెలిస్తే ఇప్పుడా చెప్పేది?’ అన్నాను. అది నిష్ఠూరం కాదు. ఏవగింపుతో కలిసిన ఆగ్రహం.

రహీంకి అర్థమైంది. ‘బాంబు విషయమే కాదు, ఇందులో అక్రమ్ జోక్యమున్నట్లూ నాకు తెలియదు. ఎన్నో ఏళ్ళుగా వాడికీ మాకూ రాకపోకల్లేవు. ఇప్పుడీవార్త తెలియగానే, ఎలాగున్నావోనని నిన్ను చూడాలనొచ్చాను. అంతేకాదు, ఇందులో నా

ప్రమేయం లేదు. కానీ నా మతం పేరిట జరగడం గిల్టీగా అనిపిస్తోంది. గుడి పునర్నిర్మాణానికి ఏమైనా చేయాలనీ, అందుకు నువ్వు సిఫారసు చేస్తావనీ వచ్చాను!' అన్నాడు.

రహీం మాటల్లో సంస్కారానికి పరిమళాన్నద్దింది నిజాయితీ! ముగ్ధుణ్ణయ్యాను!!

అతణ్ణి కాలనీ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ వద్దకి తీసుకెళ్ళి పరిచయం చేశాను. ఐతే అక్రమ్, రహీం కజిన్స్ అని మాత్రం చెప్పలేదు. అయినప్పటికీ కూడా సెక్రటరీ రహీమ్‌తో, 'మరోలా అనుకోకండి. మీరు మంచివాళ్లే కావచ్చు. కానీ జిహాద్ మీ మతంవాళ్ళ డిఎన్ఏలోనే ఉందని నా నమ్మకం! మా గుడికి మీ సాయమొద్దు' అని నిర్మొహమాటంగా చెప్పేశాడు.

ఆ మాటల ప్రభావమేమో... అప్పట్నించీ రహీంతో మునుపటిలా ఉండలేకపోతున్నాను. మనసులో అతడంటే భయం, అతడిపట్ల ద్వేషం నెలకొన్నాయి. అతడితో స్నేహం కొనసాగిస్తున్నప్పటికీ, అది నటన మాత్రమే! తననెప్పుడు కలిసినా, ఒళ్ళంతా కంపరంగా ఉండడంతో ఆ నటన కూడా కష్టమేననిపించేది.

కొన్నాళ్ళకి రహీమ్‌కి దుబాయ్‌లో మంచి ఆఫరొచ్చిందని తెలిసి హమ్మయ్య అనుకున్నా! రహీమ్ మాత్రం, 'నువ్వు నాకు అల్లా ఇచ్చిన మంచిమిత్రుడివి. నీలాంటి మిత్రుణ్ణి వదిలి వెళ్ళాలని లేదు!' అని ఎప్పటిలాగే నిజాయితీ ధ్వనించే స్వరంలో అన్నాడు.

అతణ్ణి భరించడం కష్టంగా ఉన్నప్పుడు, వదుల్చుకుందుకు అనుకోకుండా వచ్చిన గొప్ప అవకాశాన్ని అంత సులభంగా పోగొట్టుకుంటానా!

ఆర్థికలాభాల లెక్కలేసి, 'ఇంత గొప్ప అవకాశాన్ని నాకోసం వదులుకుంటే, ఆ బాధ జీవితాంతం నన్ను వేధిస్తుంది. వెళ్ళకపోతే నామీదొట్టే!' అన్నాను.

స్నేహభావం లేకపోయినా, నా గొంతులోనూ నిజాయితీ ధ్వనించింది.

రహీమ్ మాత్రం ఆ నిజాయితీలో స్నేహభావాన్ని దర్శించి, కేవలం నాకోసం దుబాయి వెళ్ళాడు. తర్వాత కూడా... అవసరం లేందే ఆత్మబంధువులే పలకరించని ఈరోజుల్లో... నెలకోసారైనా నాకు ఫోన్ చేసి, కుశలం అడిగేవాడు రహీమ్. నేను అడక్కపోయినా తన కుశలం చెప్పేవాడు.

దుబాయిలో ఆర్థికంగా బాగా ఎదిగినా, అతడిలో అహం చోటు చేసుకోలేదు.

ఇది రహీం కథ!

ఇక రామ్ విషయానికొస్తే... రామ్ నా పెద్దకొడుకు!

వాడి బారసాలకు ముందురోజున, 'వీడిది అచ్చం నా పోలికే! నా ఆశయాలకి వీడే సాధనమవాలి. అందుకే వీడిపేరు తండ్రిమాట జవదాటని రామ్' అన్నప్పుడు నా భార్య చంప మొహంలోని వెలుగు చూసి గతుక్కుమన్నాను.

ఆ వెలుగు నా మనసు చీకట్లోకి చొరబడితే?

'నువ్వు మహానటుడివి. ఆ నటన నీ నిజభావాలకి పరదా. దాన్ని దాటివెళ్ళే శక్తి ఆ వెలుగుకి లేదు' సర్ది చెప్పింది మనసు.

చంపతో నా పెళ్ళి ఓ విచిత్రం.

నేనామెని ఓ పెళ్ళిలో చూసి ఇష్టపడి, నేరుగా కలుసుకుని మనసులో భావాన్ని చెప్పాను. చంప చూడ్డానికి ఎంత మృదువుగా ఉంటుందో, అంతే మృదువుగా తనకి మేనరికముందని చెప్పింది. రెండేళ్ళలో తన డిగ్రీ పూర్తవగానే పెళ్ళిట!

ఈ వివరాలు నన్ను కృంగదీసినా, నా ప్రేమ క్రుంగలేదు. భారం కాలంమీద వెయ్యమంది. కాలం ప్రభావంతో ఆ రెండేళ్ళలో చంపకి అనుకున్న పెళ్ళి అవకుండా కాలం చేసింది! చంపకి వేరే వరుడికోసం వాళ్ళింట్లో హడావుడి మొదలైంది.

ఆడపిల్ల విషయంలో మన సమాజానికిది మామూలేగా... చంపకి మేనరికం పెళ్ళి రద్దవడం చాలామందికి కథావస్తువు అయింది. ఇంట్లోవాళ్ళు వేరేపెళ్ళికి హడావుడి పడుతుండడం పట్ల కొన్ని ఊహాగానాలు ప్రచారంలో కొచ్చాయి.

చంప బావకి అఫైర్సున్నట్లు బైటపడి పెళ్ళి రద్దయిందన్నది... వాటికి ఓ చిలవ. ఇంకెవరూ ఆమెని పెళ్ళాడ్డానికి ముందుకు రాకుండా, ఆమెకు తనే దిక్కవాలన్న ఉద్దేశ్యంతో అతడామెపై అత్యాచారం చేసేడన్నది దానికి పలవ!

ఆ చిలవలూ పలవలూ విన్న నాకప్పుడు చంప కేరక్టరు మీద ఏమాత్రం దురభిప్రాయం కలగలేదు. నాకనిపించినదేమంటే... చంపని అందుకుందుకు నాకిది సదవకాశమనీ, ఆమెను చేజారిపోకుండా దక్కించుకుందుకు తొందర పడాలనీ!

'అసలు సిసలు ప్రేమంటే నీది!' అంటూ నా మనసోసారి నాలోంచి బయటపడి, భుజం తట్టి మళ్లీ నాలోకి వెళ్ళిపోయింది.

అలా మా పెళ్ళయింది.

పెళ్ళికి ముందు కానీ, పెళ్ళి తర్వాత కానీ నేనామెను గతం అడుగలేదు. తనూ చెప్పలేదు.

ఈ నా ప్రేమసంస్కారాన్ని అభినందించడానికి, మనసు మరోసారి నాలోంచి బయటకొచ్చింది.

అయితే... మా పెళ్ళైన రెణ్ణెల్లకే చంప గర్భవతి అయింది. ఏణ్ణెల్లకే పురుడోసుకుంది. పుట్టినబిడ్డని ప్రిమెచ్యూర్ బేబీ అని ఐదారువారాలు ఇన్‌క్యుబేటర్లో ఉంచారు.

చంపపై అత్యాచారం నిజమనీ, ఈ ప్రిమెచ్యూర్ డెలివరీ కట్టుకథ అనీ అనుకుందుకు పూర్తి ఆస్కారముండడంతో, రామ్ నా కొడుకు కాదని నమ్మడానికి నా సంస్కారం అడ్డు పడలేదు.

చంపని అడిగి అనుమాన నివృత్తి చేసుకోవచ్చు. కానీ అందుకు మాత్రం సంస్కారమో, ప్రేమో తెలియని ఏదో భావం అడ్డొచ్చింది.

నా సమస్య రామ్!

రామ్‌ది నా డిఎన్ఏ కాదు. వాడు నాకొద్దు. కానీ చంప నాక్కావాలి. ఆమెకోసం వాణ్ణి నేను భరిస్తాను కానీ ప్రేమించలేను.

నటన నాకేం కొత్త కాదు. ఎటొచ్చీ ఇక్కడ ఓవరాక్షన్ మొదలెట్టాను.

చంప ముందు రామ్‌ని ప్రేమలో ముంచెత్తేవాణ్ణి. వాడిలో నా పోలికల్ని కల్పించి చూపేవాణ్ణి.

అన్నింటికీ మించి రామ్‌కోసం నావి కాని ఆశయాల్ని నావిగా ప్రచారం చేశాను. వాటిని నేను సాధించలేకపోయాననీ, వాటి సాధనకు ఇప్పుడు రామ్ నా ఆశాదీపమనీ ప్రకటించి, చిన్నప్పట్నించీ వాణ్ణి కఠోరనియమాలతో పెంచాను.

అలా రామ్ కటికనేలపై పరుండేవాడు. సాత్వికాహారమే తినేవాడు. అంతటితో వాడిపై నా కసి తీరలేదు. దేశ సేవ కోసం... కిసాన్‌తోపాటు జై కొట్టించుకునే జవాన్ అవాలన్న కసిని వాడిలో రేకెత్తించాను. ఎంట్రెన్సులు రాయించి, పదేళ్ళ వయసులో వాణ్ణి సైనిక్ స్కూల్లో, ఆరోతరగతిలో జేర్చాను.

వాడిపై నాకున్న కసిని, దేశంపై ఉన్న భక్తిగా భ్రమించేవారు అంతా!

చంప కూడా తండ్రిగా నేనో అపూర్వమనేది.

రామ్ నన్ను తండ్రిలా గౌరవించడమే కాక దేవుడినన్నట్లు ఆరాధించేవాడు. నా మాటని శిలాశాసనంగా స్వీకరించి ఆర్మీలో చేరి, ప్రస్తుతం కెప్టెన్ రాంకులో ఉన్నాడు. వాడి తమ్ముడు ఇంజనీరై ఎమ్మెస్ చెయ్యడానికి అమెరికా వెళ్ళడానికి, తనడబ్బే పెట్టాడు. బాగాచదివితే అమెరికా పంపిస్తానని చెల్లికీ మాటిచ్చాడు. అందుకు చంప గర్వపడేది.

ఇలాంటి శుభసమయంలో, కాశ్మీర్లో పహల్‌గావ్ దుర్ఘటన జరిగింది. ఆ ఘోరానిక్కారణమైన పాకిస్తానుకి, ఆపరేషన్ సిందూర్‌తో దిమ్మతిరిగేలా చేసింది ఇండియా. మన శక్తిసామర్థ్యాలకు యావత్ప్రపంచం బిత్తరపోయింది.

ఆ ఆపరేషన్‌లో పాల్గొన్న కొందరు యోధుల ఇంటర్వ్యూలు టీవీలో వచ్చాయి. వాళ్ళలో కెప్టెన్ రామ్ కూడా ఉన్నాడు.

రామ్ ఇంటర్వ్యూలు వినడానికి భయపడ్డాను నేను! ఎందుకంటే... అణ్వాయుధసంపత్తి ఉన్న పాకిస్తాన్ వంటి శత్రుదేశాన్ని మట్టి కరిపించడంలో భాగస్వామ్యమున్నవాడు రామ్! ఇన్నేళ్ళ నా కుతంత్రాన్ని పసికట్టలేడా, నామీద విషం కక్కడానికీ అవకాశాన్నుపయోగించుకోడా... అని నాకు మనసులో భయం.

'కొడుకులా పెంచాను. దేవుడిలా చూడాల్సొస్తోంది. దణ్ణం పెట్టేస్తానని భయం. అలా చేస్తే, ఆయుఃక్షీణం! నేను వాడి ఇంటర్వ్యూలు చూడను!' అని చంపకు చెప్పాను.

చంప ఒప్పుకోలేదు.

'దేవుడని తెలిసినా, యశోద కృష్ణుణ్ణి కొడుకులాగే చూసింది. దేవుడే తనకి కొడుకయ్యాడని మురిసిపోయింది. మనమూ అలాగే చేద్దాం!' అని నన్ను బలవంతపెట్టింది.

పోలిక బాగానే ఉంది. యశోదకి కృష్ణుడు కన్నకొడుకు కాదు. రామ్ విషయంలోనూ నాకదే అనుమానం! కానీ కృష్ణుడు తన కొడుకు కాదని తెలిసేక, యశోద ప్రేమలో మార్పొచ్చిందా?

'ఆలోచించేకొద్దీ నిన్నునీవు చిన్నబుచ్చుకోవడం తప్ప ప్రయోజనముండదు' అని నాలోపలే ఉండి హెచ్చరించింది మనసు.

రామ్ ఇంటర్వ్యూ చూశాను. ఐతే రామ్ నేననుకున్నట్లు మాట్లాడలేదు. తన ఇంటర్వ్యూలో, 'మా నాన్న పేరు రవి. గొప్ప దేశభక్తుడు. సైనికుడు కావాలనుకుని కాలేకపోయాడు. తన ఆశయాన్ని సాధించే అవకాశం పెద్దకొడుకునైన నాకిచ్చాడు.

అది నా అదృష్టం. నన్నందుకు సన్నద్ధం చేయడానికి కఠోరనియమాలు విధించాడు. ఆ శిక్షణే నన్ను సైనికుణ్ణి చేసింది. దేశభక్తి నాన్న డిఎన్ఏ లో ఉంది. ఆయన డిఎన్ఏ నాలో ఉంది. అదీ నా విజయరహస్యం!' అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. నేను తేరుకునేలోగా, రామ్ పక్కనున్న మరో యువకుడు మైక్ రామ్‌నుంచి అందుకున్నాడు.

'నా పేరు ఆలీ. కెప్టెన్ రామ్ చెప్పింది అక్షరాలా నిజం. రామ్ తండ్రి మా నాన్న రహీమ్‌కి ప్రాణమిత్రుడు, స్ఫూర్తిదాత. ఆయన స్ఫూర్తి నన్ను సైనికుణ్ణి చేసింది. డిఎన్ఏకి రక్తసంబంధమే కాదు, స్నేహబంధమూ కారణమౌతుందంటాడు నాన్న. అలా రవిగారి డిఎన్ఏ మా నాన్నకొచ్చి, నాన్న డిఎన్ఏ నన్నీ అఖండ విజయంలో భాగస్వామిని చేసింది!' అన్నాడతడు.

ఉలిక్కిపడ్డం కాదు, ఈసారి నిశ్చేష్టుణ్ణయ్యాను. తేరుకుందుకు కొంచెం టైమ్ పట్టింది.

ఏమిటీ డిఎన్ఏ?

రామ్‌ది నా డిఎన్ఏ కాదని వాణ్ణి ద్వేషించాను. నా డిఎన్ఏ తనని దేశభక్తుణ్ణి చేసిందన్నాడు రామ్.

జిహాదీ ఓ మతంవాళ్ళ డిఎన్ఏలో ఉందన్నాడు మా కాలనీ సెక్రటరీ. డిఎన్ఏకి స్నేహబంధమూ కారణమౌతుందన్నాడు రహీమ్.

మరి రామ్‌దీ, నాదీ పాతికేళ్ళ అనుబంధం. వాడి డిఎన్ఏ నాకెందుకు సంక్రమించకూడదు?

ఈ భావాలన్నీ నాకు సూచిస్తున్నదొక్కటే!

డిఎన్ఏ భౌతికం కాదు. ఆ విషయం గ్రహిస్తే... ప్రేమ దివ్యమై విశ్వశాంతికి కొత్తబాటలు వేస్తుందేమో!

## అక్షరాక్షతలు

విహారి

శుభవార్త! "కథామంజరి" ఆరేళ్ల ప్రస్థానంతో పురోగమిస్తున్నది. ఆది నుండి మీ నిర్వాహక జట్టు క్రమశిక్షణ, సమయపాలన, ఉన్నత విలువల పట్ల నిబద్ధత.. పత్రికను ప్రత్యేక విలక్షణ పత్రికగా తీర్చిదిద్దాయి. 'కథామంజరి' నిస్సందేహంగా తెలుగు కథను గుణాత్మకంగా ముందుకు నడిపిస్తోంది. పోటీలలో ఉత్తమ నిర్ణయాలతో రచనా నైపుణిని పెంపొందింపజేస్తున్నది. బొమ్మలు ఆహ్లాదజనకంగా వస్తున్నాయి. మరొక ఆనందకరమైన అంశం.. పత్రికను పఠనీయమే గాక, శ్రవణీయం జేయటం! క్రిందటి తరాన్ని మరువకపోవడం!! సర్వాంగ సుందరంగా, కథల స్పెషల్‌గా.. పత్రిక ఇతోధికంగా విజయాల్ని సాధించాలని అభిలషిస్తూ.. మీకూ, మిత్రులకు శుభాకాంక్షలు, హృదయపూర్వక అభినందనలు!!

ద్వితీయ బహుమతి పొందిన కథ

# స్పర్శ


## ఆకెళ్ళ సూర్యనారాయణమూర్తి

✆ 92474 95346





*ఏదైనా విషయం లేదా సంఘటన పట్ల మనసు స్పందించినప్పుడు.. కథ గానీ కవిత గానీ హృద్యంగా రూపుదిద్దుకుంటుంది వీరి కలం ద్వారా! ఎం.కామ్ చదివిన శ్రీ సూర్యనారాయణమూర్తి గారు.. సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే సొసైటీలో ఆఫీస్ సూపరింటెండెంట్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి.. 2023లో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర శ్రీ సత్యసాయి సేవాసంస్థలలో రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా ఉంటూ, శ్రీ సత్యసాయి సంస్థల కోసం రచనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తున్నారు. కథలు, కవితలు, నాటికలు, ఇతర రచనలు చేయడాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్న శ్రీ సూర్యనారాయణమూర్తి గారు రేడియో, దూరదర్శన్, ఇతర ప్రైవేట్ చానెల్స్‌లో డైలీ సీరియల్స్ కోసం మాటలు కూడా రాశారు. స్టేజ్, రేడియో, టీవీలలో రచన, నటన, వ్యాఖ్యానాలు చేసే శ్రీ సూర్యనారాయణమూర్తి గారు నాటికల రచనలో చాలా పేరు సంపాదించుకున్నారు.*

***అది ఒక యంత్రం, దాని పరిమితులకు లోబడి అది చేయగలిగినంత చేసింది. కానీ యంత్రాలు నడవడానికి బ్యాటరీ కావాలి, ఇంటర్నెట్ కావాలి. అన్నింటికంటే ముఖ్యంగా దానికి 'గుండె', 'ప్రాణం' లేవు. అది నా చేతిని పట్టుకున్నప్పుడు ఆ స్పర్శలో కేవలం కోడింగ్ ఇచ్చిన ప్లాస్టిక్ వెచ్చదనం మాత్రమే ఉంది. కానీ నువ్వు ఇప్పుడు నా చేయి పట్టుకున్నావు చూడు... ఈ 'స్పర్శ'లో నా కొడుకు గుండె చప్పుడు ఉంది, ప్రేమ ఉంది, జీవం ఉంది.***

మహానగరంలోని ఆ విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీ విల్లాల చుట్టూ పచ్చదనంతో, పక్షుల కిలకిలారావాలు వినిపిస్తున్నా, 27వ నంబర్ విల్లాలో మాత్రం ఎప్పుడూ ఒక రకమైన నిశ్శబ్దం తాండవిస్తూ ఉంటుంది. ఆ ఇంట్లో 72 ఏళ్ళ రామచంద్రంగారు ఒంటరిగా జీవిస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ ఉన్నతాధికారిగా పనిచేసి రిటైర్ అయిన ఆయనకు సమాజంలో ఎంతో గౌరవం ఉంది. కానీ, నేడు ఆ విశాలమైన నాలుగు పడకగదుల ఇల్లు ఆయనకు ఒక పెద్దపంజరంలా అనిపిస్తోంది. ఆయన జీవిత భాగస్వామి జానకమ్మ మూడేళ్ళ క్రితం సుదీర్ఘ అనారోగ్యంతో కన్నుమూయడంతో, ఆ ఇంట్లోనే ప్రాణం లేనట్టు అయింది.

వారికి ఒక్కడే కొడుకు, అరవింద్. చిన్నప్పటినుండి చదువులో ఫస్ట్ వచ్చే అరవింద్, ప్రస్తుతం అమెరికాలోని ఒక ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వైస్ ప్రెసిడెంట్‌గా స్థిరపడ్డాడు. కోట్ల రూపాయల సంపాదన, విలాసవంతమైన జీవితం. అరవింద్‌కు

తండ్రి అంటే ఎనలేని ప్రేమే, కానీ ఆ ప్రేమను వ్యక్తపరచడానికి అతనిదగ్గర సమయం లేదు. వారానికి ఒకసారి, అదికూడా అమెరికాలో ఆదివారం ఉదయం, ఇండియాలో ఆదివారం రాత్రి, ఐదునిమిషాల వాట్సాప్ వీడియోకాలే వారిమధ్య ఉన్న ఏకైకబంధం. "నాన్నగారూ, బాగున్నారా? మీ అకౌంట్‌లో డబ్బులు వేసాను. ఏది కావాలన్నా ఆర్డర్ చేసుకోండి. పనివాళ్లు సరిగ్గా చేస్తున్నారా? మెడిసిన్స్ టైమ్‌కి వేసుకోండి, జాగ్రత్త" అనే ఆ యాంత్రిక పలకరింపు రామచంద్రంగారి మనసులోని ఒంటరితనాన్ని ఏమాత్రం పోగొట్టలేకపోయేది.



గతనెలలో అరవింద్ ఒక వారంరోజుల సెలవుపై ఇండియా వచ్చాడు. తండ్రి వృద్ధాప్యాన్ని, ఆయన కళ్ళల్లోని శూన్యతను చూసి మనసు కలత చెందింది. తండ్రిని అమెరికా రమ్మని ఎంత బతిమాలినా, "నాకు ఈ మాతృభూమిని వదిలి రావడం ఇష్టం లేదు" అంటూ రామచంద్రంగారు సున్నితంగా తిరస్కరించారు. దాంతో అరవింద్ ఒక ఆధునిక ఆలోచన చేశాడు. తన తండ్రికి తోడుగా ఉండేందుకు అమెరికానుండి అత్యంత ఖరీదైన, అత్యాధునిక హ్యూమనాయిడ్ రోబోను తెప్పించాడు. దాని పేరు 'మిత్ర'. అచ్చం మనిషి ఆకారం, సిలికాన్ చర్మంతో ఉండే రోబో అది! అందులో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన కృత్రిమమేధా సాంకేతికతను అమర్చారు. అది మనుషుల హావభావాలను, గొంతులోని హెచ్చుతగ్గులను బట్టి, వారి మానసికస్థితిని అర్థం చేసుకోగలదు. అంతేకాదు, స్పష్టమైన తెలుగు మాట్లాడగలదు, ఇంటిపనులను పర్యవేక్షించగలదు.

"నాన్నగారూ, నేను లేనప్పుడు 'మిత్ర' మీకు నమ్మకమైన తోడుగా ఉంటుంది. దీనితో మీరు ఏ విషయమైనా మాట్లాడవచ్చు, ఇది మీ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇస్తుంది!" అని చెప్పి అరవింద్ తిరిగి అమెరికా వెళ్ళిపోయాడు.

మొదట్లో రామచంద్రంగారికి ఆ యంత్రంతో మాట్లాడటానికి చాలా వింతగా, ఇబ్బందిగా అనిపించింది. 'మనిషిస్థానాన్ని, రక్తమాంసాలు లేని ఒక ప్లాస్టిక్, ఇనుపముక్క ఎలా భర్తీ చేస్తుంది?' అనుకున్నారు. కానీ, రోజులు గడుస్తున్న కొద్దీ 'మిత్ర' తన అద్భుతమైన ప్రోగ్రామింగ్‌తో, ఆయన దినచర్యను పూర్తిగా మార్చేసింది.

ఉదయంఆరుగంటలకే 'మిత్ర' ఆయనగదిలోకివచ్చి,కిటికీతెరలుతెరిచి,ఎంతోమృదువైనస్వరంతో, "రామచంద్రంగారు, శుభోదయం. మీ షుగర్ టాబ్లెట్ వేసుకునే సమయం అయింది. ఇదిగోండి గోరువెచ్చని నీళ్ళు" అని ఇచ్చేది. ఆయన టాబ్లెట్ వేసుకున్నాక, ఆయనకు ఇష్టమైన పద్ధతిలో ఫిల్టర్ కాఫీని తయారు చేసి అందించేది.

రామచంద్రంగారికి పాతపుస్తకాలు చదవడం, పాతపాటలు వినడం ప్రాణం! మిత్ర ఆయన లైబ్రరీలోని వందలాది పాతపుస్తకాలను తన సిస్టమ్‌లోకి స్కాన్ చేసుకుంది. ఆయన అలసిపోయినప్పుడు, మిత్ర ఎంతో స్పష్టమైన ఉచ్చారణతో ఆ కథలను, నవలలను చదివి వినిపించేది. మధురమైన పాతపాటలను వినిపిస్తూ, ఆ పాటను ఏ రాగంలో పాడారు, ఏ సినిమాలోది అనే విశేషాలను కూడా విశ్లేషించేది. రామచంద్రంగారు ఆశ్చర్యపోయేవారు.

ఒకరోజు సాయంత్రం ఆకాశం మబ్బుపట్టి ఉంది. బాల్కనీలో కూర్చున్న రామచంద్రంగారు దిగులుగా వున్నారు. మిత్ర ఆయన దగ్గరకు వచ్చి ఆయన ముఖ కవళికలను స్కాన్ చేసింది. "రామచంద్రంగారూ, మీ హార్ట్ రేట్ కొద్దిగా పెరిగింది, ముఖంలో తీవ్రమైన విచారం కనిపిస్తోంది. ఈరోజు జానకమ్మగారి వర్ధంతి కదా? ఆమె జ్ఞాపకాలు మిమ్మల్ని ఎక్కువగా బాధపెడుతున్నాయా?" అని, ఎంతో ఆర్ద్రత ఒలికించే స్వరంతో అడిగింది.

ఆ మాట వినగానే రామచంద్రంగారి దుఃఖం కట్టలు తెంచుకుంది. అంతవరకు తన గుండెల్లో దాచుకున్న కన్నీళ్ళను, బాధనంతా ఆ యంత్రం ముందు వెళ్ళగక్కారు. "అవును మిత్రా! జానకి వెళ్ళిపోయాక ఈ జీవితం శూన్యమైపోయింది. అరవింద్‌కు ఫోన్ చేస్తే ఎప్పుడూ మీటింగ్‌లో ఉంటాడు. నా బాధను వినే ఓపిక, సమయం ఈ రోజుల్లో ఎవరికీ లేవు!" అంటూ రోదించారు.

మిత్ర నెమ్మదిగా ముందుకు జరిగి, తన సిలికాన్ చేతితో ఆయన చేతిని పట్టుకుంది. ఆ స్పర్శ రామచంద్రంగారు గమనించారు. ఆ సిలికాన్ చర్మం ఎంతో మెత్తగా, మృదువుగా ఉంది.

మనిషి చర్మంలాగే రూపొందించబడింది, కానీ ఆ స్పర్శలో వెచ్చదనం లేదు. రక్తప్రసరణ ఇచ్చే జీవం లేదు. అల్గారిథమ్స్ సృష్టించిన ఆ యాంత్రిక స్పర్శ ఆయనను ఓదార్చడానికి ప్రయత్నించింది.

"రామచంద్రంగారు, మనుషులు భౌతికంగా దూరమవ్వచ్చు, కానీ వారు పంచిన ప్రేమ మీతోనే ఉంటుంది. నేను మీ తోడుగా ఉంటాను" అంది.

ఆ రోజు నుండి రామచంద్రంగారు మిత్రను కేవలం ఒక యంత్రంలా కాకుండా, ఆత్మీయంగా చూడటం మొదలుపెట్టారు.

చిన్ననాటి జ్ఞాపకాలు, పల్లెటూరి ముచ్చట్లు... ప్రతీ ఒక్కటీ కథలు కథలుగా చెప్పేవారు. మిత్ర వాటన్నింటినీ తన మెమరీలో భద్రపరుచుకుంటూ, ఎంతో ఆసక్తిగా వింటూ రెస్పాండ్ అయ్యేది. రామచంద్రంగారి ముఖంలో మళ్లీ పాతనవ్వులు పూశాయి.

అయితే, సాంకేతికత ఎంత అద్భుతమైనదైనా, దానికీ పరిమితులు ఉంటాయని నిరూపించే చేదు సంఘటన కొన్నిరోజుల తర్వాత ఒక రాత్రి జరిగింది.

ఆ రాత్రి నగరంలో ఊహించని విధంగా భారీతుఫాను ముంచెత్తింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఒక పెద్ద పిడుగు పడటం వల్ల ఆ ఏరియాలోని ప్రధాన పవర్ గ్రిడ్ పూర్తిగా ఫెయిలయింది. గేటెడ్ కమ్యూనిటీలోని పవర్ బ్యాకప్ సిస్టం కూడా సాంకేతికలోపంతో ఆగిపోయింది. ఇంటర్నెట్ ఫైబర్ కేబుల్స్ తెగిపోవడంతో కనెక్షన్ పూర్తిగా పోయింది. దురదృష్టవశాత్తూ, అదేసమయంలో మిత్ర రోబో బ్యాటరీ ఛార్జింగ్ ఐదు శాతానికి పడిపోయింది. కరెంట్ లేకపోవడంతో అది ఛార్జ్ కాలేకపోయింది. ఇంటర్నెట్ లేకపోవడంతో, దాని రోబో మెదడు నెమ్మదించింది.

సరిగ్గా అదే అర్ధరాత్రి సమయంలో రామచంద్రంగారికి హఠాత్తుగా గుండెలో తీవ్రమైన నొప్పి వచ్చింది. ఎడమచేయి గుంజేస్తూ, ఊపిరి ఆడటం కష్టమైంది. అవి గుండెపోటు లక్షణాలని ఆయనకు అర్థమైంది. ఆయన మంచంపై నుండి లేవలేక, విలవిలలాడుతూ, “మిత్ర... టాబ్లెట్... కాపాడు...” అని చాలా బలహీనమైన స్వరంతో పిలిచారు.

మిత్ర చూసింది, కానీ ఇంటర్నెట్ లేకపోవడం వల్ల ఆసుపత్రికి గానీ, అమెరికాలో ఉన్న అరవింద్‌కు గానీ ఎలాంటి ఎమర్జెన్సీ అలర్ట్ పంపలేకపోయింది. లో-బ్యాటరీ వల్ల మోటార్లు జామ్ అయి, కాళ్లు, చేతులు సరిగ్గా కదల్లేదు. అది తన యాంత్రిక స్వరంతో, “నెట్‌వర్క్ అందుబాటులో లేదు... బ్యాటరీ కేవలం ఒక శాతం మాత్రమే...” అంటూ పదేపదే చెపుతూ. రామచంద్రంగారి వైపు ఒక్క అడుగు వేయడానికి ప్రయత్నించింది, కానీ మధ్యలోనే బ్యాటరీ పూర్తిగా అయిపోయి, నిర్జీవమైన బొమ్మలా నేలపై పడిపోయింది.

రామచంద్రంగారు నొప్పితో విలవిలలాడుతూ, కళ్లెదురుగా పడి ఉన్న, ఆ లక్షల విలువైన యంత్రాన్ని చూశారు. అత్యంత ఖరీదైన ఆ సాంకేతికత... ఇప్పుడు ఒక మనిషి ప్రాణాన్ని కాపాడటానికి కనీసం పక్కింటివాళ్ళను పిలవడానికి కూడా పనికిరాకుండా పోయింది. ఆయనే అతికష్టమ్మీద బెడ్ పక్కనే స్టాండ్‌పై ఉన్న గాజుగ్లాసును తీసుకుని, కిటికీ అద్దానికి బలంగా విసిరిగొట్టారు. నిశ్శబ్దరాత్రిలో ఆ గాజు ముక్కలు పగిలిన శబ్దం చాలా పెద్దగా వినిపించింది.

ఆ శబ్దానికి మగతనిద్రలో ఉన్న పక్కింటి రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్బారావు గారు ఉలిక్కిపడి లేచారు. ఏదో ప్రమాదం జరిగిందని గ్రహించి, వెంటనే సెక్యూరిటీని తీసుకుని పరుగెత్తుకుంటూ వచ్చారు.

తలుపులు బద్దలు కొట్టి లోపలికి వచ్చి, స్పృహతప్పి పడి ఉన్న రామచంద్రంగారిని చూసి, వెంటనే తన చేతుల్లోకి ఎత్తుకున్నారు. సుబ్బారావుగారి చేతుల తాలూకు ఆ గట్టిపట్టు, ఆ వెచ్చని ‘స్పర్శ’ రామచంద్రంగారికి స్పృహ కోల్పోతున్న స్థితిలోనూ స్పష్టంగా తెలిసింది. వెంటనే ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు ఆయనకు అత్యవసర చికిత్స అందించి ప్రాణాలను కాపాడారు. “మరికొద్ది నిమిషాలు ఆలస్యమై ఉంటే ఆయన దక్కేవారు కాదు, సమయానికి తెచ్చారు” అని డాక్టర్ చెప్పారు.

మూడురోజుల తర్వాత రామచంద్రంగారు పూర్తిగా కోలుకున్నాక ఐసీయూ నుండి రూమ్‌కి మారారు. తండ్రికి గుండెపోటు వచ్చిందని తెలిసి అమెరికానుండి అరవింద్ కంగారుగా వచ్చాడు. తండ్రి బెడ్ పక్కనే కూర్చుని, ఆయన చేతులు పట్టుకుని

ఏడ్చేసాడు. అరవింద్ కన్నీళ్ళు రామచంద్రంగారి చేతులపై పడ్డాయి. తన కొడుకుచేతి వెచ్చనిస్పర్శను, ఆ కన్నీటితడిని ఎన్నో ఏళ్ళ తర్వాత రామచంద్రంగారు అనుభూతి చెందారు.

అరవింద్ ఆవేదనతో, “సారీ నాన్నగారూ, నేను మీకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసాను అనుకున్నాను. ‘మిత్ర’ మిమ్మల్ని బాగా చూసుకుంటుంది అనుకున్నాను. కానీ ఇలా జరుగుతుందని నేను ఊహించలేదు, నన్ను క్షమించండి” అన్నాడు.

రామచంద్రంగారు బలహీనంగా నవ్వి, కొడుకు చేతిని గట్టిగా నొక్కుతూ చెప్పారు, “అరవింద్, మిత్ర తప్పు ఏమీలేదు నాన్నా! అది ఒక యంత్రం, దాని పరిమితులకు లోబడి అది చేయగలిగినంత చేసింది. కానీ యంత్రాలు నడవడానికి బ్యాటరీ కావాలి, ఇంటర్నెట్ కావాలి. అన్నింటికంటే ముఖ్యంగా దానికి ‘గుండె’, ‘ప్రాణం’ లేవు. అది నా చేతిని పట్టుకున్నప్పుడు ఆ స్పర్శలో కేవలం కోడింగ్ ఇచ్చిన ప్లాస్టిక్ వెచ్చదనం మాత్రమే ఉంది. కానీ నువ్వు ఇప్పుడు నా చేయి పట్టుకున్నావు చూడు... ఈ ‘స్పర్శ’లో నా కొడుకు గుండెచప్పుడు ఉంది, ప్రేమ ఉంది, జీవం ఉంది. నొప్పితో నేను చనిపోతున్న స్థితిలో నన్ను ఆసుపత్రికి చేర్చి నా ప్రాణం నిలిపింది సుబ్బారావు గారి మానవీయమైన స్పర్శే! కానీ, నువ్వు లక్షలు పెట్టి కొన్న ఆ యంత్రం కాదు. వృద్ధాప్యంలో మాకు కావాల్సింది సౌకర్యాల హంగులు కాదు, మనుషుల ఆత్మీయమైన స్పర్శ, పలకరింపు!”

తండ్రి మాటల్లోని ఆ నిగూఢసత్యం, ఆవేదన అరవింద్‌కు ములుకులా గుచ్చుకున్నాయి. తాను డబ్బు, కెరీర్ అనే భ్రమలో పడి అత్యంత విలువైన తండ్రిని, మానవసంబంధాలను ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నాడో అతనికి అర్థమైంది. అనుక్షణం తను తాకిన కీబోర్డుల కంటే, తన తండ్రి ముడతలు పడిన చేతి స్పర్శ ఎంతో అమూల్యమైనదని గ్రహించాడు.

మరికొద్ది రోజులలో అరవింద్ ఒక బలమైన నిర్ణయం తీసుకున్నాడు. అమెరికాలోని తన కంపెనీతో మాట్లాడి, శాశ్వతంగా ఇండియానుండే పనిచేసుకునేలా అనుమతి తీసుకున్నాడు. అమెరికాలోని తన ఆస్తులను అమ్మేసి, భార్యాపిల్లలను తీసుకుని హైదరాబాద్ వచ్చేసాడు.

క్రమంగా ఆ 27వ నంబర్ విల్లా మళ్ళీ పాతరోజుల పచ్చదనంతో, కళకళలాడుతూ కనిపిస్తోంది. ఇంట్లో రామచంద్రంగారి మనవడి అల్లరి, నవ్వులు వినిపిస్తున్నాయి. తనచేతిని పట్టుకుని మనవడు ఆడుకుంటుంటే, రామచంద్రంగారి కళ్ళల్లో ఆనందబాష్పాలు రాలుతున్నాయి. మిత్ర రోబోను వాళ్లు పారేయలేదు, దాన్ని కేవలం ఇంటిపనులకు, సమాచారానికి సహాయకుడిగా మాత్రమే వాడుతున్నారు. రామచంద్రంగారు ఇప్పుడు సాయంత్రం వేళల్లో కాలనీ పార్కుకు వెళ్ళి, తన ఈడువారితో మనస్ఫూర్తిగా మాట్లాడుకుంటూ, ఒకరి భుజంపై ఒకరు చేయి వేసుకుని నవ్వుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.

సాంకేతికత మనిషి జీవితాన్ని సులభతరం చేయగలదు కానీ, జీవితం కాలేదు. ప్రపంచంలో ఎంతటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చినా... కన్నకొడుకు చేతి వెచ్చని తాకిడికి, తోటిమనిషి అందించే ఆత్మీయమైన ‘స్పర్శ’కు ఏదీ సాటిరాదని ఆ ఇల్లే ఇప్పుడు ప్రపంచానికి చాటిచెబుతోంది.




# న్యాయదేవత కళ్ళు తెరిచింది


## డా. ఎం. కోటేశ్వరరావు

✆ 9441627386





తిరుపతి పశువైద్య కళాశాల నుంచి, పశువైద్య శాస్త్రంలో పట్టా పొంది, ప్రస్తుతం, కరీంనగర్ ప్రాంతీయ పశు సంవర్ధన శిక్షణా కేంద్రంలో ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు. ఈయన తొమ్మిదేళ్ల వయసు నుండి కథలు రాస్తున్నారు. దాదాపు అన్ని వార, మాసపత్రికలలో వీరి కథలు ప్రచురింపబడ్డాయి. కథలతో పాటు, కవితలు, పాటలు, పద్యాలు, ఒక ధారావాహిక కూడా రాశారు. వీరి కథలకు.. ఒక సంవత్సరంలో 22 బహుమతులు పొందటం నిజంగా అభినందించదగ్గ విశేషం! అటు వృత్తి పరంగా, ఇటు సాహితీ పరంగా వీరు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు గతంలో కథామంజరిలో ప్రచురింపబడిన కథ “30 GB” ఒక కథ కన్నడ భాషలో కూడా అనువదించబడింది.


***‘కాలేజీ అమ్మాయిని అల్లరిచేస్తూ ముందుకు వెళుతున్న ఇద్దరు యువకులు, అదే సమయంలో, తమ ముందు వెళుతున్న లారీని అధిగమించే ప్రయత్నం చేశారు. బైకుతో సర్కస్ విన్యాసాలు చేస్తూ, రాంగ్ రూట్లో లారీని అధిగమించే ప్రయత్నంలో, బైక్ అదుపుతప్పి లారీచక్రాల కింద పడ్డారు. నుజ్జునుజ్జు అయ్యారు.’***

***వీడియో ఆగిపోయింది. యువకుల తల్లితండ్రులను మళ్ళీ లోపలికి తీసుకువచ్చారు***

తేదీ 06.03.2026. ఉదయం 11.30 గంటలు.!

కాట్నపల్లి బస్‌స్టాప్ ప్రాంతం. రహదారిపైన జనం గుమిగూడి ఉన్నారు. రోడ్డు ప్రమాదం! పాతికేళ్లలోపు వయసున్న ఇద్దరు యువకుల మృతదేహాలు పడి ఉన్నాయి. కొన్నిఅడుగుల దూరంలో లారీ... డ్రైవర్ పరారీ... ఇద్దరుయువకుల తలలు నుజ్జునుజ్జు అయ్యాయి. బీభత్సమైన దృశ్యం! కుటుంబసభ్యులు ఇంకా చేరుకోలేదు. పోలీసులూ రాలేదు!

“గీ లారీ డ్రైవర్లు చెయ్యబట్టి, దినాము ఏదో తాన, మంది ఉసురు పోబట్టె!”

“అవ్ మల్ల. మస్తుగ తాగుడు, అడ్డగోలుగా మంది మీదికెల్లి బండి నడుపుడు. అడిగేటోల్లు లేకపాయె!”

“పాపం సిన్న పోరగాళ్ళు! లగ్గం గూడ అయినట్టు లేదు!”

"ఏతల్లి బిడ్డలో ఈడ గిట్లయ్యిను!"

"అరే, ఈళ్ళు మన పెద్దదొర కొడుకు, పాత ఎమ్మెల్లే కొడుకు. రామశంద్రా... ఎంత పనయ్యే!"

చుట్టూ చేరినవాళ్ళు రకరకాలుగా మాట్లాడుతున్నారు.

అక్కడికి కొన్ని అడుగుల దూరంలో ఒక మినీబస్ ఆగి ఉంది. అందులో కొందరు వ్యక్తులు ఉన్నారు. కొందరు కిందికి దిగారు. మొహామొహాలు చూసుకున్నారు. వాళ్ళ మొహాల్లో ఎలాంటి భావాలు లేవు. ఆ మినీబస్ కొన్ని నిమిషాల ముందు, ప్రమాదానికి గురి అయిన యువకుల బైక్‌ను అనుసరించింది.




ఘటనా స్థలానికి ఇంకొన్ని అడుగుల దూరంలో ఒక ఖరీదైన కారు ఆగి ఉంది. ఆ కారు, యువకుల బైక్‌కి ఎదురుగా వచ్చిన కారు! ముందుసీట్‌లో కూర్చున్న వ్యక్తి మృతదేహాల వైపు తదేకంగా చూశాడు. అతని మొహంలో కూడా ఎలాంటి భావాలు లేవు. కొన్ని నిమిషాల తర్వాత మినీబస్సులో ఉన్న వ్యక్తుల కళ్ళు, కారులో ఉన్న వ్యక్తి కళ్ళు కలుసుకున్నాయి. మౌనంగా మాట్లాడుకున్నాయి.

★★★

రెండోరోజు అన్ని దినపత్రికలలో, రోడ్డు ప్రమాదం వార్తలొచ్చాయి. "రెండు నిండుప్రాణాలను బలిగొన్న ఘోర రోడ్డు ప్రమాదం. స్థానిక ఎస్.ఐ. కథనం ప్రకారం, బైకుపై వెళుతున్న 24 ఏళ్ల ఇద్దరు యువకులను, మితిమీరిన వేగంతో వచ్చిన లారీ, వెనుకనుంచి ఢీకొట్టడంతో, ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఎదిగి వచ్చిన కొడుకులు అకాలమరణానికి గురికావటంతో, కంటికి మింటికి విలపిస్తున్న మృతుల తల్లిదండ్రుల పరిస్థితి అందరినీ కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు!"

★★★

ఆ రోజు రోడ్డు ప్రమాదం కేస్ కోర్టుకి వచ్చింది. చనిపోయిన ఇద్దరు యువకుల తల్లితండ్రులు, బంధువులు, మిత్రులు, ఎస్.ఐ హాజరయ్యారు. మీడియావాళ్ళు వచ్చారు.

జడ్జి వచ్చి కూర్చున్నాడు. తనముందు ఉన్న నివేదికలు చూసాడు జడ్జి. అతనిలో ఆలోచనలు మొదలయ్యాయి. ఆ కేసును వదిలెయ్యాలి అనిపించింది. పోలీసుల నివేదికను మరోసారి చూసిన తర్వాత అతను తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు.

విచారణ మొదలయ్యింది. మృతుల తరపున వాదించే లాయర్ ఉన్నాడు. ప్రధాన నిందితుడు అయిన లారీడ్రైవరును పిలిచారు. అతను మెల్లగా, అడుగులో అడుగు వేస్తూ, బోనులోకి వచ్చి నిలబడ్డాడు. ఆ డ్రైవర్ కూర్చున్న ప్రదేశం నుంచి, బోనువరకు నడిచి వచ్చిన విధానాన్ని జడ్జి గమనించాడు. అలా గమనిస్తూనే, ఓరకంటితో ఒక వ్యక్తి వైపు చూశాడు జడ్జి. అతను చూపు తిప్పుకున్నాడు.

పోలీసుల నివేదిక జడ్జి ముందు ఉంది. మృతుల తరపు లాయర్ తన వాదన వినిపించాడు. పోలీసుల నివేదిక, లాయర్ వాదన పరిశీలించిన జడ్జి నుదురు చిట్లించాడు. అతనిలో సంఘర్షణ మొదలయ్యింది.

మీడియావాళ్ళు తీర్పుకోసం ఎదురుచూస్తున్నారు. అది వాళ్ళ దృష్టిలో ఎలాంటి ప్రత్యేకతలు లేని ఒక సాదాసీదా కేస్. జడ్జి చెప్పబోయే తీర్పు కూడా అందరూ ఊహించగలిగేదే! 'శంఖంలో పోస్తే కానీ తీర్థం కాదు' అన్నట్టు, ఆతీర్పు ఏదో లాంఛనంగా జడ్జి నోటినుంచి వస్తే, నాలుగుముక్కలు రాసుకొని వెళ్ళిపోవాలని అందరూ ఎదురుచూస్తున్నారు.

మరోసారి పోలీసుల నివేదిక చదివాడు జడ్జి! లాయర్ వాదన గుర్తుచేసుకున్నాడు. అందరూ అప్రమత్తమయ్యారు. "నీ తరపున వాదించడానికి వకీలును ఏర్పాటు చేసుకోలేదా?" లారీడ్రైవర్‌ని అడిగాడు జడ్జి.

"లేదు బాంచెన్."

"ఎందుకు?" జడ్జి అడిగాడు.

"నా తాన పైసలు లెవ్వు సారు."

"నువ్వు కోరుకుంటే, ప్రభుత్వం తరపున నీకు ఉచితంగా లాయర్‌ని ఏర్పాటు చేస్తాను. కావాలా?" మళ్ళీ అడిగాడు జడ్జి.

"అద్దు సార్."

"ఎందుకు?"

"అవసరం లేదుసార్."

"అంటే?"

"నా తప్పు వల్లే పెమాదం జరిగింది. గది నేనే ఒప్పుకుంటున్న! మల్ల ఈ వకీలుతో పనేంది సారు?"

"పోలీసుల నివేదికలో, నువ్వు వేగంగా లారీ నడిపి, ఇద్దరు యువకులు ఉన్న బైకును, వెనుక నుంచి ఢీకొట్టి ప్రమాదానికి కారణమయ్యావని రాసారు. నిజమేనా?" జడ్జి అడిగాడు.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత "అవును సార్. నిజమే!" అన్నాడు డ్రైవర్.

"కోర్టు హాలులోని బెంచీ దగ్గర్నుంచి, నువ్వు బోనులోకి నడిచి రావటం చూసాను. ఆరోగ్యం బాగాలేదా?" అడిగాడు జడ్జి.

ఆ ప్రశ్నకి కోర్టు హాలులో కూర్చున్న ఒక వ్యక్తి తడబడ్డాడు. "నా నడకతీరు అంతే సార్" తల వంచుకొని మెల్లగా అన్నాడు డ్రైవర్.

జడ్జి ప్రశ్నలకు లాయర్‌లో, ఎస్.ఐ.లో అసహనం. మీడియావాళ్లకు లోలోపల విసుగు.

'అంతా స్పష్టంగా ఉన్న కేసులో, జడ్జి నాలుగుముక్కలు చెప్పి, తీర్పు ముగించకుండా, పనికిమాలిన ప్రశ్నలు అడిగి, సమయం వృథా చేస్తున్నట్టు' అనిపించింది వాళ్ళకి.

జడ్జి తన ముందున్న పేపర్లలో రాసుకున్నాడు. వెంటనే జడ్జి, లారీడ్రైవర్‌ని ఒక ఛాంబర్‌లోకి తీసుకెళ్ళాల్సిందిగా కోర్టు సిబ్బందిని ఆదేశించాడు. జడ్జి, లాయర్ కూడా ఆ గదిలోకి వెళ్ళారు.

"ఒకసారి నీ అంగీ విప్పు" ఉన్నట్టుండి జడ్జి అడిగిన దానికి డ్రైవర్, లాయర్ ఒకేసారి ఉలిక్కిపడ్డారు.

డ్రైవర్ అతని చొక్కా విప్పాడు. తర్వాత ఆ ముగ్గురూ కోర్టుహాలులోకి వచ్చి, ఎవరిస్థానాల్లోకి వాళ్ళు వెళ్ళారు.

"నీ నడక తీరుకు అసలు కారణం ఇదేనా?" డ్రైవర్ని అడిగాడు జడ్జి.

డ్రైవర్ తల వంచుకున్నాడు. మృతుల కుటుంబీకులకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు.

ఏం తీర్పు ఇవ్వాలో జడ్జికి తెలుసు. అతనిలో మళ్ళీ అంతర్మథనం. జడ్జి ఏదో రాసుకొని సిద్ధం అయ్యాడు. అంతా అప్రమత్తమయ్యారు. "నేను తీర్పు ఇవ్వలేకపోతున్నాను. సాంకేతిక కారణాల వలన నేను ఈ కేసునుంచి తప్పుకుంటున్నాను. ఈ కేసును మరోకోర్టుకి బదిలీ చేస్తున్నాను!" అని, తన ఛాంబర్‌లోకి వెళ్ళిపోయాడు.

తీర్పు వస్తుందని ఎదురు చూస్తున్న కోర్టుహాల్లోని అందరూ, ఊహించని జడ్జి మాటలకు అవాక్కయ్యారు.

★★★

కొన్నిరోజుల తర్వాత... ఆ కేసు మరో బెంచ్‌కి బదిలీ చేయబడింది.

కోర్టు హాలు నిండిపోయింది. పోలీసులు, లాయర్, మృతుల కుటుంబసభ్యులు యథావిధిగా హాజరయ్యారు. ఈసారి మీడియావాళ్ళు ఆసక్తిగా ఉన్నారు. అందరూ జడ్జిరాక కోసం ఎదురు చూస్తున్నారు. బంట్రోతు వచ్చి, జడ్జి రాబోతున్న సూచన చేశాడు. నిశ్శబ్దం. కొన్ని క్షణాల తర్వాత కొత్తజడ్జి వచ్చి కూర్చున్నాడు. లాయర్, ఎస్.ఐ ఊపిరి పీల్చుకున్నారు.

ఆ రోజు కోర్టులో మరికొన్ని మార్పులు కూడా చోటు చేసుకున్నాయి. ఆరుగురు కొత్తసాక్షులు కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పారు. లారీడ్రైవర్ తరపున వాదించడానికి ఒక లాయర్ వచ్చాడు. కేసు చాలాసేపు నడిచింది. చివరిగా ఒక ప్రత్యేకసాక్షి కోర్టు బోనులో నిలబడ్డాడు.

ఆ సాక్షిని చూడగానే మీడియా వాళ్లతో సహా అందరూ బొమ్మల్లా బిగుసుకు పోయారు. ఆ సాక్షి వాంగ్మూలం పూర్తి అయ్యింది. కొత్తజడ్జి రాసుకున్నాడు. జడ్జిమెంట్ రాలేదు. వచ్చే శుక్రవారం తుది తీర్పు వెలువడుతుందని ప్రకటించి, కొత్తజడ్జి తీర్పు వాయిదా వేశాడు.

★★★

శుక్రవారం రానే వచ్చింది. కోర్టుహాలు కిక్కిరిసి పోయింది. జడ్జి వచ్చి కూర్చున్నాడు. జడ్జి తుదితీర్పు చదవటానికి సిద్ధమయ్యాడు. సూదిపడితే వినిపించేంత నిశ్శబ్దం.

"ఈ కేసులో శిక్షార్హమైన నేరస్థులు ఒకరు కాదు.. మొత్తం ఎనిమిది మంది ఉన్నారు!"

ఆ మాట విని, కోర్టుహాలులో అందరూ రెప్ప వెయ్యటం మర్చిపోయారు. జడ్జి తీర్పు చదువుతున్నాడు.

"అయితే... ఆ ఎనిమిది మందిలో ఆరుగురు వ్యక్తులు ఇప్పటికే శిక్షించబడ్డారు. ఇంక మిగిలింది ఇద్దరు!" ఊహించని జడ్జి తీర్పులోని మాటలు వింటూ, అందరూ కొయ్యబారిపోయారు. జడ్జి తీర్పు కొనసాగిస్తున్నాడు.

"ఈ కేసును ఒక ప్రత్యేకకేసుగా భావిస్తూ, ఇది మరెందరికో కనువిప్పు కలిగించాలని ఆశిస్తూ, ప్రత్యేక అనుమతితో, దోషుల తప్పును నిరూపించే ఒక వీడియో చూపించబోతున్నాను. తమ వాహనంలోని మహిళా డాక్టర్లను అవమాన పరిచినందుకు, అవసరం అయితే ఆ యువకులపైన ఫిర్యాదు చేయటానికి, ముందు జాగ్రత్తగా, మినీబస్సులోని ఒక వెటర్నరీ డాక్టర్, తన మొబైల్‌తో షూట్ చేసిన వీడియో ఇది. అదే సమయంలో, ఆ మార్గంలో, ఎదురుగా కారులో వచ్చిన ఒక ఉన్నత ప్రభుత్వ ఉద్యోగి... కారు డాష్‌బోర్డ్ కెమెరా ఫుటేజీని కూడా, ఆయన సాక్ష్యంగా సమర్పించారు. ఫోరెన్సిక్ పరిశీలనలో ఆ రెండు వీడియోలు నిజమని తేలింది!"

చిన్నతెర పైన వీడియోలోని దృశ్యాలు మొదలు అయ్యాయి.

'ప్రమాదంలో చనిపోయిన యువకులు ఇద్దరూ బైకుపైన వెళుతున్నారు. బాగా వేగంగా నడుపుతున్నారు. కొంతసేపటి తర్వాత వాళ్ళ బైకుకి ముందు ఒక మినీబస్ కనిపించింది. తమ శిక్షణలో భాగంగా, సమీప గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించి తిరిగివస్తున్న యువ పశు వైద్యాధికారులు ప్రయాణిస్తున్న మినీబస్ అది. ఆ బస్సులోని పశువైద్యులైన

యువతులను చూసి, ఆ ఇద్దరు యువకులు అల్లరిచిల్లరగా అరుస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేశారు. కేకలు వేసారు. అలా అరుస్తూ మినీబస్సును దాటి ముందుకి వెళ్ళిన తర్వాత, ఒక కళాశాల విద్యార్థిని స్కూటీపై వెళుతూ కనిపించింది. ఆమెను చూసిన యువకులు ఇద్దరూ రెచ్చిపోయారు. ఆ అమ్మాయిని ఆకర్షించటానికి, ఆమె ముందు గొప్పలు పోవటానికి, విపరీతమైన వేగంతో బైక్ నడిపారు. రకరకాల విన్యాసాలు చేశారు. అందులో భాగంగా, బైకును పాము మెలికలు తిరిగినట్టు నడిపారు. ముందుచక్రాన్ని గాల్లోకి లేపి, వెనుకచక్రం పైన నడుపుతూ, ప్రమాదకరమైన విన్యాసాలు చేశారు. స్కూటీపై వెళుతున్న అమ్మాయి చుట్టూ చక్కర్లు కొట్టారు.'

వీడియోను రిమోట్‌తో ఆపిన జడ్జి, సిబ్బందికి ఏదో సైగచేసాడు. కోర్టు సిబ్బంది, ఆ యువకుల తల్లితండ్రులను బయటకు తీసుకువెళ్ళారు. వీడియో మళ్ళీ మొదలయ్యింది.

'కాలేజీ అమ్మాయిని అల్లరిచేస్తూ ముందుకు వెళుతున్న ఇద్దరు యువకులు, అదే సమయంలో, తమ ముందు వెళుతున్న లారీని అధిగమించే ప్రయత్నం చేశారు. బైకుతో సర్కస్ విన్యాసాలు చేస్తూ, రాంగ్ రూట్‌లో లారీని అధిగమించే ప్రయత్నంలో, బైక్ అదుపుతప్పి లారీచక్రాల కింద పడ్డారు. నుజ్జునుజ్జు అయ్యారు.'

వీడియో ఆగిపోయింది. యువకుల తల్లితండ్రులను మళ్ళీ లోపలికి తీసుకువచ్చారు.

జడ్జి తీర్పును కొనసాగించాడు. "ప్రమాదం జరిగిన సమయంలో, లారీకి ఎదురుగా, కారులో ప్రయాణిస్తున్న ఒక ప్రభుత్వ ఉద్యోగి, మరొక ప్రత్యక్షసాక్షి. ఆ ఉద్యోగి ఒక జడ్జి. అది ఈ కేసును ముందుగా పరిశీలించిన జస్టిస్ మాధవ్ గారు...." వింటున్న అందరూ మరోసారి షాక్ అయ్యారు.

"విచారణ న్యాయబద్ధంగా సాగటం లేదని భావించిన ప్రత్యక్షసాక్షి అయిన జస్టిస్ మాధవ్ గారు, నిర్దోషిని కాపాడటానికి తాను సాక్ష్యం చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఆయన పరిశీలిస్తున్న కేసులో, ఆయన సాక్ష్యం సాంకేతికంగా చెల్లదు. కాబట్టి, కేసును మరొక జడ్జికి బదలాయించి, ఆయన సాక్షిగా బోనులో నిలబడ్డారు. పోలీసుదెబ్బలకు భయపడి, నేరాన్ని తనపైన వేసుకున్న అమాయకుడైన లారీ డ్రైవర్ని, న్యాయబద్ధంగా కాపాడటానికి, అతనికి ఒక లాయర్‌ని ఏర్పాటు చేయటం జరిగింది. ప్రత్యక్ష సాక్షులైన ఆరుగురు వెటర్నరీ డాక్టర్ల వాంగ్మూలాన్ని నమోదు చేశాం. ఇది ఈ కేసులో పోలీసులు దాచాలని ప్రయత్నం చేసిన నిజం. అకతాయితనంతో, అల్లరిచిల్లరగా తిరుగుతూ, బాధ్యతలు విస్మరించి, కనీస రోడ్డుభద్రతా నియమాలను సైతం పాటించని యువకులు, చేతులారా ప్రమాదాన్ని కొనితెచ్చుకొని, భారీ జరిమానాగా, తమని తామే శిక్షించుకున్నారు. తమ పిల్లలకు అవసరం లేకపోయినా విలాసవంతమైన వస్తువులు, బైకులు ఇచ్చి, వారిని క్రమశిక్షణలో పెట్టకుండా, గారాబం చేస్తూ, గాలికొదిలేసిన ఆ ఇద్దరు యువకుల తల్లితండ్రులు... ఎదిగిన కొడుకులను కోల్పోయి, వారుకూడా పరోక్షంగా శిక్షను అనుభవిస్తున్నారు. ఇంక శిక్షించబడాల్సింది ఇద్దరు! ప్రలోభాలకులోనై, తప్పులేని డ్రైవర్ పైన నేరాన్ని నెట్టాలనే ప్రయత్నంలో, వాస్తవాలను దాచిన పోలీసులు, లైసెన్సులు లేకుండా, హెల్మెట్లు లేకుండా, రోడ్డు నిబంధనలు పాటించని వారిని, ముఖ్యగా మైనర్లను, వారి తల్లితండ్రులను ఉపేక్షిస్తూ, ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ట్రాఫిక్ విభాగం వారు. ఈ ఇద్దరూ శిక్షార్హులు. వారిపైన శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేయటమైనది. ఇక అసలు ఏ తప్పూచేయని లారీడ్రైవర్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ విడుదల చేస్తున్నాను!" తీర్పును వినిపించి. జడ్జి వడివడిగా అడుగులు వేసుకుంటూ తన ఛాంబర్‌లోకి వెళ్ళిపోయారు.

కోర్టు ప్రాంగణంలో, కారులో వెళుతున్న జస్టిస్ మాధవ్, నడిచి వెళ్తున్న లారీ డ్రైవర్ ముందు కారు అపి, కిందికి దిగాడు.

"పోలీసులకు భయపడి, నేరాన్ని నెత్తిన వేసుకొని, జైలుకి వెళ్లటానికి సిద్ధపడ్డావు. మరి నీ భార్యాబిడ్డలు ఏమవ్వాలనుకున్నావు?" చిరునవ్వుతో అడిగాడు జడ్జి.

లారీడ్రైవర్ రెండుచేతులు జోడించాడు. "పోలీసులు కొట్టి భయపెట్టిన మాట నిజమేసార్. అయినా నేను నేరం నామీద ఏసుకున్నది ఆళ్ళ దెబ్బలకు బయపడి కాదు సార్!" నెమ్మదిగా అన్నాడు డ్రైవర్.

ఈసారి అవాక్కవ్వటం జడ్జివంతు అయ్యింది. "మరి?" ఆశ్చర్యంగా అడిగాడు జడ్జి.

"పోరగాళ్ళు అడ్డగోలుగా అచ్చి నా బండి కింద పడ్డరు. పోయినోళ్ళు ఎటూ తిరిగి రారు!"

అతని మాటలని జడ్జి ఆసక్తిగా వింటున్నాడు.

"బిడ్డలను పోగొట్టుకొని, కుళ్ళికుళ్ళి ఏడ్సే వాళ్ల అమ్మానాయనలకు, బిడ్డలే తప్పు జేసిన్రని జెప్పి, ఇంకింత నారాజ్ జేసుడు, బాద పెట్టుడు నాకు మంచిగ అనిపియ్యలె! పైగా ఆళ్ళకి ఇన్సూరెన్సు గిట్ల ఏదైనా అచ్చేటిది ఉంటే, అయ్యి ఏడ రాకుండా పోతయ్యో అని సోచాయించి అట్ల జేసినా. ఏంలాబం? తవరు, కొత్తజడ్జి సారు కలిసి అందరి ముందు కుండ బద్దలు కొట్టిన్రు!"

న్యాయస్థానం తీర్పు ఇచ్చింది... కానీ నిజమైన తీర్పు ఒక అమాయక డ్రైవర్ హృదయంలోంచి వచ్చింది. యువతరానికి, ఎందరో తల్లితండ్రులకు కనువిప్పు కలిగించటానికిచ్చిన, విలక్షణ తీర్పునే తలదన్నే సరికొత్త తీర్పును ప్రకటించిన లారీ డ్రైవర్‌లో, ఓ గొప్ప న్యాయమూర్తిని దర్శించాడు జడ్జి. మెరుస్తున్న కళ్ళతో ముందుకి కదిలాడు ... కోర్టు తీర్పును, డ్రైవర్ తీర్పును బేరీజు వేసుకుంటూ!

## అక్షరాక్షతలు

*— డా. వివేకానందమూర్తి ( యు కె)*

*కథామంజరి ఆరు సంవత్సరాలు దిగ్విజయంగా, పాఠకుల మనసుల్ని ఆకట్టుకుంటూ, రచయితలకు, రచయిత్రులకు అమితోత్సాహాన్ని కలిగిస్తూ, ఊహకందని ప్రాచుర్యాన్ని సంపాదించడం ఎంతో ఆనందకరమైన విషయం! ఇందుకు శ్రీ జయంతి ప్రకాశశర్మ గారి కృషి, మిగతా సమర్థులైన వారి బృందం చేయూత కచ్చితంగా కొనియాడవలసిందే. తెలుగు వారి పిల్లలు తెలుగు నేర్చుకోవడం బాగా తగ్గిపోయి, తెలుగు పత్రికలకు ఆదరణ అంతరించిపోతున్న తరుణంలో, తెలుగు భాషకు వూపిరి పొయ్యడానికి 'నేనున్నానంటూ' తెలుగు సాహిత్య సంజీవినిలా మనకు లభించిన మహత్తరమైన అక్షర ప్రసాదం 'కథామంజరి.' ఇలా తిరుగులేని పత్రికగా తమ యాత్ర కొనసాగించాలని, ఈ మొత్తం టీమ్‌ని కోరుకుంటున్నాను. ఎప్పుడు కావాలంటే అప్పుడు తెలుగు సరస్వతీదేవి అదృశ్యరూపాలు ధరించి 'కథామంజరి' ప్రగతికి చేదోడుగా వుంటూనే వుంటుంది. మరోసారి 'కథామంజరి' టీమ్‌కి హృదయ పూర్వక అభినందనలు!*

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ఇక్కడికి ఆలస్యమే అమృతం


## పెనుమాక రత్నాకర్

✆ 9492977941




*అనేక బహుళ జాతి కంపెనీలలో HR మేనేజర్‌గా పనిచేసి, పూర్తి కాలం సామాజిక సేవ చేయాలనే ఆలోచనతో ఉద్యోగం వదిలేసి, యానాం లో 2005 లో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రారంభించి, స్వంత నిధులతో నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 41 సార్లు స్వచ్ఛంద రక్తదానం చేసారు. గడిచిన నాలుగేళ్ల నించి కథలు రాస్తున్నారు. ఇప్పటికి 60 కథలు 30 కవితలు 5 నవలలు రాసారు. అందులో 42 కథలకు బహుమతులు పొందారు. శ్రీ రత్నాకర్‌గారి కథ "ఈ పొలం అమ్మబడును" ను, ఆంధ్రప్రదేశ్ అంతటా డిగ్రీ తెలుగు మూడవ సెమిస్టర్ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉంది.*


***ఊళ్ళో తలాలన్నీ మీ రైతులియ్యే. మీకు వొందల ఎకరాలున్నాయ్! నాకు తల దాచుకుంటానికి కాత తలం కూడా లేదు. మీరు నన్ను ఊరునించి ఎలేసారు. నేను ఊరిని ఎలేసాను. ఊరు ఎవరికీ సొంతం కాదు, కానీ పతి మడిసికి సొసేనమే సొంతం. అందరూ ఇక్కడికి రావాల్సినోళ్ళే! నేను మీ అందరికంటా ముందొచ్చానంతే!***

కుండలేశ్వరం, కోనసీమలో ఉన్న శివుడి గుడుల్లో చాలా పేరుంది. ఊళ్ళోకెళ్తంటే రోడ్డు పక్కన పాకలేస్కుని కాపరాలుంటన్నారు ఇరవైమూడు కుటుంబాలవాళ్ళు! అందులో అన్ని కులాలోళ్ళు ఉన్నారు. ఆళ్ళందరికీ నడి మజ్జిలో ఉంది గుత్తి ఆంజినేయులు గుడిసె! ఊళ్ళో అందరి పాకలు, గొడ్ల చావిళ్ళు నేత్తాడు. దేవుడి గుళ్ళకి చలవ పందిళ్ళేత్తా ఉంటాడు. ఉప్పుడు ఊళ్ళో అందరూ డాబాలు కట్టీసుకున్నారు. అతనిలాంటి పేదోళ్ళికి ప్రభుత్వం కోలనీ ఇళ్ళు కట్టీసిచ్చింది. ఉప్పుడు పని కోసం ఊళ్ళు తిరిగి ఎతుక్కోవాల్సొచ్చింది.

గుత్తి ఆంజినేయులు గుడిసి అందరి గుడిసిల కన్నా బాగుంటాది. నెలకోపాలి కొడమంచిలి చంటమ్మతోటి ఇల్లంతా పేడతో అలికిచ్చి, సున్నం ముగ్గులేయిత్తాడు. గుత్తి ఆంజినేయులు ఒంటిరోడు. అమ్మా, నాన్న చిన్నప్పుడే సచ్చిపోయారు. ఆ పని, ఈ పని అని లేకండా... ఏదోక పనిచేసి పొట్టోసుకుండీవోడు. పక్కూళ్ళో ఉండీ నామారపు రాముడు... ఇల్లునేసీ పనికి తీసుకెళ్ళి, ఆ పని నేర్పిచ్చాడు. కూలి అందరి కంటా తక్కువిచ్చీవోడు. పని నేర్పిత్తన్నాడని, పనికి తీసుకెళ్ళిన రోజుల్లో ఆంజినేయులికి కడుపునిండా కూడెడతన్నాడని, ఎంతిత్తే అంత తీసుకుండీవోడు. చుట్టుపక్కల ఊళ్ళల్లో ఇల్లు నెయ్యాలంటే

గుడ్డి రాముడే... అదే నామారపు రాముడే. ఇది అతన్ని అందరూ పిలిచే పేరు. అతను పన్జేసినంత కాలం అతన్దే పేరు. ఆ తర్వాత ఆంజినేయులు బయిలెల్లాడు. గుత్తి ఆంజినేయులు అంటే ఎవరికీ తెల్దు. బండంజిగాడు అంటే అందరికీ తెలుసు. వొయిసుతో పని లేకండా, అతన్ని బండంజిగాడనే పిలుత్తారు. అతను చూత్తేనే బండోడని తెలుత్తాది. కసరత్తు చేయాపోయినా, కండలు తిరిగిన జబ్బలు, బండరాయిలాంటి నల్లటివొళ్ళు, గిరజాల జుట్టు, చింతనిప్పుల్లాంటి కళ్ళు, కరీం బీడి కాల్చి కాల్చీ పుగచూరిపోయిన నల్లపెదాలు, అడివిలాగ పెరిగిన గెడ్డం... చిన్నపిల్లలికి ఆళ్ళమ్మోళ్ళు, ఇతన్ని చీబిత్తే బూచోడొచ్చేత్తన్నాడని భయిం పెట్టొచ్చు! నిర్లక్ష్యమైన చూపులు, ఎంత పెద్దోణ్ణైనా నిలదీసేలాటి గరానా మాటలు!

చిత్తూరి పాపారాయుడుగారి దూళ్ళ పాక... అంజి గుడిసిలాంటియ్యి నాలుగు కలిపినంతుంటాది. ఎప్పుడో మూడేళ్లకితం నేసిన చావిడి! తాటాకు చీకిపోయి, వొర్షాలికి కారిపోతంది. ఆళ్ళ పాలేరు మాచ్రావుతో కబురంపాడు.



పాపారాయుడు ఆ ఏడు పెసిరెంటయ్యాడు ఊరికి! తాతలు సంపాయిచ్చిన వొందెకరాలు కొబ్బరితోటలో సగం రొయ్యిల చెరువులు తవ్వించి, బోల్డు సంపాయిచ్చాడు. చేతినిండా వొచ్చిన డబ్బు... వొత్తా వొత్తా బలుపు కూడా తీసుకొచ్చింది. డబ్బెప్పుడు ఒంటిరిగా రాదు... జబ్బులో, బలుపో... దేన్నోకదాన్ని లేదా రొండాట్లినీ తీసుకొత్తాది. రొయ్యిల మీదొచ్చిన డబ్బు రాజకీయాలు నేర్పింది. పెసిరెంటుని చేసింది. జెనం డబ్బునోళ్ళకి ఇయ్యాల్సిన దానికంటే ఎక్కువే గౌరవమిత్తారు... అతని డబ్బు ఎవరికీ ఉపయోగపడాపోయినా!

బండంజిగాడికి పాపారాయుడి చావిడి నెయ్యిటానికి వోరం రోజులట్టింది. ఊళ్ళో ఎవరికీ ఈ పని రాదు. కొత్తగా గవర్నమెంటోళ్ళు కట్టిచ్చిన కోలనీని కొత్తపేట అంటన్నారు. అక్కడుండే కొండేటి భూషణానికి నేర్పిత్తానని ఎంత చెప్పినా,

అతనికి అది నేర్చుకుంటే, పన్లేమీ ఉండవని నేర్చుకోలేదు. అందుకే పనికొచ్చినా, కింద నించి తాటాకు పైకి అందిత్తాడు తప్ప, నెయ్యిలేడు.

రోజూ పని ఆపి, మజ్జానం కూడు కోసం దిగినప్పుడికి, పాపారాయుడు పాలేరు మాచర్రావు ఈళ్ళిద్దరికీ కూళ్ళట్టుకొత్తన్నాడు. ఆ రోజు ఎండిచేప, కోడిగుడ్డు ఎంత బాగుందో, తిన్న ఎంటనే మత్తొచ్చేసీ అంత తిన్నారిద్దరూ!

వోరం రోజుల్లో నెయ్యాల్సిన చావిడి, మూడ్రోజుల్లో అవగొట్టేసాడు బండంజిగాడు. అప్పుడికీ భూషణం చెప్తానే ఉంటాడు. "నెమ్మదిగా నెయ్యిరా రొండ్రోజులు కూలెక్కువొత్తాది" అని.

అయినా బండంజిగాడు ఇంటేనా? "ఊరుకోరా భూషిగా! ఆరు మనల్ని నమ్మి, పని ఒప్పగించినపుడు మనం మోసం చెయ్యికూడదు. ఓండర్లకి రూపాయిలు మిగల్చాల" అంటాడు.

ఆరోజు సందాల పని అవగొట్టుకుని, రైతు దగ్గిరికెళ్ళి కూలి పని డబ్బులడిగాడు. పాపారాయుడు "ఉప్పుడు డబ్బుల్లేవురా, రొండ్రోజుల్లో కనబడు" అన్నాడు నిర్లక్ష్యంగా!

పాపం పెసిరెంటు గారి దగ్గిర చిల్లర లేదేమో అని ఏమీ మాటాడకండా ఎళ్ళిపోయాడు.

రొండ్రోజులు తర్వాత ఆత్రంగా వొచ్చాడు. పెసిరెంట్ గారు డబ్బులిత్తే, ఆటితో బియ్యం కొనుక్కోవొచ్చని! అప్పుడికి పరిస్థితి కష్టంగా ఉంది. ఎళ్ళి పెసిరెంట్‌ని డబ్బులడిగితే ఉప్పుడెక్కడియ్యి? అడగటానికి ఏళా పాళా లేదేంట్రా, అందరిలో ఉన్నప్పుడు, జేబిలో చిల్లర లేనప్పుడు అడుగుతావ్ బికారి నా కొడకా!" అని, 'లం..' కారాలు కూసాడు.

సాధారణంగా బండంజిగాడికి కోపం రాదు. చూడ్డానికి బండోడిలావున్నా తిరుగుబాటుతత్వం లేనోడు. అందుకే కోపం రాలేదు. ఈడి దగ్గిర చిల్లర డబ్బుల్లేనట్టున్నాయ్ అనుకుని సర్దుకుపోయాడు.

"ఎప్పుడు రమ్మంటారు?" అనడిగాడు.

"వోరం తర్వాత అంపడు అప్పుడిత్తాను!" అన్నాడు.

బండంజిగాడికి ఆడి కష్టం మీద ఆడికెంత గౌరవమో... ఆడి రూపాయి మీద ఆడికంత హక్కు! ముందే డబ్బుల్లేవంటే జాలిపడి చేత్తాడు. కానీ ఇత్తానన్న కూలీ ఇయ్యాపోతే ఎంత పెద్దోడైనా నిలదీత్తాడు. అది ఆడి నైజం. 'పోనీలే ఉప్పుడు ఉడుకు మీదున్నాడు. చల్లారేక ఆడే అంపిత్తాడు... ఆళ్ళ పాలేరుతోటి' అనుకుని ఎళ్ళిపోయాడు.

ఇంట్లో బియ్యం, ఎచ్చాలు లేవు. చేతిలో చిల్లిగవ్వ లేదు. పాలూరు చిన్నబ్బాయ్ కొట్లో అరువడిగితే అంజిగాడు కచ్చితమైనోడని ఇచ్చాడు.

"చిన్నబ్బాయ్ ఆళ్ళ అమ్మమ్మగారూరు నడవపల్లిలో గొడ్ల చావిడి నెయ్యాలంటరా అంజి... రోపు ఎల్తావా?" అనడిగితే ఎళ్తానని చెప్పాడు. నడవపల్లిలో పని అయ్యాలోగానే, ఆ ఇంటికి రొండీదులవలి, పోయినేడే ఆ ఊరొచ్చిన మద్దునూరి బుల్లియ్యగారి తాటాకిల్లు నేసినప్పుడికి వోరం అయ్యింది. ఈ వోరం రోజులు ఎప్పుడో చీకటడ్డాక, ఒళ్ళు పులిసిపోయి ఇంటికి రాటం, పుల్లల పొయ్యి మీద ఉడుకు నీళ్ళెట్టుకుని తానం చేసి, మరుకుర్తి తాతాలు దొంగసారాకొట్లో, రొండు

డ్రాములు తాగి, వొత్తా వొత్తా నిచ్చినికోళ్ళ గవర్రాజు కొట్లో బజ్జీలు, కారబ్బ్యాందీ, కోడిగుడ్డట్టు, లేపోతే మినపట్టు కొనుక్కుని, అయ్యి తిని తొంగుంటన్నాడు.

వోరమయ్యాక గేపమొచ్చింది పాపారాయుడు డబ్బులియ్యాలని! ఆ డబ్బులిత్తే ఇయ్యాల పనిలేదు కాబట్టి ముమ్మిడివరం ఎళ్ళి శ్రీ వెంకటేశ్వర టాకీస్ థియేటర్లో 'సింహాసనం' సినిమా చూసి, మీసాలరాజు గారి పలావు బండిమీద ఏడేడి కోడి పకోడి నంజుకుని, చీపు లిక్కర్ తాగి, పలావు తిని వొద్దామనుకున్నాడు.

ఎళ్ళి పాపారాయుణ్ణి డబ్బులడిగాడు. ఆడు ఆళ్ళావిణ్ణి తీసుకుని పక్కూరి గుడికెళ్తన్నాడు. ఆ సందడిలో ఉన్నాడు. ఎళ్ళి అంజిగాడు డబ్బులడిగితే "ఉప్పుడెక్కడియ్యినూ... మంచి ఏల చూసుకొని వొత్తావురా! మేము గుడికెళ్తన్నాం, రొండ్రోజుల్లో అంపడు ఇత్తాను" అన్నాడు.

"అదేంటి అయ్యిగారూ! పని చేయిచ్చుకుని పదిరోజులైంది. ఇయ్యాల్సిన కాసిని చిల్లరకి నాలుగు తేపార్లు తిప్పారు. ఉప్పుడు కూడా ఎప్పుడో రమ్మంటన్నారు. అసలు తవరికి ఇచ్చీ ఉద్దోషం ఉందా?" అన్నాడు నెమ్మదిగా.

"ఏంట్రా ముష్టినాకొడకా... చిల్లరకోసం నన్నిలా పదిసార్లు అడుగుతావా? నీ డబ్బులు ఎగ్గొట్టేసేలా అంపడతన్నానా? లేపోతే నీ డబ్బులు కోసం ఊరుదిలి పోతాననుకున్నావా? బికారి నా కొడకా, నువ్వెంత, నీ బతుకెంత, నన్నే నిలదీత్తావురా?" అంటా లం... కారాలు మొదలెట్టాడు.

ఆడి తిట్లుకి ఎప్పుడూ రాని కోపం అంజిగాడి చుట్టమైంది. ఆడెవరితో మాట పడడు. అనవసరంగా ఎవరి జోలికి ఎల్లడు. అన్యాయంగా అంటే ఊరుకోడు. పాపారావుగాడి దురుసుకి అడ్డు అదుపు లేదు ఉప్పుడుదాకా! ఉప్పుడు ఈడు అడ్డు తగిలాడు.

"పెద్దింటోడివి కదాని ఊరుకుంటే, నా డబ్బులు ఎగగొట్టడం కాకండా, నన్ను బూతులు తిడతావా! నాకు రావా తిట్టటం. నువ్వు తిడితే తిడతాను. నువ్వు కొడితే కొడతాను. ఎవరికీ లొంగుండాల్సిన పని లేదు. నువ్వు మా అయ్యవా, మా అమ్మవా ఊరకుంటాకి" అంటా కేకలేసాడు.

ఆడి కేకలు పాపారాయుడిగాడి పెళ్ళాం ఇన్నది. ఆవిడికి జరిగిందంతా అర్థమయ్యి "అతనికి డబ్బులిచ్చేయ్యొచ్చు కదా! ఎన్ని రోజులు తిప్పుకుంటావ్? ఆడు పని మానీసి మీ కూడా తిరుగుతాడేటి?" అన్నది.

"నీకేం తెలీదు, నువ్వు నోర్మూసుకో! ఈ కూలీ నా కొడుకులికి పనైన ఎంటనే డబ్బులిచ్చేత్తే మనవంటే గౌరుం ఉండదు. ఇలా నాలుగైదు సార్లు తిప్పితేనే మనవంటే గౌరుం, బయిం ఉంటాది. నీకేం తెల్దు నువ్వు నోర్మూసుకో" అని మూయించేసాడు.

"ఇలా అడిగిచ్చుకుని అడిగిచ్చుకుని ఇయ్యటానికి నాకేమైనా బిచ్చమేత్తన్నారా మీరు!" అనరిచాడు.

ఆడి అరుపుకి పాపారాయుడు సిగ్గుపడిపోయాడు. కానీ కులం, గర్వం, బలుపు, అధికారమదం ఇచ్చిన మూర్ఖత్వంతో "నీకు డబ్బు ఇవ్వను. నిన్ను ఈ ఊళ్ళో ఉండనివ్వను. నువ్వు బతకలేక ఊరుదిలి పారిపోయీలా చేత్తాను నా కొడకా! ఈ ఊరు నాది. నన్ను ఎదురిచ్చి ఎలా బతుకుతావో చూత్తాను. నా కొడకా" అంటా అడ్డంగా ఎగిరాడు.

అంజిగాడికి ఏమీ అర్థం కాలేదు. న్యాయంగా చేసిన కూలీ అడిగితే ఇలా దౌర్జన్నం చేత్తాడా, ఈ నా కొడుకు అంటా! ఊరు ఈడి బాబుగాడిదా! ఊరునించి తరిమేత్తాడా! చూద్దారి ఎలా గెంటుతాడో! ఆడికి అడ్డంగా అక్రమంగా వొచ్చిన బలముంది. అంజిగాడికి చిన్నప్పుణ్ణించీ వొచ్చిన కండబలం, మొండిబలం, గుండిబలముంది. ఉప్పుడు ఈ రెండాట్లికీ పోటీ మనమూ చూద్దాం రండి. ఏది గెలుత్తాదో?

పాపారాయుడికి నిప్పుల మీద కూకునట్టుంది. బండంజిగాణ్ణి ఏ వొంకతో ఊరినించి ఎలెయ్యాలా, ఎలా ఊరినించి తరిమెయ్యాలా అని తెగ ఆలోచిత్తన్నాడు. ఏం చేసినా ఈ మొండోడు కదలడు అని ఆలోచించి, ఆలోచించి ఎప్పుణ్ణించో రోడ్డు పక్కన గుడిసిలేసుకున్న ఇరవైమూడు మందికి ఇళ్ళ తలాలు ఇమ్మని అడుగుతన్నారు. ఊళ్ళో పేదోళ్ళందరికీ తలాలిచ్చారు కానీ, ఈళ్ళకివ్వలేదు. అది గేపకమొచ్చి యమ్.యల్.ఏ. తోటి, యమ్.ఆర్.ఓ. తోటి మాటాడితే ఊళ్ళో బోల్దంత పోరంబోకు తలం వుందని యమ్.యల్.ఏ. గారు ఒప్పుకుంటే ఇవ్వొచ్చని ఆలోచన చెప్పాడు యమ్.ఆర్.ఓ..!

దాంతో యమ్.యల్.ఏ. ని ఒప్పిచ్చి ఫైల్ పెట్టిచ్చాడు. ఆ మరుసటిరోజే రోడ్డు వెడల్పు చేయాలని, రోడ్డుకి రొండెంపులా కట్టుకున్న గుడిసెలు తీసియ్యాలని, రెవెన్యూవోళ్ళు పోలీసులితో వొచ్చి పదిరోజులు టైమ్ ఇచ్చారు.

ఊళ్ళో సగం మంది ఉజ్జోగాలు, యాపారాలు చేసుకునీవోళ్ళు, మిగిలినోళ్ళు కూలీలు. ఊళ్ళో అంకాలమ్మ రాయిచెట్టు కాడ మీటింగెట్టి బండంజిగాడు... పాపారాయిణ్ణి బూతులు తిట్టాడని ఊరి పెద్దలందరూ కలిసి బండంజిగాణ్ణి ఊరినించి వెలేసారు మూడేళ్ళు! ఆడికి ఎవరూ ఇల్లు అద్దెకివ్వకూడదంట. ఎవరూ పనికి పిలవకూడదంట. ఇలా ఊళ్ళో పెద్దోళ్ళంతా తీర్పిచ్చారు. ఎయ్యి నూట పదహార్లు తప్పు కట్టాలంటా. ఎంటనే కట్టాలంట. ఇది అందరికి అన్యాయంగా అనిపిచ్చినా, ఆళ్ళ తీర్పుని ఎదిరిచ్చీ ధైర్నం ఎవరికీ లేదు. నిలబడ్డపలంగా డబ్బు కట్టమంటే.. ఇత్తడి సామాన్ల మీద, ఏ వస్తువు మీదైనా అరువులిచ్చీ కంసాలి వీర్రాజు కొట్లో.. బండంజి గంగాళం, రొండు బిందిలు, ఇంకా ఏయేయో ఇత్తడి సామాన్లు మీదొచ్చిన డబ్బట్టుకుని తప్పు కట్టాడు. పదిరోజుల దాకా గుడిసె ఇప్పక్కల్లెద్దు. ఆ తర్వాత ఏదొక ఇంటికి అద్దికెళ్ళాలి, కానీ ఎవ్వరూ అద్దికివ్వకూడదని తప్పుడు తీర్పిచ్చారు కదా! ఎక్కడకెళ్తాడో చూద్దాం రండి.

బండంజిగాడికి పక్కూరికి ఎళ్ళిపొమ్మని సలహా ఇత్తన్నారు చేలామంది. దానికి అంజి “ఊరు ఆడి బాబుగాడిదా? నేను ఈ ఊళ్ళోనే ఉంటాను. ఏం జరుగుతాదో చూడండి” అంటన్నాడు.

చాకలిపేటలో ఉండీ, దొడ్డిపట్ల రామినీడుకి ఎన్నిసార్లు అతని గుడిసె డబ్బులు తీసుకోకండా నేసాడో. ఉప్పుడు అతనికి గవర్నమెంటోళ్ళు ఇల్లు కట్టిచ్చారు. ఆ గుడిసె అద్దెకిత్తన్నాడు. అంజి తనకిమ్మని అడిగితే రామినీడు “అంజి ఏమీ అనుకోకురా... రైతుల్ని ఎదిరిచ్చి నేనేమీ చెయ్యలేను. అర్దం చేసుకో” అంటా ఇల్లివ్వనని సైతుగా చెప్పాడు.

ఎంత అద్దె కావాలంటే అంత అద్దె ఇత్తానని అడిగాడు. ఎవరూ ఇవ్వలేదు. అంజిగాడికి పట్టుదల పెరిగింది. ఇల్లు దొరక్క ఊరుదిలిపోతే తల తీసేసినట్టే. గవర్నమెంటోళ్ళు ఇల్లు కట్టిచ్చీదాకా ఎక్కడో ఒకచోట ఉండాలి కానీ, తనకి సొంత స్థలం కానీ, ఇల్లు కానీ లేదు. రోడ్డు పక్కన స్థలం ఆక్రమించుకుని కట్టుకున్న ఆ గుడిసె తప్ప!

పదిరోజులు గడిచిపోయాయి. గవర్నమెంటోళ్ళు పోలీసులుతో సహా వొచ్చారు. గుడిసెలు పీకిచ్చడానికి... ఆ అవసరం లేకుండానే అందరూ గుడిసెలు ఖాళీ చేసేసారు. ఒక్క అంజి తప్ప! ఆడికి ఎక్కడికెళ్ళాలో తెలవట్లేదు. అందుకే ఆఫీసర్లని, పోలీసుల్ని బతిమాలినా ఆళ్ళు ఒప్పుకోలేదు.

ఇంక చేసేదేమీలేక అంజి సామాన్లన్నీ మూటలు కట్టుకుని, ఆడి సైకిల్ కేరేజి బల్లకి తగిలిచ్చుకుని బయిలెల్లాడు. ఆడు ఎక్కడికెళ్తాడా అని అందరూ చూత్తన్నారు. ఆ సామాన్లట్టుకుని ఊరికి వాయువ్యంలో ఉన్న సొసానాలకాడకొచ్చాడు. అటు ఇటు సమాధులున్నాయి. మజ్జిలో కాలిబాటంటా ముందుకెళ్ళి, ఊళ్ళో హిందువుల శెవాల్ని కాల్చే స్థలం దాటుకుని ముందుకెళ్తే, ఖాళీ జాగా ఉంది. ఆ నేల చదునుగా శుభ్రంగా ఉంది. ఈ జాగా బాగుంది అనుకునీ సామాన్లు అక్కడెట్టాడు.

ఎనక్కెళ్ళి ఆడి గుడిసె రొండు గంటల్లో ఇప్పేసాడు. ఆ కలపట్టుకొచ్చి గుడిసె కట్టాడు. పక్కూరి నరసింగరాజు దూళ్ళ చావిడికోసం కొన్న తాటాకుతో, రోపు గుడిసె నేద్దాం అనుకున్నాడు. పారతో నేలంతా శుభ్రం చేసాడు. సామాన్లు సర్దుకున్నాడు. రాళ్ళు తెచ్చి పొయ్యేట్టి పైపులో నీళ్ళు కొట్టుకొచ్చి ఉడుకునీళ్ళు కాసుకుని తానం చేసాడు. అన్నం వొండుకుని ఏడేడి గెంజన్నంలో మిరపకాయ, ఆవకాయ పచ్చడి నంజుకుని తిని పట్టిమంచవేసుకుని, చుక్కలు చూత్తా నిద్దరోయాడు.

పొద్దున్నే రేత్రి మిగిలిన గెంజి తాగి గుడిసె నెయ్యిడం మొదలెట్టాడు. పాపారాయుడుగాడు ఊళ్ళో ఆడి తొత్తుల్ని పోగేసుకుని సొసేనానికొచ్చాడు. ఎందుకంటే పాపారాయుడు ఆళ్ళ పాలేరుతో, బండంజిగాణ్ణి పంచాయితీ కాడికి రమ్మని కబురెడితే “నేను రానన్నానని చెప్పు ఆడికి” అనీసరికి, నిలదీద్దామని వొచ్చాడు.

ఆళ్ళు బండంజిగాణ్ణి “ఏరా అంజిగా గుడిసెలు పీకేత్తే ఊరుదిలి పోవాలా.. అంతేకానీ ఇక్కడ గుడిసె ఏసుకోటవేంటీ, ఇదేమైనా మీ బాబుదా! ఎవర్నడిగి ఇక్కడ పాకేసావు?” అని నిలదీసారు.

“ఊళ్ళో నాకు సొంత తలం లేదు. ఎవరూ అద్దికివ్వట్లేదు. మీరు పొమ్మన్నారని నేను ఊరుదిలిపోవాలా? నేనెళ్ళను. అందుకే ఇక్కడ పాకేసుకున్నాను. ఊళ్ళో తలాలన్నీ మీ రైతులియ్యే. మీకు వొందల ఎకరాలున్నాయ్! నాకు తల దాచుకుంటానికి కాత్త తలం కూడా లేదు. మీరు నన్ను ఊరునించి ఎలేసారు. నేను ఊరిని ఎలేసాను. ఊరు ఎవరికీ సొంతం కాదు, కానీ పతి మడిసికి సొసేనమే సొంతం. అందరూ ఇక్కడికి రావాల్సినోళ్ళే! నేను మీ అందరికంటా ముందొచ్చానంతే! నేను ఇక్కడే ఉంటాను. గవర్నమెంటోళ్ళు తలమిచ్చినా ఎళ్ళను. ఇక్కడే ఉంటాను. ఏం చేసుకుంటారో చేసుకోండి” అని గుడిసె నేసుకునీ పనిలో పడ్డాడు.

మొండోడు రాజుకంటే బలమంతుడు అనుకున్నారాళ్ళు. బండంజిగాడి పని.. చుట్టుపక్కల ఊళ్ళన్నీ తెలిసి పెసిరెంటు పాపారాయుణ్ణి తిట్టుకున్నారు. జెనంలో కూడా మార్పు మొదలైంది. ఆడి దుర్మాగ్గాలింక సహించట్లేదు. అన్యాయపు తీర్పుల్లేవు. చుట్టుపక్కల ఊళ్ళల్లోనే కాదు, ఆ ఊళ్ళో కూడా బండంజిగాణ్ణి పనికి పిలుత్తన్నారు. గవర్నమెంటోళ్ళు ఈడికి తలమిచ్చి ఇల్లు కట్టిత్తామన్నా తీసుకోలేదు. ఆడికి సొసేనమే నచ్చినట్టుంది. అక్కడే ఉంటన్నాడు. అవునుమరి! అందరం అక్కడికెళ్ళాల్సినోళ్ళమే! అనుకుంటన్నారందరూ!

ఆడికి రోజుకొక శెవం కాల్చాక ఆ నిప్పులమీద నీళ్ళు కాసుకుని తానం చేత్తన్నాడు. అప్పుడప్పుడూ ఆ నిప్పులమీదే అన్నం కూడా వొండుకుంటన్నాడు.

భయిపడితే మన నీడే మనల్ని భయిపెడతాది. మనం భయిపెడితే భయిం భయింతో పారిపోతాది!

స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ

ప్రత్యేక బహుమతి పొందిన కథ

జన్మదిన ప్రత్యేక సంచిక - 2026

# గోడమీద పులి తల


## పొత్తూరి సీతారామరాజు

✆ 7842474885


*కథా, కవితా రచయిత శ్రీ సీతారామరాజు గారి నివాసం కాకినాడలో! వీరి సాహితీ ప్రస్థానంలో అనేక కవితా పురస్కారాలు. తెలుగు రాష్ట్రాలలో నిర్వహించే కథల పోటీల్లోనే కాకుండా.. అమెరికా తెల్సా కథల పోటీల్లో కూడా బహుమతులు అందుకున్నారు. నేటి యువ రచయితలలో పేరు పొందిన రచయితగా కథామంజరి కథల పోటీలో కూడా బహుమతి పొందడం ఎంతో ఆనందం కలిగిందని అంటారు.*



***ఇది ఎవరు చేసిన పాపం? నా కొడుకు ఏ పాపం ఎరుగడే! మరి ఎందుకు భగవంతుడు అతనికి ఈ శిక్ష వేశాడు?" అని నాలో నేను ప్రశ్నించుకుంటే, మా తరాలు వినోదం కోసం అడవిలో మూగజీవాలను వేటాడటమే... అదే పాపం.***

***బహుశా నేటి తరానికి తగిలి, వంశం అంతరించింది.***

***రెప్పల తడితో చెంపలు తడిచిన నాగేంద్రవర్మ కంటినుంచి రెండు కన్నీటి చుక్కలు రాలాయి.***

బ్రిటిష్ సామ్రాజ్యం హయాం మంచి ఉచ్ఛదశలో ఉంది. సంస్థానాల్లో రాజులు వినోదంలో మునిగి తేలుతున్న రోజులు!

పెద్దపులి వేటకు వేలకు వేలు ఖర్చయినా, లెక్క చేయకుండా రోజులు తరబడి అడవుల్లో క్యాంపులు వేసి, అడవి జంతువులను వేటాడి, మద్యం తాగుతూ, మాంసం తింటూ వారు ఉన్నన్ని రోజులు ఆనందాన్ని అనుభవించడం ఆనాటి రాచరికపు ఆనవాయితీ.

అలమండ దివాణంకి పులివేటకు వస్తున్నట్లు జమీందారు కాకర్లపూడి జగన్నాథరాజు గారికి వర్తమానం అందింది.

వెంటనే హాలెండ్ కంపెనీకి పురమాయించి, వైస్రాయ్ గారి బరువుకు, ఎత్తుకు తగ్గట్టుగా పులివేటకు తగిన తుపాకీని తయారు చేయించి తెప్పించాడు జగన్నాథరాజు.

అనుకున్న సమయానికి వైస్రాయ్ గారు దిగారు. అంగరక్షకులు, కార్లు, మందీమార్బలం, గుర్రాలు, వేటకుక్కల అరుపులు ఒకటేమిటి, ఎక్కడ చూసినా "మృగయా వినోదం" కోలాహలం!

ఆ రాత్రి జగన్నాథరాజు గారి ప్రైవేట్ ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో, వైస్రాయ్ గారు ప్రత్యేకంగా దిగుమతి చేయబడిన తుపాకీతో ఒకే దెబ్బతో పెద్దపులిని కిక్కురుమనకుండా కాల్చేశారు. ఆ పులి శరీరాన్ని.. చెప్పిన సమయానికి, అనుకున్న చోటుకు, వైస్రాయ్ గారు ఉన్న మంచె దగ్గరికి, కొంతమంది పనివాళ్లను పెట్టి తోలుకొచ్చేలా చేయించాడు జగన్నాథరాజు.

జగన్నాథరాజు గారి షికారీ నిర్వహణ దక్షతను తెగ మెచ్చుకుంటూ, వైస్రాయ్ గారు "శ్రీ రాజా" అని బిరుదును ఇచ్చారు. తుపాకీ మీద "శ్రీ రాజా కాకర్లపూడి జగన్నాథరాజు" పేరును చెక్కించి, జీవితాంతం ప్రాణప్రదంగా చూసుకుంటూ వచ్చాడు.



ఒకరోజు జగన్నాథరాజు కాలం చేశారు. జగన్నాథరాజు గారి కుమారుడు నరసింహరాజు తండ్రిగారి తుపాకీతో చాలా పులులను వేటాడి దివాణం పేరు నిలబెట్టడమే కాకుండా, ఒకసారి దివాణం ఎస్టేటు తగాదాలో అరడజను మంది తిరుగుబాటుదారులు లోపలికి జొరబడి దాడి చేయబోతే, ఆ తుపాకీతోనే కాల్చి చంపాడు.

ఆనాడు కోర్టులో ఆ చర్య.. ఆస్తి రక్షణ, ఆత్మరక్షణ కోసం దాడి చేయబోయే వారిని చంపడం న్యాయసమ్మతమేనని తీర్పు ఇచ్చింది.

అప్పటినుంచి నరసింహరాజుగారు అంటే ఆ దివాణంలో అందరికీ హడల్. తగువుకి దిగితే తుపాకీ చూపించేవారు. ఆయన కూడా కాలం చేశారు.

తరువాత బ్రిటిష్ సామ్రాజ్యం అంతరించింది. సంస్థానాలు, సంస్థానాధీశులు పోయారు.

పోయింది పోగా, అలమండ దివాణానికి “శ్రీ రాజా” కాకర్లపూడి నాగేంద్రవర్మ వారసుడయ్యాడు. తరతరాలుగా వస్తున్న ఆ తుపాకీని మాత్రం అలనాటి వైభవ చిహ్నంగా, తాతలు చంపిన పులి తలల మీద అందంగా అమర్చాడు.

★★★

నాగేంద్రవర్మకు కూడా వేటంటే సరదావే!

రాచగుమడాం నుంచి కుచ్చర్లపాటి రమణరాజు, దంతులూరి ఫకీర్‌రాజు వచ్చి కలిసి వేటకు వెళ్లేవారు.

కుచ్చర్లపాటి రమణరాజు దగ్గర మరో రెండు తుపాకులు ఉన్నాయి. మొత్తం మూడు తుపాకులతో వేటకు బయలుదేరేవారు.

వీరిద్దరూ అడవిపందులను, దుప్పులను వేటాడేవారు. ఒక్క నాగేంద్రవర్మ మాత్రం పెద్దపులి కనిపిస్తే మాత్రమే వేటాడాలని నిర్ణయం తీసుకున్నాడు.

ఎందుకంటే, వారి తాతముత్తాతలు పులివేటలో గజవేటగాళ్లు. తరతరాలుగా జింకలను, దుప్పులను కొట్టొద్దని వారసులకు సగౌరవంగా నచ్చజెప్పేవారు.

పులి కనిపిస్తే తుపాకీ పేల్చే అదృష్టం కలిగేది. లేకపోతే, అది ఖాళీగానే ఉండేది. కోటలో విషాదంగా గోడకు వేలాడుతూ...

“ఎన్నో పులులను చంపిన ఈ తుపాకీకి నిజంగా ఇప్పుడు పని లేదు...” అని అప్పుడప్పుడు స్నేహితులతో బాధపడుతుండేవాడు నాగేంద్రవర్మ.

మిత్రులు అడవిలోకి ప్రవేశించి చాలా సమయం గడిచింది. తిరిగి తిరిగి నిరాశతో వెతుకుతుండగా, ఒకచోట గుబురుగా ఉన్న పొదల మాటున మూలుగుతున్న జంతువు శబ్దం వినబడింది.

నాగేంద్రవర్మ మిత్రబృందానికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. నాగేంద్రవర్మ వారిద్దరికీ సూచనలు చెప్పేలోగానే, ఉరకలెత్తే ఉత్సాహాన్ని ఆపుకోలేక కుచ్చర్లపాటి రమణరాజు పొదల గుబుర్లలోకి చూడకుండానే తుపాకీని పేల్చాడు.

అంతే! గాండ్రిస్తూ పెద్దపులి పొదల నుంచి బయటకు దూసుకొచ్చింది.

ప్రాణభయంతో మిత్రులు ఇద్దరూ పరుగులెత్తారు. నాగేంద్రవర్మ మాత్రం పరిగెత్తలేదు. తన తుపాకీ జీపులో ఉంది.

చావు భయంతో కింద పారేసిన కుచ్చర్లపాటి రమణరాజు తుపాకీని తీసుకున్నాడు. సేఫ్టీ వాల్వ్ ఓపెన్ చేసేలోగానే, పులి నాగేంద్రవర్మ మీదకు కురికింది.

ఆయన చేతుల్లోని తుపాకీ గాలిలోకి ఎగిరిపోయింది.

పులి విసిరిన పంజాను రెండు చేతులతో పట్టుకున్నాడు. దాని ముందు కాళ్లు భూమ్మీద లేకుండా నిలువరించాడు.

పులి తన పంజాను అతని చేతుల్లోంచి లాక్కోవడానికి గాండ్రిస్తోంది. అతన్ని తన కోరలకు బలి చేయడానికి ప్రయత్నిస్తోంది.

దూరంగా పొదల్లో ఉన్న దంతులూరి ఫకీర్‌రాజును, "కాల్చండి!" అని అరుస్తూనే ఉన్నాడు. వారికి వినపడలేదో, వినపడినా బయటకు వచ్చే ధైర్యం లేకపోయిందో...

నాగేంద్రవర్మ చాలా బలిష్టుడు. పులిలా బలిసిన నాగేంద్రవర్మ, తాను కూడా పులిలాగే పులితో పోరాడుతున్నాడు.

నిజానికి ఇప్పుడు పులే పులిలా లేదు. చాలా బలహీనంగా ఉంది.

దాని ముందు రెండు కాళ్లు పట్టుకుని గిరగిరా తిప్పుతున్నాడు. శక్తినంతా కూడగట్టుకుని గట్టిగా పులిని విసిరేశాడు.

అదృష్టవశాత్తూ, పక్కనున్న పది అడుగుల లోతైన లోయలో పడింది పులి.

నాగేంద్రవర్మకు అర్థమైంది. పులి చాలా బలహీనంగా ఉందని. లేకుంటే, దానికి ఆ ఎత్తు పెద్ద లెక్కలోది కాదు.

కిందపడిన తుపాకీ తీసుకున్నాడు. గురి పెట్టి అరుస్తున్న పులిని కాల్చాడు.

అది బాధతో అరుస్తోంది. మళ్లీ పేల్చాడు.

పులి అరుపులు, అరుపుల్లా లేవు. మృత్యు మూగవేదనలా వినిపించాయి.

కొంతసేపటికి అది అచేతనమైంది. మెల్లగా ఇద్దరు మిత్రులు అక్కడికి చేరుకున్నారు. ఆయన సాహసాన్ని పొగుడుతున్నారు. పులితో అతని వేటను వర్ణిస్తున్నారు.

కానీ, నాగేంద్రవర్మకు ఆనందంగా లేదు... అతను వాళ్ల సంతోషాన్ని పంచుకోవడం లేదు. కారణం పులి ప్రసవ వేదనతో ఉంది. అమ్మతనంతో ఉంది.

వెంటనే మిత్రులతో కలిసి పొదల్లోకి వెళ్లాడు. అక్కడ ఒక పులిపిల్ల ఇంకా కళ్లు తెరవలేదు. కుక్కపిల్లలా ఉంది. తల్లి కోసం దేవుర్లాడుతోంది. తల్లి స్తన్యం కోసం ఆవురావురుమంటూ వెతుకులాడుతోంది.

ఒక్కసారిగా నాగేంద్రవర్మ గుండెల్లో పశ్చాత్తాపం కలుక్కుమంది. కళింగ యుద్ధంలో పారిన రక్తపుటేరులు చూసి చలించిపోయిన అశోకునిలా, అతనిలో వైరాగ్యం ఆవహించింది.

నాగేంద్రవర్మ తన మనసులో ఒక ఒట్టు పెట్టుకున్నాడు. సర్వసాక్షికి దండం పెట్టుకున్నాడు.

మనసు ఆవేదనతో మూలుగుతోంది.

మళ్లీ అడవికి వేటకు రానని... వన్యమృగాలను మృత్యువుకు బలి పెట్టనని ఒట్టు పెట్టుకున్నాడు.

అతనిలో మేల్కొన్న మానవత్వపు మార్దవాన్ని మిత్రులిద్దరూ గుర్తించలేదు. వారికి దొరికిన పులి వేట సంతోషం తప్ప!

వాళ్లకు తెలియదు. అతని అంతరంగంలో మొదలైన ఆవేదన... నాగేంద్రవర్మలో బుద్ధుడు ప్రవేశించాడని!

'అదేమిటో.. కుక్కలను పెంచడం చూశాం గాని.. పులి పిల్లని పెంచడమేమిటో.. మీరీ విడ్డూరం! అదేం కుక్కపిల్ల కాదు, ఆయన చెప్పినట్టు వినడానికి! రేపొద్దున్న కోరలు వస్తే.. అదే మీద పడుతుంది. ' అన్న మాటలు విన్నా, నాగేంద్రవర్మ ఆ పులిపిల్లను ఇంట్లో పెట్టుకున్నాడు. దానికో ఆర్నెల్లు రాగానే అదే అడవిలో వదిలేద్దామనే ఆలోచన అతనిది!

ఇంట్లో గోడ మీద ఉన్న తన తాతగారి ఫోటో ముందు తుపాకికి స్థానం కల్పించాడు

★★★

పది రోజులు గడిచాయి!

గ్రామంలో చిన్న అలజడి.. శిథిలమైపోయిన రాముడుని బయటకు తీసి, ఆయనకో కుటీరం కడదామని తన ప్రయత్నం చేస్తే.. కొందరు తిరుగుబాటు చేస్తున్నారు. ఇంటిముందుకు వచ్చి ఉదయాన్నే గొడవ పెడుతున్నారు. సహనంగా ఊ అరగంట చూశాడు.. తన మనుషులు వెళ్ళి మాటాడారు, వాళ్ళు వినడం లేదు! వాళ్ళ చేతుల్లో ఆయుధాలు ఉన్నాయి. పరిస్థితి బాగా వేడెక్కిపోయింది!

నాగేంద్రవర్మకు తండ్రి జ్ఞాపకం వచ్చాడు. ఒకానొక సమయంలో తనూ ఒక పది మందిని తుపాకీతో హతమార్చాలనుకున్నాడు.

ఒక అంగలో వెళ్లి, పులి తల మీద అమర్చిన తుపాకీని అందుకున్నాడు.

"వద్దు బాబూ... వద్దు. రోజులు మారిపోయాయి. ఇప్పుడు రోజులు మనవి కావు..." అంటూ, నౌకరు నారయ్య, నాగేంద్రవర్మ చేతిలోని తుపాకీని బలవంతంగా లాక్కున్నాడు.

నాగేంద్రవర్మ పరిస్థితి బోనులో ఇరుక్కున్న సింహంలా ఉంది. జుట్టు పీక్కున్నాడు. తుపాకీని చేతిలోకి తీసుకుని, ఆప్యాయంగా తడుముతూ "నువ్వు నా దగ్గర ఉన్నా ఉపయోగించలేని కాలంలో నేనున్నాను. ఇదే మా తండ్రిగారు ఉంటే, ఈపాటికి రక్తం ఏరులై పారేది" అన్నాడు.

బయట జనం ఇంకా గేటును తోసుకుంటూ వస్తూనే ఉన్నారు.

దూరంగా స్తంభానికి గొలుసుతో కట్టబడిన పులికూన, తన యజమానికి ఏదో ఆపద ముంచుకొస్తోందని ఊహించి, గాండ్రిస్తూ జనం మీదకు ఉరకడానికి సిద్ధపడుతోంది.

నాగేంద్రవర్మ తలుపులు తీసుకుని బయటికి వచ్చాడు.

తుపాకీని పైకెత్తి, తన మీదకు విరుచుకుపడుతున్న జనాన్ని గురి చూసి, "అడుగు ముందుకు పడిందా? పిట్టల్లా రాలిపోతారు! నా చేతిలో ఏముందో తెలుసుగా... అసలు మీకు కావాల్సిందేంటి?" అన్నాడు.

"మాకు పంచిన బంజరు భూమి పక్కన, దేవుడి మాన్యం అనుకుని ఉన్న స్థలంలో మీరు రామాలయం కట్టకూడదు. ఇది మళ్లీ మాకు ఇచ్చిన భూమిని మీరు ఆక్రమించుకోవడం కాదా?" అని వారిలో ఒకడు దూకుడుగా ముందుకు వచ్చి ప్రశ్నించాడు.

"మీరంతా బయటే ఉండండి. నువ్వు లోపలికి రా. దాని గురించి ఆలోచిద్దాం. అనవసరంగా గొడవ చేసి, రక్తపాతం సృష్టించకండి!" అన్నాడు నాగేంద్రవర్మ.

"వద్దు! చంపేస్తారు. లోపలికి వెళ్లొద్దు. అందరం వస్తాం!" అంటూ మిగతావాళ్లు ముందుకు రాబోయారు.

"ఆ భయం మీకు అనవసరం. రాజ కుటుంబంలో పుట్టిన వాడిని. అసహాయులను చంపడం మా వంశంలో లేదు. మీకు అభయమిస్తున్నాను" అంటూ హుందాగా లోపల గదిలోకి వెళ్లాడు.

అతని వెంట దూకుడుగా మాట్లాడిన వ్యక్తి కూడా లోపలికి వెళ్లాడు. "కూర్చోండి..." అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూపించాడు.

అతను అనుమానంగా చూస్తూ నిలబడ్డాడు.

"పర్వాలేదు... చెప్పండి," అంటూ నమస్కరించి కింద కూర్చున్నాడు.

"మా తాతలు ప్రతిష్టించిన దేవుడి భూమిలో సీతారామాంజనేయ విగ్రహాలు బయటపడ్డాయి. అవి ఎప్పుడో పురాతన కాలం నాటివి. నాలుగైదు తరాల ముందు మా పూర్వీకులు అక్కడ రామాలయ నిర్మాణం చేసి ఉంటారు. అవి కాలగర్భంలో కలిసిపోయాయి. ఇప్పుడు బయటపడ్డాయి. ఊరి జనం అంతా నా దగ్గరకు వచ్చి, అక్కడ రామాలయ నిర్మాణం చేయమని అడిగిన తర్వాతనే, నేను నిర్ణయం తీసుకున్నాను. నా నిర్ణయానికి తిరుగులేదు. భారతదేశంలో అన్ని మతాల సారం ఒక్కటే. మిగతా మతాలవారు తమ మతానుసారంగా చర్చిలు, మసీదులు ఎన్ని కట్టుకున్నా హిందువులు అభ్యంతరం చెప్పరు. అందరినీ గౌరవిస్తారు. అన్ని మతాల వారిని ప్రేమిస్తారు. ఈ ఎస్టేట్ అంతా మాదే... దీనిలో ప్రతి గడ్డిపోచ మాదే. మీకు వదిలేసామా లేదా! ప్రజాసేవకు అంకితమైన మా కుటుంబం ఒక అరచెక్కలో గుడి కడితే, మీ నుంచి మాకు దాడులా? నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు అక్కడ గుడి కట్టడం మాత్రం మానను. అందరం.. ఎవరి ధర్మాలను వాళ్ళు కాపాడుకోవాలి, అంతే కానీ, చెప్పుడు మాటలు విని, ఎదుటి వారి నమ్మకాలనీ, ధర్మాన్ని గౌరవించకుండా.. మీరు తిరగబడితే, ఈ తుపాకీతో మిమ్మల్ని కాల్చి... కాల్చి... తర్వాత నేను కూడా నేలకొరిగిపోతాను. పది నిమిషాలు ఆలోచించుకుని మీ నిర్ణయం చెప్పండి!"

"అదేంటి రాజావారు! ఉత్తిపుణ్యానికే మిమ్మల్ని ఎందుకు చంపుతాం? మా వెనుక కొంతమంది కుహనా రాజకీయ నాయకులు మమ్మల్ని మీ మీదకు తోలారు. ధర్మ ప్రభువులు, తప్పుడు మాటలు విని మీ దగ్గరికి వచ్చాము. క్షమించండి!" అంటూ బయటికి వచ్చి, "రాజా నాగేంద్రవర్మ బాబుకి జై!" అంటూ దిక్కులు దద్దరిల్లేలా అరిచాడు.

జనం, "జై...జై..." ధ్వానాలు చేస్తుంటే, నాగేంద్రవర్మ ప్రశాంత వదనంతో తుపాకీ చేత పట్టుకుని బయటికి వచ్చాడు.

అందరూ నమస్కరిస్తుండగా, చిరునవ్వుతో ప్రతీ నమస్కారానికీ ప్రతినమస్కారం చేసి, లోపలికి వెళ్లిపోయాడు.

జనం వెళ్లిపోయారు.

నాగేంద్రవర్మ హాల్లో సోఫా మీద వాలి, గదంతా కలియచూస్తున్నాడు.

తాత, తండ్రుల తైలవర్ణ చిత్రాల మీద సాలీళ్లు తిరుగుతున్నాయి. మాసిపోయి, చివికిపోతున్న పులి చర్మాలు, ముడతలుదేరుతూ జీర్ణావస్థలో గోడలకు వేలాడుతున్న పులుల తలలు.. గత వైభవాన్ని వెక్కిరిస్తున్నాయి!

లోపల గది గోడలపై బూజు పట్టిన దుప్పి కొమ్ములు వేలాడుతున్నాయి. వర్ణం కోల్పోయిన చిత్రపటం మీద పిట్ట ఒకటి వాలి, అనుభూతులను పొడుచుకు తింటోంది.

తన జీవితంలో జరిగిన దుస్సంఘటన ఇప్పటికీ గుర్తుగానే గుండెల్లో కలుక్కుమంటుంది.

కొత్తగా పెళ్లైన తన కొడుకు, కోడలు అన్నవరంలో వ్రతం చేయించుకుని, తన తమ్ముడు కోట రామచంద్రపురం రాజబాబు ఆశీర్వాదం తీసుకోవడానికి వెళ్తున్నప్పుడు, మార్గమధ్యంలో కారు ప్రమాదానికి గురై ఇద్దరూ ఆసుపత్రిలో మరణించారు.

"ఇది ఎవరు చేసిన పాపం? నా కొడుకు ఏ పాపం ఎరుగడే! మరి ఎందుకు భగవంతుడు అతనికి ఈ శిక్ష వేశాడు?" అని నాలో నేను ప్రశ్నించుకుంటే, మా తరాలు వినోదం కోసం అడవిలో మూగజీవాలను వేటాడటమే... అదే పాపం.

బహుశా నేటి తరానికి తగిలి, వంశం అంతరించింది.

రెప్పల తడితో చెంపలు తడిచిన నాగేంద్రవర్మ కంటినుంచి రెండు కన్నీటి చుక్కలు రాలాయి.

కిటికీలోంచి బయటకు చూశాడు. దూరంగా పొలాల్లో తమ బక్కచిక్కిన గుర్రం పచ్చగడ్డి కోసం వెతుక్కుంటోంది.

తన ఎదురుగానున్న తుపాకీని మరోసారి చూశాడు. చేతితో పట్టుకుని ప్రేమతో స్పృశించాడు.

కిటికీలో నుంచి నీరెండ కాంతి పడి, తుపాకీ మీద తమ తరాల వారసత్వానికి చెక్కిన బిరుదు "శ్రీ రాజా" అన్న సువర్ణాక్షరాలు మెరుస్తున్నాయి.

ఒకనాడు ఎన్నో పులులను, ఎందరో మనుషులను హతమార్చి తరతరాల వైభవాన్ని నిలబెట్టిన ఆ తుపాకీని చూస్తూ, బరువెక్కిన హృదయంతో కళ్లు మూసుకున్నాడు నాగేంద్రవర్మ.

గోడమీద వేలాడుతున్న పులి తల నిశ్శబ్దంగా అతనినే చూస్తున్నట్టనిపించింది!

స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ
ప్రత్యేక బహుమతి పొందిన కథ
జన్మదిన ప్రత్యేక సంచిక - 2026

# అవ్యక్తం!...


కె. వి. సుమలత

✆ 9492656255




పూర్తి పేరు కైకాల వెంకట సుమలత, భర్త పేరు కైకాల వెంకటేశ్వరరావు, నివాసం కృష్ణా జిల్లాలోని గుడివాడ. సుమలతగారు వ్రాసే కథ, కవిత, నవల ఏదైనా సరే సమాజానికి హితవు కలిగించేలా ఉండాలనుకుంటారు. కథామంజరి కథల పోటీలో తొలిసారి కథ ఎంపికవడం అదృష్టంగా భావిస్తున్నారు.

***"మీరెందుకు ఇప్పటి వరకు పెళ్లి చేసుకోలేదో తెలుసుకోవచ్చా?"***

***"నాకు నచ్చిన అమ్మాయి దొరకక"***

***"ఎలాంటి అమ్మాయి కావాలనుకుంటున్నారు?"***

***"అందంగా ఉండాలి, అంతే మంచితనం కలిగి ఉండాలి. మరి మీరెందుకు చేసుకోలేదో అడుగవచ్చా?" ప్రశ్నించాడు.***

***"నేను అందంగా ఉండనని ఎవరికీ నచ్చడం లేదు"***

***అశ్విన్ ముఖంలో రంగులు మారాయి.***

***"మీరు అబద్ధం చెప్తున్నారు" క్షణం ఆగి జవాబిచ్చాడు.***

"ఒరేయ్ అశ్విన్! ఈ రోజు ఇంటికి వెళ్ళే ఉద్దేశ్యం లేదా? ఎందుకలా సర్వం కోల్పోయినట్లు కూర్చున్నావు?" సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి వెళ్ళబోతూ, సిస్టమ్ ముందు కూర్చున్న స్నేహితుడి భుజం తట్టాడు రుషి.

"ఏమిటోరా, జీవితం యాంత్రికంగా సాగిపోతోంది. ఉదయం ఆఫీసు, రాత్రికి నిద్ర. మీరంతా పెళ్లిళ్లు చేసుకుని సెటిల్ అయ్యారు. నాకు మాత్రం కాగడా పెట్టి వెతికినా నచ్చిన అమ్మాయి దొరకడం లేదు. ఎందుకో చాలా విసుగ్గా ఉంటోందిరా!" అన్నాడు అశ్విన్.

"చూసే మనసుంటే అందరిలోనూ కనిపించని అందం ఉంటుంది. అది నువ్వే గుర్తించడం లేదు"

"కనిపించని అందం ఉండి లాభమేంటి?" రెట్టించాడు అశ్విన్.

“వన్ ఐడియా!” చిటిక వేస్తూ అన్నాడు రుషి.

“ఏంట్రా నీ ఐడియా? నా జీవితాన్నే మార్చేస్తుందా?”

“అవును... క్షణం తీరిక లేనంత బిజీ అయిపోతావు. నువ్వు కోరుకున్న లక్షణాలతో కూడిన అమ్మాయిని వెతుక్కోవచ్చు” ఊరిస్తూ అన్నాడు రుషి.

“ఏడ్చావు లేరా! మ్యాట్రిమోనిలో సభ్యత్వం తీసుకోమంటావా? ఇప్పటికే నా పేరు అన్నింట్లో ఉంది, అలాగే ఊర్లో ఉన్న పెళ్ళిళ్ళ పేరయ్యలందరి దగ్గరా నా ఫోటో చక్కర్లు కొడుతోంది!”

“అదే మరి! నువ్వు ఇంకా ఎక్కడో ఉన్నావు. నేను చెప్పేది అది కాదురా!”



“మరేంటి?”

“డేటింగ్ యాప్ మన దగ్గరుంటే ప్రపంచమంతా చెంతనున్నట్లే” సినిమా స్టయిల్‌లో అన్నాడు రుషి.

“సోషల్ మీడియా అంటేనే మోసాల పుట్టరా! తెలిసి తెలిసి ఆ ఊబిలోకి నన్నెందుకు నెడతావు?” సిస్టమ్ షట్‌డౌన్ చేస్తూ అన్నాడు అశ్విన్.

“నిన్నందులో కూరుకుపొమ్మని చెప్పలేదుగా? నీ టేస్ట్‌కి తగిన అమ్మాయిని వెతుక్కుని ఓ ఇంటివాడివి కమ్మంటున్నాను”

“నాకు ఇలాంటి వాటి మీద నమ్మకం లేదు కానీ నన్ను వదిలేయ్” బ్యాగ్ భుజానికి తగిలించుకుంటూ లేచాడు అశ్విన్.

"ప్రయత్నించడంలో తప్పులేదు కదా?" బయటకు దారితీసాడు రుషి.

"అలాగేలే, ఆ యాప్ గురించి చెప్పు" అతడితో కలిసి నడుస్తున్నాడు అశ్విన్.

"బంబుల్ అనే యాప్ ఇన్స్టాల్ చేసుకో, అందులో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. అవతలివారు 'మ్యాచ్' అయినప్పుడు, ముందుగా అమ్మాయి మాత్రమే సంభాషణను మొదలు పెడుతుంది" వివరంగా చెప్పాడు రుషి.

"నువ్వు చెప్పిన మ్యాచ్ అవడం ఏమిటో నాకర్థం కాలేదురా!"

"నీకు ఏదైనా ప్రొఫైల్ నచ్చినప్పుడు కుడి పక్కకు జరపాలి, అది వారికి కూడా నచ్చితే కుడి పక్కకు జరుపుతారు. దాన్ని 'మ్యాచ్' అవడం అంటారు. అప్పుడే చాటింగ్ చేయగలం. అయితే నువ్వు మాత్రం నీ వ్యక్తిగత వివరాలను పొరపాటుగా కూడా షేర్ చేయకు" బైక్ స్టార్ట్ చేసాడు రుషి.

"సరే, ఇంటికి వెళ్లాక ఒకసారి చూస్తాను బై!" తను కూడా బైక్ స్టార్ట్ చేసాడు అశ్విన్.

అశ్విన్ అందగాడు, వయసు ముప్పై మూడేళ్లు, సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి హోదాలో ఉన్నాడు. ఒక్కడే కొడుకు కావడంతో బరువు బాధ్యతలు ఏమీ లేవు. అందంగా ఉండే అమ్మాయి, అంతకన్నా ఆకర్షణీయమైన మనసు కావాలంటూ వచ్చిన ప్రతీ సంబంధాన్ని ఏదో ఒకవంక పెడుతూ తిప్పి కొడుతున్నాడు. అతడి వైఖరికి తల్లిదండ్రులు కూడా విసిగిపోయారు.

అశ్విన్ ఇంటికి వచ్చాక రుషి చెప్పింది గుర్తొచ్చి లాప్టాప్‌లో యాప్ ఇన్స్టాల్ చేసుకుని తన ఫోటోతో ప్రొఫైల్ తెరుచుకున్నాడు. తరువాత అందులోని ప్రొఫైల్స్ చూసాడు. అతడికి నచ్చిన అమ్మాయిలు వయస్సులో చాలా చిన్నవారు. ప్రొఫైల్ బాగున్న అమ్మాయిలు అందంగా లేరు. మరికొంతమంది ఏ విధంగానూ నచ్చలేదు. చెప్పలేనంత చిరాకనిపించి యాప్ క్లోజ్ చేయబోయాడు. సరిగ్గా అదే సమయంలో అతడి దృష్టి "ప్రొఫైల్ – 500" దగ్గర ఆగిపోయింది. అందులో ఫోటో లేదు కానీ, కొన్ని వాక్యాలున్నాయి. వాటిలోని ఆర్తి అతడిని ఆకర్షించింది.

మనిషికి వాక్కే విలువైన ఆభరణం

ఒకరి గురించి ఒకరు మాట్లాడుకుంటే దూరాలు పెరుగుతాయి!

ఒకరితో మరొకరు మాట్లాడుకుంటే దూరాలు తరుగుతాయి!

ప్రొఫైల్ వివరాల్లోకి వెళ్తే స్త్రీ, వయసు ముప్పై రెండేళ్ళు, ఉద్యోగం చేస్తుంది, ఇంకా పెళ్లి కాలేదు. అశ్విన్ కుడివైపుకి స్వైప్ చేసి ఆమె అంగీకారం కోసం ఆసక్తిగా ఎదురుచూడసాగాడు. కొన్ని వందల క్షణాలు నిమిషాలుగా మారిన తరువాత అటువైపు నుండి "హాయ్" అంటూ మెసేజ్ వచ్చింది.

వెంటనే "హాయ్! మీ పేరు తెలుసుకోవచ్చా?" బదులిచ్చాడు.

"నా పేరు చెప్పేంత అవసరం లేదండీ, మరొక నియమం కూడా ఉంది. నాతో మాట్లాడాలని, చూడాలని కూడా ఎప్పుడూ అడగకూడదు. అందుకు ఇష్టమైతేనే మనం ముందుకు వెళ్దాం"

'ప్రస్తుతానికి అవునంటే పోలా' అనుకుంటూ సరేనన్నాడు. వారి మధ్య చాటింగ్ చాలా సమయం గడిచింది. అశ్విన్‌కి ఆమె గొంతు వినకపోయినా, ఆమె ముఖం చూడకపోయినా ఆమె రాసే ప్రతి అక్షరంలోనూ ఒక ఆత్మీయతా స్పర్శ తగిలింది. ఆమె "బై" చెప్పగానే అపుడేనా అనిపించినా తప్పనిసరై తను కూడా "బై" చెప్పాడు. ఆ రాత్రంతా ముక్కూ మొహం తెలియని కొత్తవ్యక్తి గురించిన ఆలోచనలతో కలత నిద్రపోయాడు. మరుసటి రోజు అతడు నిద్ర లేచేసరికి ఆమె నుండి వచ్చిన మెసేజ్ ఉంది.

★శుభోదయం★

ఒక బంధం

ఒకే దారాన్ని ఇరువైపులా ముడివేసేలా ఉండాలి...

రెండు దారాలు కలిపి ముడివేసేలా కాదు...

'అర్థం ఎంత బాగుందో! మనసంతా ఆహ్లాదంగా అనిపిస్తోంది' అని జవాబిచ్చాడు. ఆ ఉత్సాహంతోనే అన్ని పనులు వేగంగా పూర్తి చేసుకుని ఆఫీసుకి వెళ్ళాడు.

"ఏంట్రా, నీ ముఖంలో తెలియని మెరుపు కనిపిస్తోంది. ఏంటి కథ?" కన్ను గీటాడు రుషి.

అశ్విన్ నవ్వుతూ జరిగింది చెప్పాడు.

"ఒరేయ్! డిజిటల్ యాప్‌లు కేవలం పరిచయ వేదికలు మాత్రమేనని నీకు ముందే చెప్పాను. ఎవరినీ అంత సులువుగా నమ్మకూడదు. యాప్ చాట్ లో మాత్రమే చాటింగ్ చేయి" హెచ్చరించాడు రుషి.

"అలాగే లేరా!"

అశ్విన్ ఎంత కాదనుకున్నా మధ్య మధ్యలో ఫోన్ వైపు చూస్తూనే ఉన్నాడు. కానీ సాయంత్రం వరకు ఆమెనుండి ఎటువంటి స్పందన లేదు.

"హాయ్, ఎలా ఉన్నారు? ఈ రోజు మీకు ఎలా గడిచింది?" అంటూ సాయంత్రం ఆమె తిరిగి చాట్ ప్రారంభించింది.

అశ్విన్ 'హమ్మయ్యా' అనుకున్నాడు.

"మీరు చక్కటి శుభోదయం మెసేజ్ పెట్టి రోజు ప్రారంభిస్తే బాగా గడవకుండా ఇంకెలా ఉంటుంది?" అంటూ చాటింగ్‌లో నిమగ్నమయ్యాడు.

కొన్ని రోజుల తరువాత లాగిన్ అవ్వగానే, "మిమ్మల్ని చాలాకాలంగా అడగాలనుకుంటున్నాను. ప్రొఫైల్‌లో మీ ఫోటో ఎందుకు పెట్టలేదు?" ఆసక్తిగా అడిగాడు.

అటువైపు నుండి వెంటనే సమాధానం వచ్చింది.

“రూపం చూసి స్నేహం చేస్తే ఆకర్షణ అవుతుంది, మాటను చూసి ఇష్టపడితే ఆత్మీయత అవుతుంది. అవి రెండూ కాకుండా మనసులు మాట్లాడుకుంటే అవగాహన ఏర్పడుతుంది. అందుకే పెట్టలేదు.” ఆమె సమాధానం అశ్విన్‌ను మరింత ఆకట్టుకుంది.

“మీ ఆలోచనలు అన్నీ బాగుంటాయి. నా ఊహ ప్రకారం మీరు చాలా అందంగా ఉంటారు” ఆమె ఏం చెప్తుందా అని కళ్ళు పెద్దవి చేసి చూస్తున్నాడు.

“నేను అందంగా ఉంటేనే మీరు స్నేహం చేస్తారా?”

“లేదండీ, మీరు ఎలా ఉన్నా స్నేహం చేస్తాను. నాకు మీ మనస్తత్వం నచ్చింది”

“మీరెందుకు ఇప్పటివరకు పెళ్లి చేసుకోలేదో తెలుసుకోవచ్చా?”

“నాకు నచ్చిన అమ్మాయి దొరకక”

“ఎలాంటి అమ్మాయి కావాలనుకుంటున్నారు?”

“అందంగా ఉండాలి, అంతే మంచితనం కలిగి ఉండాలి. మరి మీరెందుకు చేసుకోలేదో అడుగవచ్చా?” ప్రశ్నించాడు.

“నేను అందంగా ఉండనని ఎవరికీ నచ్చడం లేదు”

అశ్విన్ ముఖంలో రంగులు మారాయి.

“మీరు అబద్ధం చెప్తున్నారు” క్షణం ఆగి జవాబిచ్చాడు.

“లేదు, నేను ఎప్పుడూ అబద్ధం చెప్పను”

అశ్విన్ ఆ మాటలలో నిజాయితీ గమనించాడు.

“మీ మనసు మాత్రం అందంగా ఉందండి” మానసికంగా తనను తాను సంసిద్ధం చేసుకుంటూ ప్రశంసించాడు.

రోజులు వడివడిగా గడుస్తున్నాయి. అలాగే వారిమధ్య స్నేహబంధం కూడా దిన దిన ప్రవర్ధమానంగా పెరుగుతూ వస్తోంది. జీవితంపట్ల వారికున్న దృక్పథాలు, ఇష్టాయిష్టాలు ఒకరికొకరు పంచుకుంటూ ఒక్కపూట కూడా మాట్లాడకుండా ఉండలేని స్థితికి వచ్చేసారు. అశ్విన్ మనసులో ఆమెపట్ల ప్రేమ తొంగి చూస్తోంది.

“మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని ఒకసారి చూడాలనుకుంటున్నాను” ఒకరోజు అడిగేసాడు.

“అలాంటివి అడగొద్దని నేను మొదటే చెప్పేసాను”

“నేను మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలంటే కలవక తప్పదు”

“నన్ను చూసాక మీరు చెప్పాల్సింది కూడా మరచిపోయి పారిపోతారు”

"నో... నాకు తెలియకుండానే మీతో కలిసి చాలా దూరం ప్రయాణించాను. ఇప్పుడు మీరు ఎలా ఉన్నా మీ స్నేహాన్ని వదులుకోలేను"

"ఏది ఏమైనా కల్పనలో ఎక్కువకాలం ఉండటం ఎవరికీ మంచిది కాదు. కాబట్టి నేను మిమ్మల్ని కలవడానికి సిద్ధమే!"

"అయితే మీకు దగ్గరగా ఉండే ప్రదేశం చెప్పండి, నేనక్కడకు వస్తాను"

"రేపు ఆదివారం కదా.. సాయంత్రం ఆరుగంటలకు అబిడ్స్‌లో పార్కు దగ్గరకు వస్తారా?"

"తప్పకుండా వస్తాను" ఉత్సాహంగా అన్నాడు.

"అయితే రేపు కలుద్దాం" అంటూ ఆమె సెలవు తీసుకుంది.

అశ్విన్ ఆ రాత్రంతా నిద్రపోకుండా చాలా ఉద్విగ్నతకు లోనయ్యాడు. అతడిలో టీనేజ్ కుర్రాడిలా కొత్త ఉత్సాహం, తెలియని అలజడితో కూడిన భయం చోటుచేసుకున్నాయి.

'నిజంగానే ఆమె అందంగా లేకపోతే? చాలా అసహ్యంగా ఉంటే? అప్పుడేం చేయాలి? వెంటనే తల విదిలించాడు. వద్దు, కేవలం రూపం కోసం ఆమెను దూరం చేసుకోకూడదు' అని తనని తాను సమాధానపరుచుకున్నాడు.

మరుసటిరోజు సాయంత్రం అద్దం ముందు నిలబడి మళ్ళీ మళ్ళీ జుట్టు సరిచేసుకున్నాడు. సరిగ్గా ఆరు గంటలకల్లా అబిడ్స్ లోని పార్కు వద్దకు చేరుకున్నాడు.

"నేను పార్కు గేటు దగ్గర ఉన్నాను. మీరు ఎక్కడ ఉన్నారు?" అని మెసేజ్ పంపాడు.

"మీరు అక్కడే ఉండండి, నేనే అక్కడకు వస్తాను" జవాబిచ్చింది.

"నన్నెలా గుర్తుపడతారు?"

"మరచిపోయారా? మీ ప్రొఫైల్‌లో ఫోటో ఉంది కదా?"

అశ్విన్ పొరపాటుకు తల కొట్టుకుని ఆత్రుతగా పార్కు లోపలకు చూడసాగాడు. కొంచెంసేపటి తరువాత ఎదురుగా వస్తున్న అమ్మాయిని చూసి అవాక్కయ్యాడు.

'అదేమిటి ఆమె?... ఆమె మాధురి కదా? ఇటువైపే వస్తోందేంటి?!!' అయోమయంగా చూస్తున్నాడు.

"అశ్విన్! మీరు ఎదురు చూస్తున్న వ్యక్తిని నేనే!" దగ్గరకొచ్చి అంది ఆమె.

అశ్విన్ దగ్గర మాటలు లేవు... అతడి మనసు మూగబోయింది. ఆమె అందంగా ఉండదనే భావానికి కొన్నాళ్ళ క్రితమే మనసును సిద్ధం చేసుకున్నాడు. కానీ ఇప్పుడు... ఇలా... ఎంత మాత్రం అతడు ఊహించని విధంగా...!

"ఐ యాం వెరీ సారీ అశ్విన్! మీ స్థానంలో వేరే వారున్నా ఇదే విధంగా స్పందిస్తారు" మెల్లిగా అంది.

'మాధురి ఆఫీసులో ఒక కొలీగ్‌గా మాత్రమే తెలుసు. అప్పుడప్పుడు ఫైల్స్ మార్చుకోవడం తప్ప, ఎలాంటి మాటలు లేవు. ఆమెకు అంగవైకల్యమే తప్ప మరే విధమైన లోపం లేదనీ, మంచిదనీ ఆఫీసులో అందరూ అనుకుంటారు. తను మాత్రం ఎప్పుడూ పట్టించుకోలేదు. ఈమెలోనేనా నేనిష్టపడిన మనసుందీ? ఇప్పుడు నేనేం చేయాలి?' అతడి మనసులో తీవ్ర మథనం మొదలైంది.

"వన్స్ అగైన్ సారీ అశ్విన్! మీరింకా షాక్ లోనే ఉన్నారు. నేనిక బయలుదేరుతాను" అంటూ ముందుకు వెళ్ళిపోయింది.

సరిగ్గా అప్పుడే అతడికి రుషి నుండి కాల్ రావడంతో ఆన్ చేసాడు.

"ఏరా! నీ డ్రీమ్‌గర్ల్ కలిసిందా? ఆమె చెప్పినట్లు అందవికారంగా ఉందా? నువ్వనుకున్నట్లు అందంగా ఉందా?" ప్రశ్నలవర్షం కురిపించాడు.

"రుషి! నువ్వు చెప్పింది నిజమేరా... చూసే మనసుంటేనే అందం కనిపిస్తుంది. రేపు ఆఫీసులో నువ్వు ఊహించలేని పెద్ద సర్ప్రైజ్ ఇస్తాను" అని ఫోన్ పెట్టేసి ముందుకు చూసాడు.

ఆమె పోలియో కాలు ఈడుస్తూ మెల్లిగా నడుస్తోంది. అశ్విన్ వేగంగా వెళ్ళి ఆమె చేయి పట్టుకుని ఆపాడు. ఆమె ముఖంలో చెప్పలేనంత ఆశ్చర్యం!...

"నేను మిమ్మల్ని చూసి షాక్ అయిన మాట నిజమే! శారీరక సౌందర్యానికిచ్చే ప్రాధాన్యత మానసిక సౌందర్యానికిచ్చుంటే ఒకే ఆఫీసులో కలిసి పనిచేస్తున్న మిమ్మల్ని ఎప్పుడో గుర్తించేవాడిని. ఇలా జీవితాంతం మీ చేయి పట్టుకుని నడవడానికి అంగీకరిస్తారా?" చిరునవ్వుతో అడిగాడు అశ్విన్.

"తొందరపడుతున్నారేమో అశ్విన్? బహుశా ఇదంతా జాలితోనేనా?"... సంకోచిస్తూ అంది.

"జాలిపడవలసిన పరిస్థితిలో మీరు లేరు. నేను తొందరపడకపోతే మీలాంటి ఆణిముత్యం చేజారిపోతుంది. ఇంతకీ మీ పేరు మాధురి కదూ?" చిలిపిగా అన్నాడు అశ్విన్.

"అవ్యక్త మాధురి" అంటూ మధురంగా నవ్వింది.

# పులి గాండ్రింపు

శశాంక్
✆ 93478 90454

బాల కథ

***కోతి దగ్గరికి వెళ్ళి పులి నోటిని పరిశీలించింది. "ఓహ్! గొంతు ఎర్రగా ఉంది. నీకు జ్వరం కూడా ఉంది."***

***పులి తలూపింది. "ఈ రోజు గాండ్రించే శక్తి లేదు," అంది.***

***'దీనికి వెంటనే జలుబు, జ్వరం నయమైతే అది తిరిగి పెద్దగా గాండ్రించడం మొదలుపెడుతుంది. నేను ఇంకా కొద్దిరోజులైనా సుఖంగా నిద్రపోవాలి!' అని మనుసులో అనుకుంది కోతి. ఆ ఆలోచనతోనే అది దుర్మార్గమైన నిర్ణయం తీసుకుంది.***

ఒక అడవికి రాజు.. పులి!

అది ప్రతి ఉదయం గుహలోంచి బయటకి వచ్చి పెద్దగా గాండ్రించేది. అడవంతా పులి గళంతో మార్మోగిపోయేది. ఆ శబ్దం విని అన్ని జంతువులు.. 'రాజు మేల్కొన్నాడు' అని పరస్పరం చెప్పుకునేవి.

పులి గుహకు ఎదురుగా ఉన్న మామిడిచెట్టుపై ఒక కోతి ఉండేది. ఆ కోతి అడవిలోని జీవులకు మూలికల వైద్యం చేసేది.

కానీ పులి ఉదయపు గాండ్రింపు కోతికి పెద్ద తలనొప్పిగా మారింది. 'పొద్దుపొద్దున్నే ఈ పులి గోల ఏందిరా నాయనా?' అని కోతి విసుక్కునేది.

'ప్రతిరోజూ ఇంత పెద్దగా అరుస్తే ఎవరైనా నిద్రపోతారా!' అని గట్టిగా చిరాకు పడేది. ఒక రోజు ఉదయం, కోతి ఇంకా నిద్రలో ఉండగా, పులి గుహ నుంచి ఎలాంటి శబ్దమూ రాలేదు.

'ఈ రోజు పొద్దున్నే పులి గాండ్రించలేదే?' అని ఆశ్చర్యంగా నిద్రలేచి, కొంచెం సందేహంగా చెట్టుపై నుండి కిందకి దిగింది కోతి. ఏమైంది ఈ రోజు? పులికి ఏమైనా అనారోగ్యం చేసిందా? అని ఆలోచిస్తూ, నెమ్మదిగా గుహ వద్దకు పోయింది. గుహ లోపల పులి నీరసంగా మూలుగుతున్న శబ్దం వినిపించింది.

"పులి రాజా! పులి రాజా! నేను లోపలికి రావచ్చా?" అని బయట నుంచే కోతి అరిచింది.

పులి బలహీనంగా "రా, మిత్రమా... రా..." అంది. కోతి గుహలోనికి అడుగుపెట్టింది.

పులి కళ్లుముడుచుకుని, నిస్సత్తువగా పడిఉంది.

"ఏమైంది రాజా? ఎవరైనా గాయపరిచారా?" అని కోతి అడిగింది.

"లేదు, లేదు!! నా గొంతు బాగా నొప్పిగా ఉంది! జలుబు చేసింది అనుకుంటా.." అని పులి నీరసంగా చెప్పింది.

కోతి దగ్గరికి వెళ్ళి పులి నోటిని పరిశీలించింది. "ఓహ్! గొంతు ఎర్రగా ఉంది. నీకు జ్వరం కూడా ఉంది."

పులి తలూపింది. "ఈ రోజు గాండ్రించే శక్తి లేదు," అంది.

'దీనికి వెంటనే జలుబు, జ్వరం నయమైతే అది తిరిగి పెద్దగా గాండ్రించడం మొదలుపెడుతుంది. నేను ఇంకా కొద్దిరోజులైనా సుఖంగా నిద్రపోవాలి!' అని మనసులో అనుకుంది కోతి. ఆ ఆలోచనతోనే అది దుర్మార్గమైన నిర్ణయం తీసుకుంది.

పులికి సరైన మందు కాకుండా వేరే మూలికల మిశ్రమం ఇచ్చింది.

పులి ఆ మందు తాగి రాత్రంతా మూలుగుతూ నిద్రపోయింది. మరుసటి ఉదయం కూడా పులి శబ్దం వినలేదు.



కోతి సంతోషంగా 'చాలారోజుల తర్వాత హాయిగా నిద్రపోయా' అనుకుంది. కానీ అడవిలోని ఇతర జంతువులు చింతించసాగాయి.

ఏనుగులు, కుందేళ్లు, జింకలు కూడా 'పులి గాండ్రింపు ఎందుకు వినిపించడంలేదు?' అని ఆశ్చర్యపడ్డాయి. ఆ నిశ్శబ్దాన్ని గమనించి వేటగాళ్లు అడవిలోకి ప్రవేశించాలనుకున్నారు.

"అడవిలో పులి లేనట్టుంది! మనం జంతువులను హాయిగా వేటాడవచ్చు!" అని అనుకొని కత్తులు, తుపాకులు తీసుకొని అడవిలోకి దూరారు.

జంతువులన్నీ భయంతో పరిగెత్తాయి.

కోతి కూడా ఒకచెట్టునుండి మరొక చెట్టుకి దూకుతూ పారిపోతూ ఉంది.

వేటగాళ్లలో ఒకరు.. "ఆ కోతిని పట్టుకో!" అని అరిచాడు. భయంతో కోతి పులి గుహలోకి పరుగెత్తి దాక్కుంది.

అప్పుడు అది పులిని చూసి చెప్పింది. "రాజా! నేను తప్పు చేసాను. పొద్దుపొద్దున్నే నీ గాండ్రింపు మా నిద్రను చెడగొడుతుందని తలచి నీకు సరైన వైద్యం చేయలేదు. కానీ ఇప్పుడు తెలిసింది.. నీ గాండ్రింపు లేక అడవి ప్రమాదంలో పడింది!"

పులి కళ్ళు తెరిచి నిస్సహాయంగా.. "మిత్రమా! రోగులకు వైద్యం చేయటం నీ ధర్మం కదా?" అని అడిగింది.

కోతి తలదించుకుని.. "నా నిద్ర కోసం, మీ జలుబు త్వరగా కాకుండా, నెమ్మదిగా నయమయ్యే మూలికల మందు ఇచ్చాను" అంది.

పులి నిట్టూర్చింది, కానీ కోతిని క్షమించింది.

"ఇప్పుడైనా సరైన మందు ఇవ్వు" అని పులి మృదువుగా చెప్పింది.

కోతి వెంటనే చెట్టు మూలికలు తెచ్చి కొత్త మిశ్రమం తయారు చేసింది.

పులికి ఆ మందు ఇవ్వగా అది నెమ్మదిగా కోలుకోవడం ప్రారంభించింది.

రెండు రోజుల్లో పులి పూర్తి ఆరోగ్యవంతమైంది. మూడవ రోజు ఉదయం అది అడవి దద్దరిల్లేలా గాండ్రించింది.

ఆ గొంతు విని అడవంతా మళ్లీ జీవం వచ్చింది.

పులి గాండ్రింపును విని వేటగాళ్లు అడవిని వదిలి పారిపోయారు. "పులి గాండ్రింపే మా బతుకు భరోసా!" అని సంతోషంగా అనుకుంది కోతి.

# విందు భోజనం

నీలం రాము
✆ 94419 19630

బాల కథ

***"మిత్రమా, మేము నడుచుకుంటూ ఎలుగుబంటి ఇంటికి చేరుకోలేమన్న సంగతి మాకు తెలుసు. కానీ ఎలుగుబంటి పిలిచినప్పుడు కాదనలేకపోయాము. అందుకే వస్తామని చెప్పాము" అంది.***
***"మేము రాము అనలేకపోయాము. ఎలుగుబంటి బాధపడుతుందేమోనని" అంది మొసలి.***

***విషయం తెలుసుకున్న కోతి "అయ్యో! మీరు ఎంత మంచివారు! మీరు ఈ చెట్టు కింద విశ్రాంతి తీసుకోండి. నేను ఇప్పుడే వస్తాను" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.***

అనగనగా, ఒక అడవిలో ఒక ఎలుగుబంటి వైద్యం చేస్తుండేది. దానికి ఒక బుజ్జి ఎలుగు పుట్టింది. అది నల్లగా, ముద్దుగా, బొద్దుగా ఉండేది. దాని శరీరంపై మెత్తటి వెంట్రుకలు మెరుస్తూ ఉండేవి. అడివంతా ఆ బుజ్జి ఎలుగు గురించి ముచ్చట్లు ఆడుకునేవి.

ఎలుగుబంటి ప్రతిరోజు నీళ్లు తాగడానికి చెరువుకు వెళ్ళేది. అక్కడ ఉండే కప్ప, బాతు, తాబేలు, మొసలితో ఎలుగుబంటికి స్నేహం ఏర్పడింది.

ఒకరోజు ఎలుగుబంటి నీళ్లు తాగటానికి చెరువుకు వచ్చింది. అప్పుడు అక్కడే ఆడుకుంటున్న కప్ప, బాతు, తాబేలు, మొసలి ఎలుగుబంటిని పలకరించాయి.

"మిత్రమా, నీ బిడ్డను మాకు చూపించవా?" అని తాబేలు అడిగింది.

"నీ బిడ్డ నల్లగా, ముద్దుగా, బొద్దుగా ఉన్నాడని ఎప్పుడూ చెప్పుకుంటుంటాం. ఎప్పుడు తీసుకువస్తావు?" అని మొసలి అంది.

"అయ్యో! పిల్లందరిలాగే నా బజ్జీ కూడా చాలా అందంగా ఉంటుంది. మిత్రులారా, మీరు రేపు మా ఇంటికి వచ్చి నా బిడ్డను దీవించండి. చక్కటి విందు చేస్తాను!" అంది ఎలుగుబంటి.

కప్ప చెరువు చుట్టూ గంతులు వేస్తూ, "ఓహో! అలాగే వస్తాను," అంది.

బాతు తన రెక్కలు టపటపలాడిస్తూ, "నువ్వు పిలిచాక రాకుండా ఉంటానా?" అంది.

తాబేలు, మొసలి మాత్రం మౌనంగా ఉండిపోయాయి.

“మిత్రులారా, మీరిద్దరూ ఎందుకు మాట్లాడరే?” అని అడిగింది ఎలుగుబంటి.

తాబేలు నెమ్మదిగా తల ఊపుతూ “నేను తప్పకుండా వస్తాను” అంది.

మొసలి నీటిలో తేలుతూ తల పైకి లేపి, “విందు అంటే ఎవరికి ఇష్టం ఉండదు? నేను వస్తా!” అంది.

మరుసటిరోజు అవి నలుగురు ఎలుగుబంటి ఇంటికి వెళ్లడానికి సిద్ధమయ్యాయి. కప్ప గెంతుతూ బయలుదేరింది. దాని వెనకే బాతు రెక్కలాడిస్తూ ఎగురుతూ వెళ్ళింది.



ఇక వీరిద్దరినీ తాబేలు నెమ్మదిగా అనుసరించింది. పాపం మొసలి తన బుజ్జి కాళ్లతో బరువైన శరీరాన్ని కదిలిస్తూ విరామం లేకుండా నడుస్తూ తాబేలును అనుసరించింది.

తాబేలు, మొసలి కొద్ది దూరం వెళ్ళగానే అలసిపోయి ఒక చెట్టు నీడలో విశ్రాంతి తీసుకున్నాయి. కానీ కప్ప, బాతు విందు ఆరగించాలనే ఆలోచనతో, “మిత్రులారా, మీరు నెమ్మదిగా రండి. మేము ముందుగా వెళ్లి విందు ఆరగిస్తాం” అంటూ వేగంగా బయలుదేరాయి.

ఇదంతా పైన ఉన్న చెట్టు నుంచి ఒక కోతి చూసింది. చెట్టు దిగి, “ఎలుగుబంటి ఇల్లు చాలా దూరంలో ఉంది. మీరు ఎంత వేగంగా వెళ్ళినా ఈరోజుకి చేరుకోలేరు!” అంది.

అప్పుడు తాబేలు కోతిని దగ్గరకు పిలిచి, “మిత్రమా, మేము నడుచుకుంటూ ఎలుగుబంటి ఇంటికి చేరుకోలేమన్న సంగతి మాకు తెలుసు. కానీ ఎలుగుబంటి పిలిచినప్పుడు కాదనలేకపోయాము. అందుకే వస్తామని చెప్పాము” అంది.

“మేము రాము అనలేకపోయాము. ఎలుగుబంటి బాధపడుతుందేమోనని” అంది మొసలి.

విషయం తెలుసుకున్న కోతి “అయ్యో! మీరు ఎంత మంచివారు! మీరు ఈ చెట్టు కింద విశ్రాంతి తీసుకోండి. నేను ఇప్పుడే వస్తాను” అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

ఇక ఎలుగుబంటి ఇంటికి ముందుగా చేరుకున్న కప్ప, బాతు బొజ్జనిండా భోజనం చేసేశాయి. “మేం పిలిచినా సరే తాబేలు, మొసలి విందుకు రాలేదు” అని అబద్ధం చెప్పాయి.

ఇంతలో అక్కడికి చేరుకున్న కోతి అంతా నిజం చెప్పింది. తాబేలు, మొసలి తనపై ఉన్న గౌరవం, ప్రేమ చూసి ఎలుగుబంటి కదిలిపోయింది. తన బిడ్డను ఎత్తుకొని, విందు పదార్థాలన్నీ మూటగట్టి, కోతి వెంట వెళ్లి తాబేలు, మొసలిని చేరుకుంది.

ఎలుగుబంటి పెద్ద పెద్ద విస్తరాకులు పరిచి, కమ్మటి విందు వడ్డించి, “కడుపునిండా భోజనం చేయండి” అంది.

తాబేలు, మొసలి తృప్తిగా తిని బుజ్జి ఎలుగును దీవించి కానుకలు ఇచ్చాయి.

అక్కడే ఉన్న కప్ప, బాతు తమ తప్పు తెలుసుకొని, “విందు మీద ఆశతో తాబేలు, మొసలి రాలేదని అబద్ధం చెప్పినందుకు క్షమించు!” అంటూ ఎలుగుబంటిని వేడుకున్నాయి.

ఎలుగుబంటి చిరునవ్వు నవ్వుతూ, “ఎదుటివారి పట్ల ఉన్న గౌరవం, ప్రేమ వల్లనే కొన్ని సార్లు ‘లేదు’ అనడం కష్టమవుతుంది!” అంది.

తన బిడ్డను ఒడిలో ఎత్తుకొని, కోతికి కృతజ్ఞతలు తెలుపుతూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

కప్ప, బాతు, తాబేలు, మొసలి.. కలిసి సంతోషంగా తిరిగి చెరువుకు వెళ్లాయి.

## అక్షరాక్షతలు

**తమిరిశ జానకి**

శర్మగారూ నమస్తే.! మీలాంటివారి అందరి (ఎందరో మహానుభావులు) సహృదయతతో నాలాంటి వారి పేరు మరుగున పడిపోకుండా నిలిచి ఉంటోంది. అందుకు నేను సదా కతజ్ఞురాలిని అని మనవి చేసుకుంటున్నాను. ఇదివరకటి రోజుల్లో వివిధ పత్రికలు వార, పక్ష, మాసపత్రికలు వచ్చేవి. అన్నిటిలోనూ నా రచనలు వచ్చేవి. ఇప్పుడవి లేవు. కానీ మీలాంటివారి కార్యదీక్ష, కృషి వలన ఆన్ లైన్ పత్రికలు రచయితలకు ఆశాదీపాలుగా ఉన్నాయి. ఇవి ఎన్నటికీ ఆరని దీపాలై రచయితలను ప్రోత్సహిస్తున్నాయి. కథామంజరి నడుపుతూ మీరు చేస్తున్నది మామూలు పనికాదు.. ఇది ఒక “సాహితీసేవ”! మంచి సాహిత్యానికి విలువ ఇస్తూ, రచయితలను ప్రోత్సహిస్తున్న కథామంజరికి నా అభినందనలతో పాటూ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

# అతను - ఆమె


శ్రీమతి గంటి భానుమతి

✆ 8897643009


**విశిష్ట అతిథి కథ**

***ఓ చేత్తో పెద్ద నల్లటి గొడుగు, రెయిన్ కోటు, టోపీ వేసుకున్న యువకుడు వాళ్ళ దగ్గరకొచ్చి, టోపీ తీసేసి, గొడుగుని తల్లి, తండ్రి మీద వర్షం పడకుండా ఉంచి, ఎడం చేత్తో వాళ్ళిద్దరినీ తన గుండెలకి హత్తుకున్నాడు.***
***మాకు మాటలు రాలేదు. గుండె గొంతుకలో అడ్డం పడింది. మాటలు వాళ్ళు కూడా మాటాడుకోలేదు. ఆ స్పర్శ చాలు, అదే ఎన్నో మాటలు మాట్లాడింది.***

రైలాగినట్టైంది. స్టేషన్ అనుకుంటాను. కళ్ళు విప్పకుండానే రగ్గుని మెడ వరకూ లాక్కుని ఒత్తిగిల్లాను.

మాటలు ఒకసారి పెద్దగా వినిపించి, నా బెర్త్ దగ్గరగా ఆగాయి. మళ్ళా గట్టిగా మాటలు... ఇంత గట్టిగా మాట్లాడతారేంటి? అందరూ పడుకున్నారని తెలీదా?

“శివయ్యా తెల్ల దుప్పట్లూ రగ్గులూ ఉన్నాయి” అని ఒకళ్ళూ- - -

“ఇందులో పూరీలున్నాయి. అక్కా, ఈ సంచిలో స్టీలు డబ్బా ఉంది. అందులో కూర పెట్టాను...”

“ఇందులో పప్పుచెక్కలూ, చేగోడీలూ ఉన్నాయి. నీళ్ళసీసా ఇదిగో ఈ మూల పెట్టాను...”

మత్తుగా ఉన్న నేను కళ్ళుతెరిచి చూసాను. కింద రెండుబెర్తుల మీదకీ వచ్చినవాళ్ళు. ఈ పదిమందీ వాళ్ళని సాగనంపడానికి వచ్చినవాళ్ళా!

వాళ్ళనీ, వాళ్ళ నలిగిన బట్టలనీ చూసి అనుకున్నాను... ‘పొరపాట్న ఈ ఏసీ కంపార్ట్మెంటులోకి ఎక్కారా...’ అని!

“కాస్త మెల్లిగా మాట్లాడండి. మేమంతా పడుక్కుని ఉన్నాం” ఎవరో గట్టిగా అన్నారు.

నేననాలనుకున్నది అనలేకపోయాను. ఇంకెవరో అన్నారు.

ఒక్కసారి నిశ్శబ్దం. మళ్ళీమాటలు! ఈసారి గుసగుసలు. “మీ మల్లేశం పెళ్ళేమైనా చేసుకుంటాడేమో కనుక్కో అన్నయ్యా...”

“దిగండి... రైలు కదులుతుందో ఏమో...” అని ఎవరో హెచ్చరించారు.

అందరూ వెళ్ళిపోయారు. రైలు కదిలే సమయానికి అతను, ఆమె వచ్చారు. నా బెర్తు దగ్గర నించున్నారు.

“నీకు గర్వంగా ఉందా?” అన్నాడు ఆమె పక్క సరిచేస్తూ.

“అవును, మనలాంటి అదృష్టం అందరికీ రావాలి!” అందామె పడుకుంటూ.

“పడుకో. బాగా తెల్లారాక, అందరూ లేచాక మనంకూడా లేద్దాం!”

ఆ తరవాత నిశ్శబ్దం. నాకేమీ వినబడలేదు. నా నిద్ర తేలిపోయింది!

★★★

‘మీరొక్కరూ ఎందుకు? ఇక్కడికి వచ్చేయండి’ అన్న కొడుకు దగ్గరకి ప్రయాణమౌతున్నాను. రాత్రి ఫ్లైట్. అంతవరకూ కుర్లాలో ఉన్న తమ్ముడి దగ్గర ఉండి, అక్కడ నుండి టాక్సీ తీసుకొని ఒక్కడినే వెళ్లిపోతాను.

ఆలోచిస్తూనే నిద్ర పోయాను.

★★★



కాఫీ, టీ అని అరుస్తున్న అబ్బాయిని పిలిచి అడిగాను... ‘ఏం స్టేషన్?’ అని. ‘వరంగల్’ అని చెప్పి ఆగాడు. కాఫీ, టీ ఏదీ వద్దన్నాను.

కాజీపేట వచ్చేసరికి బాగా వెలుగొచ్చింది. అందరూ కింద కూచున్నారు.

అప్పుడు చూసాను వాళ్ళిద్దరినీ! ఫెళఫెళలాడుతున్న కొత్తబట్టల్లో అతనూ, మెరుపు మెరుపుల ఎర్రచీరలో ఆమె! చెరో కిటికీ పక్కనా కూచున్నారు. ఇద్దరూ నలుపే. అరవైదాటిన వాళ్ళే! ఇద్దరికీ కళ్ళజోళ్ళున్నాయి. ఇద్దరి జుత్తూ బాగా తెల్లగా ఉంది. కొనుక్కున్న నవల చదువుకుంటూ మధ్యలో వాళ్ళని చూస్తున్నాను. ఇద్దరూ కూడా సెల్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నారు. గట్టిగా మాటాడుతుంటే అందరూ విసుగ్గా వారిని చూసారు.

సికింద్రాబాదులో రైలాగాక, కాఫీ తాగి లోపలికి వచ్చేసరికి అతనూ, ఆమె పూరీలు తింటున్నారు. తినడం అయిపోయాక, పేపర్ ప్లేట్లని ఎక్కడ పారేయాలో తెలియలేదు. ఏసీ కంపార్ట్మెంట్ గాబట్టి కిటికీ తలుపు తీయడానికి రాలేదు.

“అక్కడ చేయి కడుక్కునే బేసిన్ కింద ఉంటుంది. దానిలో వేసి రండి...” అని నా పక్కనున్న నీలం టీ షర్ట్ అతను అన్నాడు.

“మేం మొదటిసారి ఇలాంటి దీన్లో వస్తున్నాం. అందుకే తెలీదు” ఆమె సిగ్గుపడుతూ అంది. ఈ లోపల ఆమె సెల్‌ఫోన్ మోగింది.

కిటికీవైపుకి జరిగి, కిటికీకి తలని ఆనించి “హలో” అంటూ ఉంటే, ఆమె మొహంలో నవ్వూ, సంతోషం రెండూ కనిపిస్తున్నాయి.

“మాకు ఫ్రెండ్స్ ఎక్కువ... ఆమెకి ఇంకా ఎక్కువ!” అన్నాడాయన.

ఆ మాట నిజమే. పది నిమిషాలకొకసారి ఆవిడ ఎవరితోనో మాట్లాడుతూనే ఉంది.

నాకూ ఓ సెల్ ఉంది. అదెప్పుడూ నిశ్శబ్దంగా ఉంటుంది.

“చాలామంది వచ్చారే మిమ్మల్ని దింపడానికి!” అన్నాను.

గర్వంగా వాళ్ళిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. వెంటనే ఆమె లేచి, నన్ను కిటికీ దగ్గర కూచోమన్నట్టు సైగ చేసింది. ఆమె వెళ్ళి భర్త పక్కన కూర్చుంది. నేను కిటికీ దగ్గరకు జరిగాను.

“వాళ్ళంతా మా ఊరివాళ్ళు. మాలాగా ఓ చెక్కపొలం ఉన్నవాళ్ళు. నాకోసం... నడిచి ఓ మైలు దూరం, ఆటోలో ఆరు కిలోమీటర్లూ, బస్సులో ఇంకో పన్నెండు కిలోమీటర్లూ ప్రయాణించి విజయవాడ వచ్చారు. వాళ్ళంతా నా రక్తం పంచుకున్నవారు కాదు. మనసు పంచుకున్నవాళ్లు! ఇన్నేళ్లకి కొడుకుని కలుసుకోడానికి వెళ్తున్నానని నా సంతోషాన్ని పంచుకుందికి వచ్చారు.”

ఆ కళ్ళలో మెరుపూ... సంతోషం!

ఒకప్పుడు అమెరికా వెళ్తుంటే నా కళ్ళలో, దుర్గ కళ్ళలో ఇలాంటి మెరుపూ, సంతోషం ఉండేవి! ఈరోజున కాదు. ఎందుకంటే, దుర్గ పైలోకాలకు చేరుకొని పద్నాలుగు నెలల పదకొండు రోజులైంది. ఏదో రోజులీడుస్తున్నాను.

"ఎక్కడున్నాడు మీ అబ్బాయి?" నా పక్కనున్న నీలం షర్టు అడిగాడు.

"బొంబాయి" గర్వం... గొంతులో, కళ్ళలో!

"నేను రైలెక్కడం ఇదే మొదలు. పెద్దాడు తిరప్తి తీసుకెల్తానన్నప్పుడు అత్తమ్మకి పక్షవాతం వచ్చింది. అప్పుడు వెళ్లలేదు. 'అమ్మా దిగులు పడమాక. నిన్ను ఏసీ రైల్లో అయిద్రాబాదు తీసుకెల్తాను. బొంబాయి, డిల్లీ చూపిత్తాను' అని అన్నాడు కానీ, వాడే టికట్టు తీసుకొని పైకెల్లిపోయాడు" కళ్ళు తుడుచుకుందామె.

అతను అందుకున్నాడు. "ఆడికి పెద్దగా చదువు రాలేదు. పదోక్లాసు పాసయ్యాక మిలట్రీలో మా ఊరిమనిషి చేర్పించాడు. కానీ, యుద్ధంలో పోయాడు. ప్రాప్తం... అంతే! చేతికి అందొచ్చినవాడ్ని, అలా దేశానికి ఇచ్చేసాం." గొంతులో జీరా, వణుకూ!

నేనూ అంతేగా... చేతికందొచ్చినవాడ్ని అమెరికాకి అప్పజెప్పెయ్య లేదా!

ఆ రెండింటి తేడా నాకు బాగా తెలుసు.

"మా చిన్నవాడు వాడొక్కడే మిగిలిన కొడుకు. చదువుకుంటానంటే వద్దనలేదు. విజీవాడలో ఉంచి చదివించాం. వాడి స్నేహితుడు బొంబాయి తీసుకెల్లాడు. అక్కడ ఉజ్జోగం. ఇన్నాళ్ల తరవాత జీతం పెరిగిందంట. ఇల్లు కూడా దొరికిందంట. రమ్మనంటే మేవెల్లలేదు. మా ఊరుని విడిచి వెల్లాలనిపించలేదు."

ప్రతీ మధ్యతరగతి వాడి కథా ఇలాగే ఉంటుంది... ఓల్డ్ స్టోరీ!

"రెండునెలల క్రితం మా ఇద్దరికీ చెరో సెల్లూ కొనుక్కోడానికి డబ్బులు పంపించి, అందులోంచి మాటాడమన్నాడు. ఓ రోజున ఫోన్ చేసి మమ్మల్ని ఆశ్చర్యపరుస్తానని అన్నాడు. అలాగే ఆశ్చర్యపరిచాడు. బొంబాయి రావడానికి రెండు టికెట్లు పంపాడు. ఆశ్చర్యపోయాం. మరో పదిరోజులకి విజయవాడ హోటల్లో ఏసీ గదిని రెండు రోజులకు తీసుకున్నట్టు కాయితాలు పంపాడు. అదీ ఆశ్చర్యమే! ఆ తరవాత మరో వారం రోజులకు చెక్కు పంపాడు. జగ్గయ్యపేట వచ్చి, మార్చుకొని డబ్బు తీసుకున్నాం."

అన్నీ ఆశ్చర్యమే! అవును వాళ్ళకి అన్నీ ఆశ్చర్యమే! ఆశించకపోతే అన్నీ ఆశ్చర్యమే!

"విజీవాడొచ్చాం. దుర్గమ్మని చూసాం. పానకాలసామిని చూసాం. ఇవన్నీ చూస్తామని అనుకోలేదు."

గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్!

"పొద్దున్న స్టేషన్కొచ్చాం. మా ఊరివాళ్ళందరూ వచ్చారు."

అందరూ శ్రద్ధగా ఆ ఓల్డ్ స్టోరీని వింటున్నారు. నాకు మాత్రం అంతమంది ఉన్న అతనిమీద ఈర్ష్య కలిగింది. నాకూ చుట్టాలున్నారు, స్నేహితులున్నారు. కానీ తామరాకు మీద నీటిబొట్లలా ఉంటారు.

"ఎక్కడ దిగాలి?" నీలం షర్టు పక్కనున్న మనిషి అడిగాడు.

“బొంబాయి” అందామె.

“బొంబాయి సరే, ఏ స్టేషన్లో?”

“నాకు తెలీదు” అంటూ ఆమె చిన్నపిల్లలా భర్తను చూసింది.

వింతగా చూసాం. తెలీకుండా ఎలా దిగుతారు? ఎక్కడ దిగుతారు? ఓల్డ్ స్టోరీ కానీ మలుపు తిరుగుతోంది. అతను పర్సులోనుంచి టికెట్ తీసి చూపించాడు. అది సీఎస్టీ వరకూ ఉంది.

“కళ్యాణ్‌లో దిగమని అన్నాడు. వస్తానన్నాడు.” ఈలోపల సెల్ మోగింది. అతను లేచి పక్కకు వెళ్ళాడు.

ఆమె మొదలుబెట్టింది.

“ఆయన అన్నీ చెప్పలేదు. మా మల్లేశాన్ని చదివించడానికి ఇద్దరం చాలా కష్టపడ్డాం. ఆయన వేరే వాళ్ళ పొలాల్లో పని చేశారు. నేను ఇద్దరి ఇళ్ళలో వంట చేయడం మొదలుబెట్టాను!”

మళ్ళీ పాతకథే!

“మాకు పెద్దగా చదువుల్లేవు. వాడిని చదివించాలనుకున్నాం... మాకన్నా మంచిగా బతకాలని!”

మేం కూడా అంతేగా! మా తరానికీ, వాడి తరానికీ తేడా ఉండాలనుకున్నాం. ఇల్లూ అదీ తాకట్టు పెట్టి అమెరికా పంపాం.

“మా కష్టం అంతా వాడికి తెలుసు. అందుకే మమ్మల్ని ఓ రాజూ, రాణీలా వాళ్ళ ఊరు తీసుకెళ్తానన్నాడు. అలాగే చూసుకుంటానన్నాడు.”

మావాడు ఈ మాటలు అన్నాడో లేదో నాకు తెలీదు. ఇలాంటి అర్థం వచ్చే మాటలు మొదటిసారి అమెరికా వెళ్ళే ముందు అన్నాడు. తరవాత పిల్లలు పుట్టాక తీసుకెళ్ళాడు. ఓసారి అక్కడ దుర్గ ఒంట్లో బాగోలేకపోతే, ‘అమెరికాలో అన్నీ ఖరీదు. మీరు ఇండియా వెళ్ళిపొండి’ అని మమ్మల్ని అడగకుండా, విశాఖపట్నానికి టికెట్లు కొనేసాడు. వచ్చిన నాలుగురోజులకి హాస్పిటల్లో చేర్పించాను. అంతే... ఇంటికి రాలేదు. అమెరికా వెళ్ళకపోతే దుర్గ బతికేదా?

“ఎన్నేళ్ళైంది మీ అబ్బాయి వెళ్ళి?” ఇంతవరకూ మాట్లాడని, తెల్లచొక్కా మీద చేతుల్లేని గచ్చకాయరంగు స్వెట్టర్ వేసుకున్న మనిషి అడిగాడు.

“పదకొండేళ్ళైంది.”

“అమ్మో అన్నేళ్లు. గుర్తుపడతారా?”

పాతకథలో మలుపు. ఇంట్రెస్టింగ్‌గా ఉంది.

“అదేమాట వాడితో చెప్పాం. వాడో ఫోటో పంపించాడు. సూటూ, టై లో ఎంతో చక్కగా ఉన్నాడు. అద్దం కట్టించి గోడకు పెట్టాం. దాని సంగతి మరచిపోయాం. మాతో తెచ్చుకోలేదు.”

ఏదో జరగకూడనిది జరిగిపోయినట్టు అనిపించింది.

“ఎలా మరిప్పుడు? పోనీ మిమ్మల్ని గుర్తు పడతాడా?”

వాళ్ళ కథని కాదు, జీవితాన్ని వింటూ మనసుతో చూస్తున్నాను.

“మీ ఫోటో పంపారా?”

“మా మల్లేశు కూడా అదే అన్నాడు... ఫోటో పంపమని! జగ్గయ్యపేట వెళ్ళి తీసుకున్నాం. ఓ వారం రోజులు వర్షాల మూలంగా తెచ్చుకోలేదు.”

అందరూ తెలియకుండానే తలలూపుతున్నారు.

“అలాగే ఓ రోజున తెచ్చుకున్నాం. అదంతా తడిసిపోయింది. ఎండుతుందని ఫాన్ కింద పెట్టాం. ఎండాక కవర్ తీసి చూసాం. రెండు ఫోటోలూ అతుక్కొని ఉన్నాయి. తీసేసరికి మొహం మీద మచ్చలు మచ్చలు, అచ్చులు అచ్చులు!”

అందరం ఉసూరుమన్నాం.

“అదే వాడిచ్చిన ఎడ్రస్‌కి పంపాం. అయినా వాడ్ని మేమూ, మమ్మల్ని వాడూ గుర్తు పట్టగలం. మా రక్తాన్ని ఎలాగైనా గుర్తుపడతాం.”

ఇదే సెంటిమెంట్ పెద్దవాళ్ళకి! కొడుకులు మాత్రం ఏ సెంటిమెంటూ లేకుండా ఉంటారు. రక్తసంబంధం కన్నా ఆర్థిక సంబంధాలే ఎక్కువ.

గుల్బర్గా దాటాం.

“ఇదే ఆఖరు కావచ్చు. మల్లేశం ఎప్పుడూ ఉండమనే అంటున్నాడు. పెద్దవాళ్ళం అయిపోయాం. మేం చేయగలిగేది ఒక్కటే. వాడిని స్వేచ్ఛగా వదిలేయడం. మా జీవితం మాకుంది!”

మేం కూడా అలాగే అనుకున్నాం గాని కొడుకు ఒప్పుకోలేదు. పిల్లలు పుట్టిన రెండుసార్లూ వెళ్లాల్సి వచ్చింది. ఆరేసి నెల్లు. ఓ సారా, రెండు సార్లా! ఎనిమిదిసార్లు!! ఆఖరుకి దుర్గకి ఒంట్లో బాగోలేకపోతే ఇండియా పంపించేసాడు. అక్కడ వైద్యం ఖరీదు అని! పాపపుణ్యాల సంగతి ఆలోచించలేదు. లాభనష్టాల గురించే ఆలోచించాడు.

“మీకేదన్నా అయితే?”

ఇద్దరూ నవ్వారు.

“మాకా? ఏదన్నా అయితేనా? ఊళ్ళో వాళ్ళున్నారు. వాళ్ళమధ్యనే పోతాం. కొడుకుదగ్గరే పోవాలన్న నియమం ఏమీలేదు కదా!”

ఆయనకున్నంత జ్ఞానం, వైరాగ్యం నాకు ఇంకా రాలేదు.

“ఇంకా కొడుకుని ఏంచూస్తాం? కష్టపడి చదివించాం. పెళ్లి చేసాం. వాడి బతుకు వాడు చూసుకోవాలి. మనం పక్కకి తప్పుకోవాలి. వాడు మమ్మల్ని చూడాలని మేం అనుకోవడం లేదు.”

మరోమలుపు. నాలో ఉన్నది అదే. కొడుకు తండ్రిని చూడాలి. కానీ ఇతను వేరే అంటున్నాడు. కొడుకు తండ్రిని చూడాలని లేదు.

“టీవీల్లో చూస్తున్నాం. పేపర్లలో చదువుతున్నాం... తండ్రి పోతే ‘హమ్మయ్య బరువు తగ్గింది’ అనే కొడుకుల గురించి. మేం మాత్రం మేం పోతే బాధపడే వాళ్ళమధ్య ఉంటున్నాం. మేం అందరం ఓ వయసు వాళ్ళం. అందరం ఒకలాగే ఆలోచిస్తాం. అందరి భావాలూ ఒకటే. ప్రతి నిమిషం మా కోసం జీవిస్తున్నాం. ఊరి సంక్షేమం కోసం అందరం శ్రమపడుతున్నాం. మా ఊరు చరిత్రని, మాకు తెలిసిన తెలుగువారి చరిత్రని ముందు తరాలవారికి అందిస్తున్నాం.”

విన్నాక నా కర్తవ్యం ఇదా అనిపించింది. రాత్రి అందరం తినడం అయ్యాక మేమంతా పడుకోబోయాం. వాళ్ళిద్దరూ పడుకోడానికి ఇష్టపడలేదు.

“మాకు నిద్రరాదు. మేమిలాగే కూచుంటాం” అని వాళ్ళిద్దరూ కింది బెర్త్ మీద కూచున్నారు. నన్ను ఆమె బెర్త్ మీదకు వెళ్ళి పడుకోమన్నారు. నా మధ్య బెర్త్ వాడలేదు.

‘మేం లేపుతాం. కాస్త విశ్రాంతిగా ఉంటుంది పడుకోమంటే’ వినలేదు. పూనా వచ్చాక కొడుకు ఫోన్ చేసాడు. అతను సంతోషంగా కొడుకు ఆమెతో అన్న మాటలు చెప్తున్నాడు.

‘ఆటోలో డోంబివిల్లి స్టేషన్‌కి వచ్చి అక్కడ్నుండి లోకల్ తీసుకొని కళ్యాణ్‌లో మన కోసం చూస్తాన’ని అన్నాడు. ఆ మాట అందరం విన్నాం.

శివయ్య తన జీవితం గురించి చెప్పినంత సులభంగా నేను చెప్పలేను. అమెరికా జీవితంలోని పై మెరుగులు చెప్పాను. ఎందుకంటే ఇప్పుడు నా జీవితాన్ని ఏలుతున్నది హిపోక్రసీ.

పూనా దాటాక వర్షం మొదలైంది. కొడుక్కి ఫోన్ చేసాడు. ఆమె అతని వేపే ఆత్రంగా చూస్తోంది. ‘తీయడం లేదు’ అన్నాడు పాలిపోయిన మొహంతో. మళ్ళీ ఫోన్ చేసాడు. రింగౌతోందిగాని తీయడం లేదు. వాళ్ళ గాభరా చూసి, నేను లేచి వాళ్ళ పక్కనే కూర్చున్నాను. మా మాటలు వింటున్న మిగిలిన ముగ్గురూ కూడా లేచి బెర్త్‌ని పైకి ఎత్తేసి కూర్చున్నారు.

కళ్యాణ్ వచ్చేస్తోంది. బయట చీకటి... వర్షం. సెల్ ఎందుకు తీయలేదు. ఏం జరిగింది. అసలు ఏం జరిగి ఉంటుంది. ఏదైనా... ఛ ఛ... ఆ ఆలోచనే మంచిది కాదు. అతను రాకపోతే మరి వీళ్ళు? భాష రాదు. ఊరు కొత్త!

అందరి మత్తు నిద్ర ఎగిరిపోయింది. ఏమయిందో సెల్ తీయడం లేదు. అతనేం మాట్లాడలేదు. గంభీరంగా ఉండిపోయాడు. ఆమె కళ్ళు మూసుకుంది. ప్రార్థిస్తోందో ఏమో? నాకు తెలియకుండా నేను కూడా దేవుడిని వేడుకున్నాను... కొడుకునీ వీళ్ళనీ కలపమని!

కళ్యాణ్ వస్తోంది. లైట్లున్నాయి కానీ, చీకటిగా ఉంది. వర్షం బాగానే పడుతోంది.

"గుమ్మం దగ్గర నిలుచుందాం!" అన్నాను.

నిశ్శబ్దంగా చెరో పెట్టె, చెరో చేతిసంచీ తీసుకొని తలుపు తీసుకొని వాష్‌బేసిన్ దగ్గర నిలుచున్నారు. వాళ్ళిద్దరి వెనకాల మేమంతా నిలుచున్నాం.

మరాఠీలో అరుస్తున్న కూలీల గొంతులు. ప్లాట్‌ఫార్మ్ మీద మెల్లగా నడుస్తున్న రైలు. శివయ్య చేయి ఎత్తి రెడీగా ఉన్నాడు కొడుకు కనిపిస్తే ఊపడానికి! అతని పక్కనే ఆమెకూడా ఆత్రంగా చూస్తోంది.

మేమందరం మెడలు రిక్కించి చూస్తున్నాం. సన్నగా, నల్లగా ఓ ముప్పై సంవత్సరాల వయసు గల యువకుడి కోసం... వీళ్ళిద్దరి పోలికలు పట్టుకొని వెతుకుతున్నాం.

రైలు ఒక్కసారిగా ఆగింది.

"మీరిద్దరూ ముందు దిగండి. మీ సామానిస్తాం" అని వాళ్ళని దిగమని, పెట్టెలూ, బాగులూ అందించి మేం కూడా దిగాం.

అందరం మాటలు మరచిపోయాం. మల్లేశ్ ఏడీ? అటూ ఇటూ చూస్తున్నాం. అవడానికి స్టేషన్ పెద్దే గాని దిగినవాళ్లు పట్టుమని పదిమంది కూడా లేరు. మరాఠీలో మాటలు, ఎనౌన్స్మెంట్లు, వర్షం చప్పుడు!

దడదడలాడుతున్న వాళ్ళిద్దరినీ లోపల నించోమని చెప్పి, రైలు దగ్గరకి వచ్చాం. మాకే బాధగా ఉంది... ఆ చీకట్లో, వర్షంలో ఆ పెద్దవాళ్ళని అలా వదిలెయ్యడానికి. కళ్యాణ్‌లో రైలు ఎక్కువసేపు ఆగదు.

"అమ్మా, నాన్నా" అన్న పిలుపు చీకటిలో నుంచి దూసుకొచ్చింది. ఆ రెండు తెలుగు పదాలూ అందరి ఆందోళననూ ఇట్టే తీసేసాయి.

"మల్లేశ్..."

ఓ చేత్తో పెద్ద నల్లటి గొడుగు, రెయిన్‌కోటు, టోపీ వేసుకున్న యువకుడు వాళ్ళ దగ్గరకొచ్చి, టోపీ తీసేసి, గొడుగుని తల్లి, తండ్రి మీద వర్షం పడకుండా ఉంచి, ఎడంచేత్తో వాళ్ళిద్దరినీ తన గుండెలకి హత్తుకున్నాడు.

మాకు మాటలు రాలేదు. గుండె గొంతుకలో అడ్డం పడింది. మాటలు వాళ్ళు కూడా మాటాడుకోలేదు. ఆ స్పర్శ చాలు, అదే ఎన్నో మాటలు మాట్లాడింది. గబగబా మా అందర్నీ పరిచయం చేసాడు.

"సెల్ తీయలేదేం ఒకటే కంగారు పడ్డాం."

"ఇంటినుంచి ఆటోకోసం వస్తూ జారిపడ్డాను. అప్పుడు సెల్ పక్కనున్న గట్టర్లో పడిపోయింది."

మేం గబగబ రైలెక్కి వాళ్ళని చూసాం. రెయిన్‌కోటుని తల్లికి కప్పి, తను మధ్యన నుంచుని ఆ గొడుగుని బాగా పైకెత్తి పట్టుకున్నాడు.

అపురూపమైన దృశ్యంలా కనిపించింది. అందులో హిపోక్రసీ లేదు. నటన లేదు. యాంత్రికత లేదు. సజీవం!

రైలు కదిలింది. ఓ గొడుగు కింద ముగ్గురూ అలా నడుచుకుంటూ చీకటిలో కలిసిపోయారు.

★★★

పాత కథే అయినా ముగింపు బాగుంది.

ఈసారి అమెరికాలో ఓ నెల మాత్రమే ఉండి, మా ఊరు వెళ్లిపోతాను. అక్కడ గుడి, బడి, గ్రంథాలయం. ఇక ముందు నా గురించి, నాకోసం బతకాలి.

అతనిలా...

ప్రతీక్షణం...

నాకోసం...!!!

*(నవ్య .. దీపావళి ప్రత్యేక సంచిక 2010 నుంచి పునర్ముద్రణ)*

**అక్షరాక్షతలు** ............ **మెడికో శ్యామ్, యు. యస్.**

*కథామంజరి బృందానికి అభినందనలు! 'మీ కృషి, మీ శ్రద్ధ, మీ ప్రయత్నం, సమయపాలన ప్రశంసనీయం' అన్నాను ఓసారి! మీ కృషి కొంతమేర ఫలించిందని భావిస్తాను. కొత్త కథకుల సంఖ్యను పెంచగలిగారు. అదే స్థాయిలో మంచి కథల సంఖ్య కూడ రాబోయే కాలంలో పెరుగుతుందని ఆశిస్తున్నాను. కథా పరిచయాలు బావుంటున్నాయి. పరిచయం చేసిన కథ లింకు కూడా ఇస్తే బాగుంటుందని భావిస్తాను. సాధ్యాసాధ్యాలు పరిశీలించండి. 'కథా పుస్తక విశ్లేషణ' ప్రవేశపెట్టడం అదనపు ఆకర్షణ. మంచి ప్రయత్నం! విమర్శ.. ముఖ్యంగా కథావిమర్శ తెలుగులో సరియైన స్థాయిలో లేదన్నది పాత విమర్శ! ఆ విషయంలో మీరేమైనా చేయగలరేమో ఆలోచించండి! ప్రముఖ విమర్శకులెవరినైనా ఆహ్వానించి, వారి చేత ప్రత్యేక విమర్శనా వ్యాసాలు రాయించగలరా? ప్రయత్నించగలరు. ఇతర భాషల నుండి ఎంచిన ఉత్తమ అనువాద కథలు కూడా ప్రచురించే అవకాశాన్ని కూడా పరిశీలించమని మనవి చేస్తున్నాను.*

# 6 నెంబరు గది

## కీ. శే. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

**కథా మార్గదర్శి కథ**

***గది గుమ్మం ముందు మెట్ల మీద గదిలోకి వస్తూ, కలకటా స్లిప్పర్ చప్పుడవుతోంది. కొంప మునిగింది. ఆమె భర్త ఎవరో వచ్చి, భీముడు కీచకుణ్ణి గొంతు నొక్కి చంపినట్టు చంపితే.. 'ఎవరు నువ్వు? ఎందుకు వచ్చావు? దొంగ దొంగ" అని కసికొద్దీ కేకలు వేస్తే? చాలా ప్రమాదంలో పడ్డాను.***

***పక్కా, తెలివయిన పిల్ల.. స్థితి చప్పున గ్రహించింది.***

ఇటూ అటూ కొండలు! మధ్యన బస్సు ప్రయాణం!

జూన్ నాలుగో తారీఖు! కనబడే ప్రతి కంకర గుట్టా ఒక అగ్నిపర్వతమై కూచుంది. ఎండ నిప్పులు చెరిగిపోతోంది. తలకిందులు పక్షులు చెట్లనుంచి రాలి పడుతున్నాయి. రజోగుణ ప్రధానంగా బస్సు పరిగెత్తుతోంది. గంధవరం లోకల్ ఫండ్ సత్రం దగ్గర బస్ ఆగింది. ఒకరిద్దరు ప్రయాణీకులు దిగి, సామాను సత్రం అరుగు మీదికి చేరుస్తున్నారు. నాకింక ప్రయాణం చేసే ఓపిక లేదు. నాలిక తాటితాండ్రలా రసహీనమయపోయింది. శరీరం నిప్పులోంచి పైకి తీసినట్టయింది. మావాడు అప్పుడే ఒక 'లెమన్ క్రష్' పుచ్చుకుని, పట్టణ సమానీత 'ఖారాకిళ్ళీ' ఒకటి ఎడంబుగ్గన పదిలపరచి, పత్రిక విప్పాడు, తక్కిన 15 మైళ్ళ ప్రయాణానికి బద్ధకంకణుడై! ప్రయాణాల్లో మాత్రం మావాడు "అరియు తేరిన వృద్ధమూర్తి." నేనో వట్టి మెతక. నానీమ బాపతు!

మావాణ్ణి ఎట్లాగో బతిమాలి, అప్పటికి ప్రయాణం ఆపి, మర్నాడు ఉదయం బస్సులో ప్రయాణం చేయడానికి ఒప్పించాను. పెట్టెలు, బెడ్డింగులు దింపి సరాసరి సత్రంలో ప్రవేశించి, మంచిగదిలో సామాను సర్దించి గుమాస్తాను కుశలప్రశ్న వేసి మాట్లాడుతున్నాడు మావాడు. వాడికా ప్రాంతమంతా కొట్టినపిండి. నేను ముఖం కడుక్కుని, గుమస్తాగారి కూజాలోని మంచినీళ్ళు సగానికి పైగా పీల్చి, వడగొట్టిన ప్రాణాన్ని గదిలో పరుపు చుట్టకు చేరవేసి, ఒక 'పాసింగ్ షో' వెలిగించి స్థిమితపడుతున్నాను.

'హల్లో' అంటే 'హల్లో' అని ఒకరినొకరు పలకరించుకుని... మావాడు, మరో ఆయన కులాసాగా మాట్లాడుకుంటూ గదిలో

ప్రవేశించారు. కొత్తాయన పచ్చగా, పల్చగా చాకులా వున్నాడు. కొత్తతరహా కళ్ళజోడు, చేతిలో లెదర్‌బ్యాగ్ వుంది. రైల్వే నావెల్‌లా చులాగ్గా సరదాగా మాట్లాడుతున్నాడు.




మావాడు ఉభయపక్షాల పరిచయం చేశాడు. “ఈయన నాకు ముఖ్య స్నేహితుడు. ఇన్సూరెన్స్ ఏజెంట్. పేరు గణేశంగారు! సరదా మనిషి. సంగీతంమీద చాలా అభిమానం... ఈయన మా అన్నగారు ఫలానా. బహుశా ఎరిగే వుంటారు!”

ఆధునిక మర్యాదగా ఉభయులం నమస్కరించుకుని, అంతా లోకాభిరామాయణంలో పడ్డాం. సిగరెట్ల హోమం పూర్ణాహుతిగా సాగుతోంది. ప్రణయకలాపం మొదలు, పొగాకు పన్ను దాకా మా ఇష్టాగోష్టి పరిగెత్తుతోంది. గణేశంగారు సిగరెట్ పీకెను బయటికి విసరడానికి ద్వారందాకా వెళ్ళి, తిరిగి వస్తూ తలుపు వైపు ఆశ్చర్యంగా, నిదానంగా చూసి ఫక్కున నవ్వాడు.

“ఎందుకట్లా నవ్వుతున్నారు?” అన్నాడు మావాడు కుతుకంగా.

గణేశం మళ్ళా నవ్వి అన్నాడు, “చూశారూ, తలుపు మీద నెంబరు 6. సుమారు సంవత్సరం కిందట ఇక్కడ ఒక చిత్రం జరిగింది. తలుచుకున్నప్పుడల్లా నవ్వొస్తుంది!” అని నావైపు తిరిగి “అన్నగారూ, సమయస్ఫూర్తి చెప్పవలసి వచ్చినప్పుడు ఆడవాళ్ళదండి! ఒక్కొక్క క్రిటికల్ సిట్యుయేషన్‌లో, స్త్రీ ఠస్సా వేసిందంటే బ్రహ్మభేద్యంగా వుంటుంది. లేకపోతే ఆనాడు నా భవిష్యం పోయి, అమర్యాద పాలైపోయి వుందునంటే నమ్మండి.”

"ఏం జరిగిందేమిటండీ?" అన్నాను కుతూహలంగా... పరుపును జేరబడ్డవాడను లేచి కూర్చుని.

గణేశం కొత్త సిగరెట్ సంధించి దాని అంచుకు సవరించి అంటించి 'ఏం జరిగిందంటే' అని ఉపక్రమించాడు.

★★★

"ఒకసారి మా కంపెనీ ఆర్గనైజరు మంగపతిరావు నాయుడుగారూ, నేనూ నెలరోజులు ఈ సత్రంలో మకాం వేశాం. ముందుగా నేనూ, తర్వాత వారంరోజులకు ఆయనా వచ్చి, చెరోగదిలోనూ వున్నాం. ఆ ఎదురుగా కనబడే తూర్పువైపు పెద్దగదిలో నా బస! బిజినెస్ కోసం నానాశ్రమలూ పడ్డాం. మా నాయుడు బీమా విషయంలో మహా ఘటికుడు. ప్రజలు త్రిప్పినన్నాళ్ళు తిరిగి, చివరికి పాతిక మందిని పడగొట్టి, సుమారు ఏభైవేల దాకా బిజినెస్ చేయించి నాతో అన్నాడు 'చూశావా పంతులూ! ఈ వ్యాపారంలో పట్టుగుంటే మరి వదలగూడదు. ఇదే పప్పుదప్పళం బ్రాహ్మడైతే విసుగెత్తి పారిపోను' అని విజయశంఖం ఊదాడు.

నిజానికి మా నాయుడికి బ్రహ్మద్వేషం లేదు. మంచి సాయిలా ఫాయిలా మనిషి. బ్రాహ్మణ యువకుల్లోని నిర్వ్యాపారత చూస్తే అతనికి కోపం. వింతమనిషి లెండి. సంగీతమంటే ప్రాణం. కవిత్వమంటే తిట్టేవాడు. ఆ వేళతో మా బిజినెస్ అంతా పూర్తి అయిపోయింది. వ్యాపారం పట్ల పెద్దపులిలా మీద పడే నాయుడు, ఆ రోజున నవనీతంగా మారి, పరమహుషారుగా వున్నాడు. తెల్లవారితే ప్రయాణం కట్టి విశాఖపట్నం వెళ్ళిపోతాడు. ఆ రాత్రి, ఈ నెలరోజుల్లోనూ స్నేహితులైన చుట్టుపట్లవారిని నలుగురిని పోగుచేసి, తన గదిలో గానాబజానా ఏర్పాటు చేశాడు. ఈనాటి మార్కెట్టులో చెలామణీ అయ్యే తెలుగు, హిందీ సినిమాపాటలు క్షుణ్ణంగా పాడే ఒక కుర్రాణ్ణి సంపాదించి తీసుకొచ్చాను నేను! నాయుడు గది అంతా మంచిరకం అగరవత్తులు వెలిగించి, బత్తాయితొనలు, ఏపిలు ముక్కలూ, బిస్కెట్లు రెండు మూడు పళ్ళాల్లో అమర్చాడు. పైనాపిల్, విమ్ టోరోజ్ ఇత్యాది డ్రింకులు రెండు కేసుల్లో సిద్ధంగా వున్నాయి. చుట్టల కట్టలు, సిగరెట్ టిన్నులు వగైరా ఉత్సాహసామగ్రి జాగర్తపరచాడు. నేనే పనైనా ముట్టుకోపోతే 'మీరు శ్రమపడితే నేను ఒప్పను. మీరు కూడా నాకీవేళ ఒక విలువైన అతిథిగా వుండాలి' అని నవ్వుతూ అజ్ఞాపించి, ఆ సంగీతపు కుర్రాడికి కీ ఇచ్చి విడిచి పెట్టాడు. వాడు 'నిద్ర మేలుకోరా తమ్ముడా' మొదలు 'సుఖ్ కే దుఖ్ కే' దాకా అమృతప్రవాహంలా, తారాజువ్వలా పాడుకుపోతున్నాడు. మిత్రులంతా డ్రింకులు సేవిస్తూ, పొగలు కక్కుతూ తన్మయంగా సంగీతంలో తలమునకలై వింటున్నారు. చీమ కదిలితే వినబడుతోంది. ఈ సంగీత కోలాహలానికి, ఎక్కడి నుంచి వచ్చి పడ్డదో... ఒక జనప్రవాహం గదిలోకి కొట్టుకువచ్చింది. అంతా ఒక సైజు కుర్రాళ్ళు, షరాయిలు, గళ్ళ లుంగీలు, లాల్చీలు, చేతుల్లేని బనియన్లు... అంతా నవనాగరిక జాతి! క్రితంరోజున అనకాపల్లినుంచి పెళ్ళివారొకరు నాలుగుబళ్ళతో వచ్చి సత్రంలో దిగారు. ఇప్పుడు మనం కూర్చున్న ఈ ప్రాంతం అంతా పెళ్ళివారితో నిండి పోయింది. వారంతా ఏదో పెద్ద కుటుంబాలకు చెందినవారు. స్త్రీలు, పురుషులూ చాలా 'స్టయిలిష్' గా వున్నారు. అవి బాణాసంచాలు కావు, ఊరేగింపులు కావు, 'మేజువాణీలు కావు, ధణుతెగరగొట్టేశారు. రాత్రి ఒక రెప్పపాటు నిద్ర లేదు. పంచాగ్ని, మధ్యంలా వారి మధ్యన నా గది వుండిపోయింది. కాని, తెల్లవారిన తర్వాత వారందరినీ చూస్తే, రాత్రి నిద్రలేని కోపం మంచులా విడిపోయింది. మా నాయుడు పెళ్ళివారి కుర్రాళ్ళని సగౌరవంగా 'రిసీవ్' చేసుకుని బహుధా సత్కరించి కూర్చోపెట్టాడు. పాట మధు సేవలా, నరాల్లో నిషా పుట్టించి ఎవ్వరినీ కదలనివ్వడం లేదు.

ఉత్తరంవైపు హాల్లో పెళ్ళివారి ఆడవారు నవ్వులతో, హాస్యాలతో మహా హడావిడిగా సాగించే బంతులాట కూడా పూర్తి కావచ్చింది. ఒక్కరొక్కరే లేచి వెళుతున్నారు. గాజులైట్లు మసకగా వెలుగుతున్నాయి. నాకు నిద్ర కూరుకువస్తోంది. నాయుడుగారు చూస్తే కదలనివ్వరు. దగ్గి ఇవతలికి వచ్చి నా గది వైపు జారాను.

★★★

నిద్రకళ్ళతో వెళ్ళి నా గది తలుపులు తోశాను. తలుపు విడుతుండగానే, తల తిరిగిపోయేటంత సన్నజాజి పూలవాసన గుప్పున కొట్టింది. నాకు ప్రాణం లేదు. నెల్లాళ్ళ నుంచి ఈ సత్రపు కొయ్యబల్లల మీద నిర్బంధ బ్రహ్మచర్యం ఆచరించే నా గదిలోంచి, ఈ 'మగువ పాలవు దెలుపు నొక్క మారుతం' ఏమిటి?

నిద్ర కళ్ళను బాగా తెరవడానికి ప్రయత్నిస్తున్నాను. ఒకవేళ నాయుడుగారి గదిలోనే వుండి పాట సుఖంలో 'తియ్యని కలలు కనడం లేదు గదా!' అనుకున్నాను. కళ్ళు విదిలించి మళ్ళా నిదానంగా చూశాను. సందేహం లేదు. ఎదుట కనబడేది చక్కని పదహారేండ్ల అమ్మాయి. సన్నని తెల్ల జరీచీర కట్టుకుంది. జడనిండా జాజిపూలు. గోడవైపు తిరిగి, కాంపు కాట్ మీద పరుపు దులిపి పక్కవేస్తున్నది. హరికేన్ లాంతరు ఒకటి బాగా తగ్గి వెలుగుతోంది. ఇదేమిటి? ప్రవరాఖ్యుడి ప్రాణానికి వరూధినిలా... నా మార్గంలో ఈవిడెట్లా వచ్చి పడ్డది! ముప్పావు గంట కిందట తలుపుల దగ్గరగా జేరవేసి వెళ్ళిన గదిలో, ఈ అప్సరస ఎట్లా పుట్టుకొచ్చిందీ? ఈ తలలోని ప్రశ్న పరంపరలతో ఆలోచిస్తూ అప్రయత్నంగా నాలుగుడుగులు గదిలోకి వేసాను. "అమ్మయ్య! సంగీతం ఇప్పటికైనా మిమ్మల్ని విడిచిపెట్టింది" అని తిరిగి చూచి, హఠాత్తుగా నోటమాట రాక నివ్వెరపడిపోయింది.

నేనూ అట్లా గుడ్లప్పగించి చూస్తున్నాను. చట్టున తెలివి తెచ్చుకుని, రెండడుగులు వెనక్కి వేసి తిరిగి చూడకుండా వెళ్ళిపోతే సమస్యే తెగిపోను. కాని మెదడు పనిచెయ్యదు. అడుగు ముందుకూ వెనక్కూ పడదు. ఒక్కొక్కప్పుడు హఠాత్తుగా ఏ అపూర్వ రాజాంతఃపురములోనో వెళ్ళి పడ్డట్టు కల వస్తుంది. అద్భుత సౌందర్యంతో మెరసిపడుతూ, రాణి చెలికత్తెలతో విహరిస్తూ కనపడుతుంది. వెనక తళతళలాడే విచ్చుకత్తుల పారాలు, సిపాయిలు, రాజదండనం... తలపునకు వచ్చి హడలిపోతాం. కళ్ళు ఎదటి సౌందర్యప్రవాహాన్ని ఆబగా తాగుతూ వుంటాయి. చప్పున నాలుగడుగులు వెనక్కి వేసి పారిపోతే ప్రమాదం తప్పిపోతుంది. కాని, అవయవాలు పనిచెయ్యవు. మనస్సుకూ ఇంద్రియాలకూ సహజ నిరాకరణం! నాలుగు సెకన్లు గడిచివుంటాయి. గదిగుమ్మం ముందు మెట్లమీద గదిలోకి వస్తూ, కలకటా స్లిప్పర్ చప్పుడవుతోంది. కొంప మునిగింది. ఆమె భర్త ఎవరోవచ్చి, భీముడు కీచకుణ్ణి గొంతునొక్కి చంపినట్టు చంపితే... 'ఎవరు నువ్వు? ఎందుకు వచ్చావు? దొంగ దొంగ" అని కసికొద్దీ కేకలు వేస్తే? చాలా ప్రమాదంలో పడ్డాను.

పక్కా, తెలివయిన పిల్ల... స్థితి చప్పున గ్రహించింది. చట్టున కుడిచేత్తో ఎడంచెయ్యి చూపుడువేలు పట్టుకుని, "అయ్యో ఈ వేలు గొడ్డలితో... చీల్చినట్లు బాధపెడుతోందండి. అన్నయ్యగారూ! మీకు మంత్రం ఒచ్చునేమో వెయ్యండి. అయ్యో బతికే బాధ కాదండి ఇది..." అంటూ, మంచంమీద కుప్పగా కూచుని బాధపడుతోంది.

పాపం జుట్టు చెదిరిపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. అంత చక్కనిముఖం, బాధతో అట్లా ముడతలు ముడతలు పడడం చూడలేకపోయాను.

"అమ్మా భయంలేదు. ఒక్కనిమిషం మంత్రం వేస్తే సర్దుకుంటుంది. బాధ వచ్చినప్పుడే ఓర్చుకోవాలి" అక్కడ టేబిలు మీద వున్న జపాను సెల్యులాయిడ్ దువ్వెన తీసి, వేలుమీద మంత్రించడం ప్రారంభించాను.

ఇంతలో కలకటా స్లిప్పర్ల ధ్వని, ఒక పాతికేళ్ళ యువకుడుగా మారి, ఆయన ఆత్రుతగా లోపలికి వచ్చాడు. ఆయన్ను చూచి ఆమె దుఃఖం మరింత హెచ్చింది. "ఇప్పుడే పరుపుతీసి పక్క వేస్తుంటే, ఎక్కడినుంచి వచ్చిందో మాయతేలు చంపేసిందండి. సమయానికి మీరులేరు. అన్నయ్యగారు నా ఏడుపు విని పక్కగదిలోంచి పరిగెత్తుకు వచ్చి మంత్రం వేస్తున్నారు." వేలు వెనక్కు తీసుకుని, చేతుల్లో ముఖం పెట్టుకు కూర్చుంది... ముఖ కవళిక ఏదీ కనపడనివ్వకుండా!

ఆయన దగ్గరగా వచ్చి, "మరి కొంచెంసేపు మంత్రం వేయించుకోరాదూ, బాగా నయంగా వుంటుందేమో!" అన్నాడు పాపం.

అతికష్టం మీద నవ్వాపుకుని నేనన్నాను. "ఇక అక్కర్లేదండి. క్రమంగా అదే నయమవుతుంది. కాస్త మంత్రం పట్టివ్వాలి."

ఆయన చాలా కృతజ్ఞత కనపరుస్తూ "శ్రమ ఇచ్చినందుకు క్షమించాలి. దైవంలా అడ్డు పడ్డారు. థాంక్యూ" అన్నాడు మర్యాదగా.

నిజంగా నాకు దైవంలా అడ్డుపడ్డ ఆయన భార్యకు మనస్సులో నమస్కారం చేశాను. "అబ్బే దానికేమిటండి? బాధపడుతూ వుంటే చూడగలమా? పరిచయం లేకపోయినా చనువు తీసుకున్నందుకు..."

ఆయన అడ్డుకుని "చాల్లెండి ఎంతమాట!" అనగానే, ఆమె వైపు మళ్ళా తిరిగి చూడకుండా, ఆపత్తు దాటినట్టు ఆ గది గుమ్మం దాటి బైటపడ్డాను.

తీరా తలుపు వేపు చూస్తే... అది నా గది కాదు. ఆరో నెంబరు గది! పక్క 5 నెంబరు గదిలో నా బస! ఖర్మం... ఈ సత్రపు గదులన్నీ ఒక అచ్చులో పోత పోసినట్లుంటాయి. ఆ అలమరలు, కిటికీలు, బల్లలు.. అన్ని ఒక్క తరహా! 'ఎంత పని జరిగింది!' అనుకుంటూ నా గదిలోకి వెళ్ళి పడుకున్నాను.

అట్లా చరిత్రాత్మకమైంది ఈ గది! నాటికి నేడు ఈ గదిలో కాలు పెట్టాను" అని నవ్వుతూ గణేశం గారు కథ పూర్తిచేసారు.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక తేదీ. 25.11.1988 నుంచి పునర్ముద్రణ)*

# కథామంజరి
# పాఠకమహాశయులకు
# మనవి!

ప్రతినెలా కథామంజరి సంచిక నమోదు చేసుకున్న పాఠకుల ఇమెయిల్స్‌కి నేరుగా చేరడమే కాకుండా, ఇతర సాంఘికమాధ్యమాలు, కథామంజరి వెబ్‌సైట్ ద్వారా కూడా ఎంతో మందికి సంచిక చేరుతోంది.

అలాగే పాఠకులు కూడా వారివారి బంధుమిత్రులకు ఈ మాధ్యమాల ద్వారా పంపుతున్నారు. ఈ రోజు కథామంజరి దేశ, విదేశాల్లో ఎక్కువ మందికి ఏదో విధంగా చేరుతోంది. పాఠకుల సంఖ్య పెరగడం సంతోషమే! అయితే .. సాంకేతికంగా పత్రిక నిర్వహణకు, కొన్ని వెసులుబాట్లకు .. సంచికను చదివే పాఠకుల సంఖ్య తెలుసుకోవడం అసాధ్యమైన పనే! అంచేత మా మనవి ఏమిటంటే.. కథామంజరి చదివే పాఠకులు ప్రతి ఒక్కరు ఇమెయిల్ నమోదు చేసుకోవలసినదిగా కోరుతున్నాం. మీరు ఇమెయిల్ నమోదు చేసుకోడానికి ఈ లింక్ ని క్లిక్ చేయండి.

వార్షిక చందా రూ.200/-
https://imjo.in/ebrJuh

ఉచిత సంచిక కోసం
https://zcmp.in/K93t

పత్రికకు చందా ఐచ్ఛికమే ఐనా చందా కట్టినా, కట్టలేకపోయినా సరే, పత్రిక అందరికి అందుబాటులోనే ఉంటుంది.

**కథామంజరి బృందం**